బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM



చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు పరామర్శ


సంపుటి 07, సంచిక: 209 | ఆదివారం | 30-06-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00


పిసిసి మాజీ అధ్యక్షుడు

## ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

నేడు నిజామాబాద్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

సిఎం రేవంత్‌రెడ్డితో పాటు రాజకీయ పార్టీలు, ప్రముఖుల సంతాపం



ప్రజాపక్షం /హైదరాబాద్

మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ (డిఎస్) మరణించారు. కొద్ది కాలంగా తీవ్ర ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో శనివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డి.శ్రీనివాస్ అంత్యక్రియలు ఆయన స్వస్థలమైన నిజామాబాద్‌లో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. శ్రీనివాస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అదేశించారు. డిఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు ధర్మపురి సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేయగా,తరువాయి 2లో

మాజీ ఎంపి రమేష్ రాథోడ్ మృతి 03



హైదరాబాద్‌తో సమానంగా

# వరంగల్ అభివృద్ధి

అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నగరాన్ని హెరిటేజ్ సిటీగా అభివృద్ధికి చర్యలు

ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

వరంగల్, హన్మకొండ జిల్లాలో తొలిసారి సిఎం పర్యటన

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి

హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్, హన్మకొండ జిల్లాలలో సిఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి పర్యటించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు సీఎంకు ఘనంగ స్వాగతం పలికారు. తొలుత వరంగల్ జిల్లాలోని మెగా టెక్స్‌టైల్ పార్కును, సెంట్రల్ జైలు స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు,అధికారుల సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని హెరిటేజ్ సిటీగా అభివృద్ధి చేయుటకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్‌కు సంబంధించిన భూసేకరణ పూర్తిచేయాలని సూచించారు.ఈ భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని అన్నారు.నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్ ఉండాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ నుండి మెగా టెక్స్‌టైల్ పార్కుకు కనెక్టివిటి ఉండేలా రోడ్డు మర్గం ఉండేలా తరువాయి 2లో



## ఆ రైతులకు ఇందిరమ్మ ఇళ్లు

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం తమ భూములను ఇచ్చిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హెలికాప్టర్‌లో టెక్స్‌టైల్ పార్కుకు వచ్చిన ఆయన ముందుగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఫొటో ఎగ్జిబీషన్‌ను పరిశీలించారు. పార్కు తరువాయి 2లో

నైతిక పరాజయం పొందినా

## మోదీలో మార్పులేదు

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ విమర్శ

పార్లమెంటులో సమతుల్యత, ఉత్పాదకతను పునరుద్ధరించేందుకు ప్రతిపక్షం కట్టుబడి ఉంది



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 'వ్యక్తిగత, రాజకీయ, నైతిక పరాజయా'న్ని సూచిస్తున్నాయని, అయినప్పటికీ ఏమీ మారనట్లుగానే ఆయన కొనసాగుతున్నారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ విమర్శించారు. ఈమేరకు ఒక పత్రికలో శుక్రవారం ఆమె రాసిన వ్యాసం ప్రచురితమైంది. ఎన్నికల ఫలితాల తరువాత మోదీలో కనీసం స్వల్ప మార్పు లేదా ఫలితాన్ని అర్థం చేసుకున్న భావన కనిపించడం లేదని ఆమె విమర్శించారు. స్పీకర్ పదవిని ఏకగ్రీవంగా ఎన్నుకుందామని ప్రధానమంత్రి ప్రతినిధులు కోరారని, అందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి అంగీకరించిందని, అదే సమయంలో పాత సంప్రదాయాలు, ఆచరణల ప్రకారం ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవి ఆశించడం సమంజసమని అన్నట్లు తెలిపారు. అది అత్యంత కనీస న్యాయమైన వినతి అని, కానీ, ప్రభుత్వానికి అది ఆమోదయోగ్యంగా అనిపించలేదన్నారు. పార్లమెంటులో సమతుల్యత, ఉత్పాదకతను పునరుద్ధరించేందుకు ప్రతిపక్షం కట్టుబడి ఉన్నట్లు సోనియాగాంధీ స్పష్టం చేశారు. మన దేశం 2024 జూన్ 4న స్పష్టమైన, ప్రతిధ్వనించే ఎన్నికల తీర్పును ఇచ్చిందని, ప్రచార సమయంలో తనకు దైవత్వ హోదాను ఆపాదించుకున్న ప్రధాన మంత్రికి అది వ్యక్తిగత, రాజకీయ, నైతిక పరాజయమని తెలిపారు. అయినప్పటికీ ప్రధానమంత్రి ఏమి తరువాయి 2లో






## ప్రజలపక్షాన నిలబడదాం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కూనంనేని

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపు నిచ్చారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట ఎజెండా రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఖమ్మంలో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం శనివారం సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన ప్రారంభమైంది. సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ పాలక వర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తుంటే ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా నిలబడాలని ఆయన అన్నారు. భారతదేశ ప్రజలు గత ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారని ఇప్పటికైనా మతోన్మాద శక్తులు దీనిని గమనించి విద్వేషాలకు తిలోదకాలు ఇవ్వాలని ఆయన కోరారు. మోదీ ప్రభుత్వం పేదల పట్ల కక్ష సాధింపు ధోరణిని అవలంభిస్తుందని కార్మికుల విషయంలోను బిజెపి వైఖరిలో మార్పు రాలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించడంతో పాటు కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టాలని చూస్తుందని ఆరోపించారు. మోదీ చెబుతున్నట్లు దేశంలో పరిస్థితి లేదని పెరిగిన నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, కొరవడిన ఉపాధి కల్పన భవిష్యత్తులో అశాంతికి దారి తీసే అవకాశం ఉందని కూనంనేని హెచ్చరించారు. రాష్ట్రంలో బిజెపి పార్లమెంటు ఎన్నికల తర్వాత ఒక ప్రమాదకర శక్తిగా మారుతుందన్నారు. బిఆర్ఎస్‌ను కాంగ్రెస్ చంపే ప్రయత్నంలో ఉంటే బిజెపి బలపడే అవకాశం ఉందన్నారు. దీని పట్ల కాంగ్రెస్ బిజెపియేతర పక్షాలు అప్రమత్తంగా ఉండాలని కూనంనేని సూచించారు. సంక్షేమ కార్యక్రమాల అమలు తరువాయి 2లో

గోబెల్స్‌ను మించిన మోదీ : నారాయణ 03

## బీహార్‌కు ప్రత్యేక హోదా

లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

మోదీకి నితీశ్ భారీ ట్విస్ట్

జాతీయ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసిన జెడియు

పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సంజయ్ ఝా నియామకం



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) మోదీ సర్కార్‌కు భారీ ట్విస్ట్ ఇచ్చింది. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి మెలిక పెట్టింది. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడడానికి జెడి(యు) ముఖ్య వహించిన విషయాన్ని గుర్తుచేసింది. శనివారం నితీశ్ కుమార్ అధ్యక్షతన జెడియు జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ధరల పెరుగుదల, నిరద్యోగం వంటి సమస్యలను నితీశ్ లేవనెత్తారు. వీటిని పరిష్కరించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన జెడియు వ్యక్తం చేసింది. అదే విధంగా బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ, నీట్ పరీక్ష పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు, భవిష్యత్తులో పేపర్ లీక్ ఘటనలు పునరావృతం కాకుండా చట్టం, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు పోటీ, వచ్చే ఏడాది బీహార్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్ కుమార్ నేతృత్వంలో పార్టీ విజయం సాధించడం వంటి తీర్మానాలు చేశారు. దీంతోపాటు ఈ మధ్యే రిజర్వేషన్లను 65 శాతానికి పెంచిన కోటాను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. న్యాయ పరిశీలన, రక్షణ కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ కోటాను చేర్చాలని జెడియు ప్రతిపాదించింది. అలాగే ఈ కోటాను నిరంతరాయంగా అమలు చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఇదే సమావేశంలో ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం సంజయ్ ఝాను నియమించారు. జెడియు జాతీయ కార్యవర్గ సమావేశంలో బీహార్ తరువాయి 2లో



## విశ్వవిజేతగా భారత్

టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఓటమి..

**బ్రిడ్జ్‌టౌన్:** టీ20 ప్రపంచకప్‌ను టీమ్ ఇండియా కైవసం చేసుకుంది. దక్షిణాఫ్రికాతో రసవత్తరంగా జరిగిన ఫైనల్‌లో 7 పరుగుల తేడాతో గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. ఫైనల్‌లో కోహ్లి (76; 59 బంతుల్లో) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సఫారీ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి ఓటమి పాలైంది. క్లాసెన్ (52) అర్ధశతకం, డికాక్ (39), స్టబ్స్ (31) రాణించారు. భారత బౌలర్లు హార్దిక్ 3, అర్ష్‌దీప్ 2, బుమ్రా 2, అక్షర్ 1 వికెట్ తీశారు.

'కాళేశ్వరం' కమిషన్ గడువు

## రెండు నెలలు పొడిగింపు

ఆగస్టు 31 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం విచారణలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ పదవీ కాలం మరో రెండు నెలలు పొడిగించింది. ఈ నెలాఖరుతో గత గడువు ముగిసి పోతున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అందులో భాగంగా ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల నిర్మాణాలపై వచ్చిన ఆరోపణలు, అవకతవకలపై విచారణ జరపడానికి రాష్ట్ర తరువాయి 2లో

## జార్ఖండ్ నుంచి బిజెపి ఔట్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తథ్యం : మాజీ సిఎం హేమంత్ సోరెన్ జోస్యం



**రాంచీ:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి పూర్తిగా తుడిచి పెట్టుకు పోతుందని జార్ఖండ్ ముక్తి మోర్చ నేత, మాజీ సిఎం హేమంత్ సోరెన్ జోస్యం చెప్పారు. శనివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో తన పార్టీ మద్దతు దారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ సిఎం హేమంత్ సోరెన్ మాట్లాడుతూ.. తమపై కుట్ర పన్నిన వారికి తగిన విధంగా సమాధానం చెబుదామని తన మద్దతు దారులకు ఆయన పిలుపు నిచ్చారు. బిజెపిని శవ పేటికలో పెట్టి.. పూడ్చి పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. భారతదేశంలో సామాజిక నిర్మాణాన్ని నాశనం చేసేందుకు బిజెపి ప్రయత్నించిందన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు గమనించారని తెలిపారు. అందుకే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. అయితే జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని బిజెపి పగటి కలలు కంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోని అదివాసీ ముఖ్యమంత్రులను రబ్బర్ స్టాంపులుగా మార్చిందని ఆయన మండిపడ్డారు. జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికలు అనుకున్న సమయం కంటే ముందే నిర్వహించనున్నారని చెప్పారు. అందుకు సంబంధించిన సమాచారం తన వద్ద ఉందని ఆయన పేర్కొన్నారు. అందుకు తాము సిద్ధంగా ఉన్నామని తరువాయి 2లో

## లౌకిక పార్టీల ఐక్యతే లక్ష్యం

సోరెన్ విడుదలపై రాజా హర్షం



**రాంచీ:** మతతత్వ ఫాసిస్టు శక్తులపై పోరాటానికిగాను ఇండియా ఐక్య సంఘటన కిందకు అన్ని ప్రజాస్వామిక లౌకిక పార్టీలను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. లౌకిక పార్టీల ఐక్యతకు జేఎంఎం నేత, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ విడుదల దోహదమవుతుందన్నారు. హేమంత్ సోరెన్‌కు బెయిల్ లభించడాన్ని రాజా స్వాగతించారు. ఆయన శనివారం జార్ఖండ్ రాజధాని తరువాయి 8లో

కొత్త రేషన్ కార్డుల కోసం

## ఎదురు చూపు!

కార్డు లేక ప్రభుత్వ పథకాలకు దూరం

గృహజ్యోతి, మహాలక్ష్మి సబ్బిడీ సిలిండర్లుకు అనర్హులు

ఎన్నికలు ముగిసినా మొదలుకాని ప్రక్రియ

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి



కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రజలలో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం కొత్త కార్డులకు శ్రీకారం చుడుతుందనే ఆశతో పేద,మధ్య తరగతి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టగా,ఈ పథకాలన్నింటికి రేషన్ కార్డులే ప్రామాణికంగా తీసుకుంటోంది. అయితే అర్హులకు న్యాయం జరిగేందుకు కొత్త కార్డులను మంజూరు చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి తరువాయి 8లో

## మారిషస్ అధ్యక్షుడు ఎవరో తేలేది నేడే



మారిషస్ దేశ అధ్యక్ష పదవికి శనివారం ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత అధ్యక్షుడు మహమద్ ఔల్ద్ గజౌని (67) మరోసారి పోటీలో ఉన్నారు. మాజీ సైనికుడు అయిన గజౌని తాను తిరిగి అధికారంలోకి వస్తే పెట్టుబడి దారుల అనుకూల విధానాలను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమ ఆఫ్రికాలో 50 లక్షల జనాభా కలిగిన మారిషస్ దేశంలో అపార మైన సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. ఆ దేశంలో పేదరికం ఎక్కువ. శనివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగింది. ఆదివారం నాడు ఫలితాలు వెలువడనున్నాయి. 2019లో మొదటి సారి అధ్యక్షుడిగా ఎన్నికైన గజౌనిపై ఈ సారి ఎన్నిక లలో ఆరుగరు తలపడుతున్నారు. అందులో బానిస వ్యతిరేక ఉద్యమకా రుడు బిరమ్ దా అబేద్ ముందంజలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయన రె 18 శాతం ఓట్లతో రెండవస్థానంలో నిలిచారు. ఇతర ప్రత్యర్థులలో న్యాయ వాది ఇద్ మొమదన్ ఎం బారెక్, ఆర్థికనిపుణుడు మహమద్ లిమైన్ ఎల్ మురాజీ ఎల్ వఫీ, హమాది సిది ఎల్ మొఖ్తార్‌లు ఉన్నారు. మొత్తం 20 లక్షల మంది ఓటర్లుగా నమైదయ్యారు. అవినీతి, ఉద్యోగాల కల్పన ఎన్ని కల ప్రధాన ప్రచారాంశాలుగా నిలిచారు.

## నేడు ఫ్రాన్స్ మొదటి దశ ఎన్నిక



ఫ్రెంచ్ ఓటర్లు ఆదివారం మొదటి రౌండ్ ఓటింగ్‌లో పాల్గొననున్నారు. జాతీయ అసెంబ్లీలో 577 స్థానాలకు రెండు రౌండ్‌లలో ఎన్నికలు జరగను న్నాయి. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బతో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మ్యాక్రాన్ ఆకస్మిక ఎన్నికలకు వెళ్ళారు. అయి తే అధికార పార్టీ మూడవ స్థానంలో నిలబడనుందని అన్ని సర్వేలు చెబు తున్నాయి. ప్రధాన పోటీ లీ పెన్ నేతృత్వంలోని ఎన్ఆర్ పార్టీకి, వామపక్ష కూటమి నేషనల్ పాపులర్ ఫ్రంట్‌ల నడుమ సాగుతోంది. ఆదివారం ఉద యం 6 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటల వరకు ఇది సాగుతుంది. జాతీయ అసెంబ్లీలో మెజారిటీ సాధించాలంటే ఏదైనా పార్టీ లేదా కూటమి 289 స్థానాలు సాధించాల్సి ఉంటుంది. ఆది వారం జరిగే ఎన్నికల్లో ఓటింగ్ 25 శాతం దాటి, ఎవరైనా అభ్యర్థి సంపూర్ణ మెజారిటీ సాధిస్తే అదే రోజు ఆ స్థానం ఫలితాన్ని ప్రకటిస్తారు. ఒకవేళ ఈ రెండు షరతులు పరిపూర్తి కాకపోతే, జూలై 7న రెండవ రౌంట్ ఎన్నికను నిర్వహిస్తారు. మొదటి రౌండ్‌లో కనీసం 12.5 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థులే రెండవ రౌండ్‌లో బరిలో ఉండేందుకు అర్హులవుతారు.

# మరోసారి జులై 5న ఇరాన్ అధ్యక్ష ఎన్నిక

### శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎవరికీ దక్కని ఆధిక్యత
### నాలుగు దశాబ్దాలలో అత్యల్ప పోలింగ్

ఇరాన్ అధ్యక్ష పదవికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎవరికీ స్పష్టమైన ఆధి క్యత రాకపోవడంతో జూలై 5న మరోసారి ఎన్నికలు జరగనున్నాయి. సంస్క రణవాది మసౌద్ పెజెష్కేయిన్, అతివాది సయీద్ జలీలీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆరు కోట్ల ఇరానీ ఓటర్లలో కేవలం 40 శాతం మాత్రమే శుక్రవారం జరిగిన పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో 1979 తరువాత అతి తక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొ నడం ఇదే ప్రథమం. పోలైన సుమారు రెండున్నర కోట్ల ఓట్లు లెక్కించే వరకు పెజెష్కేయిన్‌కు అత్యధికంగా కోటిన్నర ఓట్లు పోలయ్యాయి. తరువాతి స్థానంలో సయీద్ జలీలీకి 90.4 లక్షల ఓట్లు పోలయ్యాయి. పార్లమెంటు స్పీకర్, సంప్రదాయవాది మహమ్మద్ బాగేర్ ఘాలిబాఫ్‌కు 30.38 లక్షల ఓట్లు, మరొక ఇస్లామిక్ నాయకుడు మొస్తఫా పౌర్‌మహమ్మదీకి 2 లక్షల ఓట్లు లభించాయి. మరో ఇద్దరు అభ్యర్థులు టెహరాన్ మేయర్ అలీరెజా జకానీ, ప్రభుత్వ అధికారి అమీర్ హొస్సేన్ ఘాజీజాదే హాషేమిలు పోటీ నుండి వైదొలిగారు. వారిరువురితో పాటు మూడవ స్థానంలో నిలిచిన ఘాలి బాఫ్‌లు వచ్చే శుక్రవారం జరిగే పోలింగ్‌లో జలీలీకి ఓటు వేయాలని కోరారు. ఇరాన్ అధ్యక్షుడు ఎబ్రాహిమ్ రైసీ, మరో ఏడుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మే 19న మరణించిన నేపథ్యంలో నూతన అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం 50 రోజులలో ఈ ప్రక్రియ పూర్తి కావాలి. గడిచిన నాలుగేళ్ళలో జరిగిన ఎన్నికలలో మాదిరిగానే గత శుక్రవారం జరిగిన ఎన్నికలలో కూడా తక్కువ ఓటింగ్ నమోదైంది.





## శాంతియుత అభివృద్ధి మార్గంలోనే చైనా : జింగ్ పింగ్

### ఐదు సూత్రాల 70వ వార్సికోత్సవ సభలో చైనా అధ్యక్షుడు ఉద్ఘాటన



శాంతియుత అభివృద్ధి మార్గం, అన్ని దేశాలతో స్నేహం, సహకారం అభివృద్ధి, ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి అభివృద్ధిని పెంపొందించుకోవాలనే చైనా నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని చైనా అధ్య క్షులు జీ జింగ్‌పింగ్ అన్నారు. 'పంచ సూత్రాల శాంతియుత సహజీవనం' 70వ వార్షికోత్సవం సందర్భంగా బీజింగ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఏడు దశాబ్దాల క్రితం నాటి చైనా ప్రధాని జౌ ఎన్‌లై ఐదు సూత్రాలను తొలిసారిగా ముందుకు తీసుకువచ్చారని జింగ్ పింగ్ అన్నారు. సార్వభౌమత్వంపై పరస్పర గౌరవం, సరిహద్దు సమగ్రత, పరస్పర దురాక్రమణకు నివారణ,ఒకరి అంతర్గత వ్యవహారాలలో మరొకరు పరస్పర జోక్యం చేసుకోకపోవడం, సమానత్వం, పరస్పర లబ్ది, శాంతియుత సహజీవనం అనేవి ఐదు సూత్రాలు అని పేర్కొన్నారు. గడిచిన 70 ఏళ్ళలో ఐదు సూత్రాలు కాల పరీ క్షలో నిలదొక్కుకున్నాయని, , మరింత ధృడంగా, నిత్య ప్రాసంగికతతో కొనసాగుతున్నాయని జింగ్‌పింగ్ ఉద్ఘాటించారు. అవి మరింత విస్తృ తంగా, కలుపుకొనిపోయేవిధంగా, అంతర్జాతీయ సంబంధాలు, అంతర్జా తీయ మౌలిక సూత్రాలకు కనీస నిబంధనలుగా నిలిచాయన్నారు. మానవ పురోగతిలో చారిత్రకంగా చెదరని ముద్ర వేశాయని అన్నారు. ఈ ఐదు సూత్రాలు అంతర్జాతీయ సంబంధాలు, అంతర్జాతీయ చట్టాలకు చారిత్రక ప్రమాణంగానిలిచాయన్నారు. విభిన్న సామాజిక వ్యవస్థలు కలిగిన దేశాల మధ్య సంబంధాలకు ఐదు సూత్రాలకు ప్రాథమిక మార్గదర్శిగా ఉన్నాయని చెప్పారు. చరిత్ర ఒక తరం నుండి మరొక తరానికి అందుతోందని, ఒక దశ నుండి మరొక దశకు మానవ ప్రగతి కొనసాగుతోందన్నారు. డెబ్భై ఏళ్ళ తరువాత ఎలాంటి ప్రపంచాన్ని నిర్మించాలి, ఎలా నిర్మించాలి అనే చారి త్రక ప్రశ్న సవాలు విసురుతుందన్నారు. సమయం వచ్చిన ప్రతిసారి మాన వాళి పరస్పర భవిష్యత్తు కోసం సమూహాన్ని ప్రతిపాదిస్తూ చైనా సమాధా నమిస్తుందన్నారు. ఐదు సూత్రాల స్ఫూర్తితో మానవాళి పరస్పర భవిష్యత్తు కోసం సమూహ నిర్మాణమనే దృష్టితో ముందుకుసాగుతామని చైనా అధ్య క్షుడు జింగ్ పింగ్ అన్నారు. 'మీ పొరుగువారితో దయతో ఉండండి', 'స్నేహం ద్వారా నిజాయితీని కోరండి', 'అన్ని దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందించండి' అనేవి చైనా సంప్రదాయ విలువలలో నాటుకుపోయా యన్నారు.

## మరికొన్ని నెలలు అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్



బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ స్పేస్ క్యాప్సుల్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మరికొన్ని నెలలు ఉండనుంది. అందులో ఉన్న భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్ మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మరికొద్ది రోజులు పరీక్షలు చేయనున్నారు.వారు జూన్ 5న అంతరిక్ష ప్రయాణానికి వెళ్ళారు. నాసా ఇంజినీర్లు స్టార్‌లైనర్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. అయితే, అంతరిక్ష కేంద్రంలో పరీక్షలు పూర్తయ్యే వరకు భూమిపైకి తిరిగి వచ్చే తేదీని నిర్ణయంచలేమని నాసా కమర్షియల్ ప్రోగ్రామ్ మేనేజర్ స్టీవ్ స్టిచ్ పేర్కొన్నారు. వ్యోమగాములు ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడిం చారు. స్టార్‌లైనర్ మిషన్ వ్యవధిని 210 రోజులకు పొడిగించాలనుకుంటు న్నట్లు చెప్పారు. దీంతో తర్వలోనే భూమికి చేరుకుంటుందని భావించిన ఈ స్పేస్ క్యాప్సుల్ మరి కొన్ని నెలలు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనే ఉండనుంది.

## ఆ రైతులకు ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పురోగతిపై సమీక్షించారు. స్థానిక పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సీ ఎం దృష్టికి రైతులకు ఇంటి స్థలాల పంపిణీ సమస్యను తీసుకువచ్చారు. పార్కు కోసం భూములిచ్చిన రైతులకు ఒక్కో ఎకరానికి 100 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తుండగా అందులో ఇందిరమ్మ ఇళ్ల కింద ఇంటి నిర్మాణం కోసం రూ. 5లక్షల సాయం అందించాలని సీఎం ఆదేశించారు. ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసి విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తది తర సదుపాయాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్నా రు. ఇంటి స్థలం కేటాయించకుండా మిగిలి ఉన్న 121 మంది రైతులకు పైలాన్ సమీపంలో త్వరగా ఇంటి స్థలాలను కేటాయించాలని ఆదేశిం చారు. టెక్స్‌టైల్ పార్కు ప్రాంతం వర్షపు నీటితో బురదమయంగా మారు తుండటంతో 10 ఎకరాల స్థలంలో స్టోరేజీ ట్యాంకును ఏర్పాటుచేసి నీటిని అందులోకి పంపాలన్నారు. దీని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరగా ఇప్పటికే రూ. 50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికా రులు వివరించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ని ర్మాణం, పురోగతి, వసతులపై సీఎంకు వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కు సందర్శన ముగించుకొని రోడ్డు మార్గాన వరం గల్ వెళ్తుండగా ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద జిల్లా కాంగ్రెస్ నాయకుడు వీర గోని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయిపై గులాబి పూల వర్షం కురిపించి కార్యకర్తలు జై రేవంత్ అంటూ పెద్దగా నినాదాలు చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయి ఆపి అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు.

## జార్ఖండ్ నుంచి బిజెపి ఔట్

(మొదటి పేజీ తరువాయి)

హేమంత్ సోరెన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మనీ లాండరింగ్ కేసులో బీర్సా ముండా జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన కొన్ని గంటలకే హేమంత్ సోరెన్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ఆ రాష్ట్రంలో రాజకీ యంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు ఈ ఏడాది జనవరి 5వ తేదీన భూ కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో జెఎంఎం నేత, మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను ఇడి అరెస్ట్ చేసింది. దీంతో దాదాపు 5 నెలలుగా ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఆ క్రమంలో పలుమార్లు తనకు మధ్యంతర బెయిల్ మంజురు చేయాలంటూ పలు కోర్టులను ఆయన ఆశ్రయించారు. కానీ ఆయనకు బెయిల్ మాత్రం లభిం చలేదు. అయితే జార్ఖండ్ హైకోర్ట్ హేమంత్ సోరెన్‌కు శుక్రవారం ఉదయం బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి విడుద లయ్యారు. ఇంకోవైపు జార్ఖండ్‌లో మొత్తం 18 లోక్‌సభ స్థానాలున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి 8 స్థానాలు గెలుచుకోంది. సోరెన్ పార్టీ జెఎంఎం మూడు ఎంపి స్థానాలు, కాంగ్రెస్ రెండు, ఎజెఎ స్‌యు ఒక్క ఎంపి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఇక జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివరలో హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు జరగనున్న సంగతి తెలిసిందే.

## బీహార్‌కు ప్రత్యేక హోదా

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, జెడియు అధినేత నీతీశ్ కుమార్, కేంద్ర మంత్రులు లాలన్ సింగ్, రామ్ నాథ్ ఠాకుర్, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు.

**మోదీకి బీహార్‌పై ప్రత్యేక శ్రద్ధ**

జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం అయిన తర్వాత సంజయ్ ఝా తొలిసారిగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌పై ఎల్లప్పుడూ శ్రద్ధ చూపుతారని, తమ ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ డిమాండ్ నెరవేరు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పార్టీని విస్తరించేందుకు కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. వచ్చే ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు–బిజెపి కూటమి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడా నికి అన్ని బలాలతో ముందుకొస్తుందని పేర్కొన్నారు.

## ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

చిన్న కొడుకు ధర్మపురి అర్వింద్ కుమార్ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యు లుగా ఉన్నారు.

**డిఎస్ జీవిత సంగ్రహం :** ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం నేతగా రాజకీయ ఆరంగ్రేటం చేసిన డి.శ్రీనివాస్, యువజన కాంగ్రెస్‌లో రాజకీయ ఓనా మాలు నేర్చుకుని అంచలంచెలుగా ఎదిగారు. 1989లో నిజామాబాద్ (ప ట్టణ) కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంఎల్‌ఏగా పోటీ చేసిన డి.శ్రీనివాస్, టిడిపి అభ్యర్థి డి.సత్యనారాయణపై గెలుపొంది మొదటిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆయన మంత్రి వర్గంలోను స్థానం సంపాదించారు. 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాధ్యతలను స్వీకరించిన ఆయన 1999లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి యెండెల లక్ష్మీ నారాయ ణపై విజయం సాధించడమే కాకుండా గ్రామీణ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి బాధ్యతలను నిర్వర్తించారు. తిరిగి 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసిసి బాధ్యతలను చేపట్టిన శ్రీనివాస్ అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సతీష్ పవార్‌ను ఓడించి అప్పటీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఉన్నత విద్యా, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖ మంత్రిగా పనిచే శారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వేత్తున ఎగిసిన పడుతున్న ఆ సమయంలో 2009లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి యెండెల లక్ష్మి నారాయణ చేతిలో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన తర్వాత జరిగిన 2014లో జరి గిన ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చేతిలో వరసగా రెండు సార్లు ఓటమి చవిచూశారు. ఇదేక్రమంలో ఆయన 2015లో జూలైలో కాంగ్రెస్ పార్టీని వీడి అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ తరపున 2016 జూన్ 26న డి.శ్రీనివాస్ రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆ పదవిలో 2022 జూన్ 22 వరకు కొనసాగారు.

**సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం:** ధర్మపురి శ్రీనివాస్ మరణం పట్ల ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యు లకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పిసిసి అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించిన డిఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని సిఎం కొనియాడారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డిఎస్ రాజకీయ నేతలెందరికో ఆద ర్శంగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నా రని రేవంత్‌రెడ్డి గర్తు చేసుకున్నారు.

**సిపిఐ సంతాపం :** మాజీమంత్రి డి శ్రీనివాస్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసి అనేక సేవలందించారని కూనంనేని సాంబశివరావు సంతాప సందేశంలో కొనియాడారు. పిసిసి అధ్యక్షుడిగా, మాజీ మంత్రిగా డి.శ్రీనివాస్ ఆదర్శప్రా యంగా పనిచేశారని, ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ జీవితాంతం కొనసాగించారని చాడ వెంకట్‌రెడ్డి తన సంతాప ప్రకటనలో కొనియాడారు. వామపక్షాలతో శ్రీనివాస్ సన్నిహితంగా ఉండేవారని ఆయన గుర్తు చేశారు.

**డి.శ్రీనివాస్‌కు ప్రముఖుల నివాళి :** మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మరణం పట్ల పలువురు ప్రముఖులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో డి.శ్రీనివాస్ భౌతికకా యానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి డి.శ్రీధర్ బాబు, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ కాంగ్రెస్ కప్పి పూలమాలాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డి.శ్రీనివాస్ మరణానికి సంతాప సూచకంగా పార్టీ కార్యాలయంలో గాంధీభవన్‌లో పార్టీ జెండాను అవనతం చేసి నివా ళులు అర్పించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టిపిసిసి కార్యనిర్వహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్ మధు యాష్కి, కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షులు టి.కుమార్‌రావ్, మాజీ మంత్రి కె.పుష్ప లీల, సిజె.శ్రీనివాస్, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్, మాజీ మంత్రులు జి.జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంద్ర కరణ్ రెడ్డి, బిజెపి ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డికె.అరుణ, మండలి విప్ పట్నం మహేం దర్ రెడ్డి, ఎపిసిసి నాయకులు డొక్కా మాణిక్య వరప్రసాద్ డిఎస్ పార్థివదే హాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఇది ఇలా ఉండగా మాజీ ఉపరా ష్ట్రపతి వెంకయనాయుడు డిఎస్ మరణంపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ డిఎస్ రాజకీయాలకు అతీతంగా ఉండేవారన్నారు. డిఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేసారని, బడుగు బలహీన వర్గాలు కోసం ఆయన ఎంతో శ్రమించారని ఎంపి మల్లు రవి కొనియాడారు. తన రాజకీయ ప్రయాణం, జనసేన పార్టీ ఎదుగుదలను డిఎస్ ఎప్పుడూ ఆకాంక్షించే వారని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం పాటుసేవలందించిన డిఎస్ మరణం రాష్ట్ర ప్రజలకు తీరని లోటు అని మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

## మోదీలో మార్పులేదు

(మొదటి పేజీ తరువాయి)

మారనట్లుగానే కొనసాగుతున్నారని అన్నారు. ఆయన ఏకాభిప్రాయ విలువ లను బోధిస్తారని, కాని ఘర్షణాయుత విలువను పాటిస్తారని అన్నారు. రాజ్యాంగంపై దాడి నుండి దృష్టి మరల్చే ప్రయత్నంలో భాగంగానే ప్రధాన మంత్రి, లోక్‌సభ స్పీకర్, బిజెపి నాయకులు పదే పదే ఎమర్జెన్సీ గురించి ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. మన దేశ ప్రజలు 1977 మార్చిలో ఎమర్జె న్సీపై స్పష్టమైన తీర్పును ఇచ్చారనేది చారిత్రక వాస్తవమని, దానిని నిస్సందే హంగా, సందిగ్ధతం లేకుండా స్వీకరించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. 1975లో ఎమర్జెన్సీ విధించడం ద్వారా ప్రధాని ఇందిరాగాంధీ రాజ్యాంగంపై దాడి చేశారని ఖండిస్తూ జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీర్మానాన్ని సభలో కాంగ్రెస్ సభ్యులు నిరసనల మధ్య చదివారు. స్పీకర్ ప్రస్తావనను ప్రధాని మోదీ స్వాగతించారు.

**మూడు నేర చట్టాలను వాయిదా వేయండి**

గత పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ఉభయ సభల నుండి 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి ఆమోదింపజేసుకున్న మూడు నేర చట్టాలను ప్రస్తుత పార్లమెంటు పూర్తి స్థాయిలో సమీక్షించేంతవరకు అమలును వాయిదా వేయా లని సోనియాగాంధీ తన వ్యాసంలో విజ్ఞప్తి చేశారు. నీట్ వివాదం గురించి ప్రస్తావిస్తూ, 'పరీక్షా పే చర్చ'లో మాట్లాడే ప్రధాని , దేశ్యాప్తంగా అనేక మంది కుటుంబాలను నాశనం చేసిన పేపర్ లీకుపై స్పష్టమైన మౌనం పాటిస్తున్నా రని అన్నారు. ప్రజల సమస్యలను ప్రతిపక్షాలు లేవనెత్తుతూనే ఉంటాయని, ప్రధాన మంత్రి, ఆయన ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తారని ఆమె ఆకాంక్ష వ్యక్తం చేశారు. తొలి సంకేతాలు సరిగా లేనప్పటికీ ప్రతిపక్షంగా తాము పార్లమెంటు సమతుల్యత, ఉత్పాదకతను పునరుద్ధరించేందుకు నిబద్ధ తతో పని చేస్తామని స్పష్టం చేశారు.

## రెండు నెలలు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నియమించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని జ్యుడీషి యల్ కమిషన్ పదవీకాలాన్ని ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ ఇరిగేషన్ శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ మార్చి 14న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పదవీ కాలం జూన్ 30తో ముగుస్తున్నది. కానీ విచారణ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవ డంతో మరో రెండు నెలల పాటు పొడిగించాలని నిర్ణయం తీసుకున్నది. ఇప్ప టికే కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన పలువురు అభిప్రాయాలను వెల్ల డించి వాటికి తగిన ఆధారాలను జోడిస్తూ అఫిడవిట్లను సమర్పించారు. ఇప్ప టివరకు దాదాపు 50కు పైగా అఫిడవిట్లు కమిషన్‌కు అందాయి. వాటిని పరి శీలించిన తర్వాత ఓపెన్ హౌస్ డిస్కషన్, క్రాస్ ఎగ్జామినేషన్‌ను జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నిర్వహించనున్నది. కాగా తాజా నిర్ణయంతో వచ్చే వారం నుంచీ ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నది. అవసరమైతే రాజకీయ నాయకు లను కూడా పిలవాల్సి వస్తుందని గతంలో జస్టిస్ పిసి ఘోష్ వ్యాఖ్యానించ డంతో వచ్చే వారం నుంచి ఊపందుకోనున్న ఎంక్వయిరీ ప్రక్రియలో ఎవరికి నోటీసులు జారీ అవుతాయోనన్నది ఆసక్తికరంగా మారింది. కమిషన్ పదవీ కాలం రెండు నెలల పాటు పొడిగించడంతో అప్పటికల్లా తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించే దిశగా కార్యాచరణ ప్రణాళికలో మార్పులు చోటుచే సుకోనున్నాయి.

## ప్రజలపక్షాన నిలబడదాం

(మొదటి పేజీ తరువాయి)

తమ బాధ్యతగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు స్వీకరించాలని కూనంనేని కోరారు. జనాభాలో సగ భాగం ఉన్న యువతను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆక ర్షించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని పాలకులు, పెరిగిన అవినీతి, కొనసాగు తున్న ప్రైవేటు దందాలు వీటన్నింటికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల న్నారు. పార్టీ లేని గ్రామాల్లో సైతం పార్టీ నిర్మాణం లక్ష్యంగా మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పార్టీ సభ్యు లకు ఇక నుంచి నిరంతర రాజకీయ సైద్ధాంతిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మండలం, జిల్లా, రాష్ట్రం యూనిట్‌గా ఈ శిక్షణ ప్రారంభమవు తుందన్నారు.

ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి 99 ఏళ్లు పూర్తి చేసుకుని కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతుందని ఈ సంద ర్భంగా పార్టీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించుకుని శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చూడాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. నారాయణ, అజీజ్ పాషా, జాతీయ కార్య వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

చూడాలన్నారు. నగరంలో స్మార్ట్ సిటి మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాలు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధి పై ఇక నుండి ప్రతి 20 రోజులకు ఒక సారి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. వరంగల్ లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధికి సంబంధించి సంపూర్ణ సహ కారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ,మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పి.బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, యశశ్విని రెడ్డి, రామ చంద్రు నాయక్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి,జిల్లా కలెక్టర్‌లు పి. ప్రావీణ్య,సత్య శారధా దేవి, విపి గౌతమ్, వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, తదిత రులు పాల్గొన్నారు.

**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అంచనా వ్యయం పెంపుపై ఆగ్రహం**

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి అంచనా వ్యయం పెంపుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ సెంట్రల్ జైలు స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి పనులను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలాంటి అప్రూవ్ లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారని ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని, నిర్మాణ వ్యయంపై పూర్తి స్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వ హించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు.

# గోబెల్స్‌ను మించిన మోదీ

## మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ




**ప్రజాపక్షం/ ఖమ్మం:** మోదీ అబద్దాలు చెప్పడంలో గోబెల్స్‌ను మించిపోయాడని భారతదేశ చరిత్రలో ఏ ప్రధాని చెప్పనన్ని అబద్దాలు చెప్పి ఆయన రికార్డును సొంతం చేసుకున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. అతి తక్కువ మెజార్టీతో గెలిచిన ప్రధాన మంత్రిగా కూడా ఆయన అపకీర్తిని మూటకట్టుకున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ కాదని ఆయన మాటల్లో వాస్తవికత లేకపోవడం వల్లే బిజెపి 305 స్థానాల నుండి 240 స్థానాలకు పడిపోయి చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు బీహార్ నితీశ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పై ఆధారపడి పాలన సాగించాల్సి వచ్చిందన్నారు. రూ.16 లక్షల కోట్లు ఎగవేతకు మోదీ విధానాలే కారణమని ఎగవేతదారుల్లో ఒక్కరు మినహా మిగిలిన వారంతా గుజరాతీయులేనని గతంలో రూ.2.50 లక్షల కోట్లు ఎగవేతకు గురైతే మోదీ పదేళ్లకాలంలో రూ.16 లక్షల కోట్లకు ఎగవేత సొమ్ము చేరిందని నారాయణ తెలిపారు. సెక్యులరిజాన్ని, మతాన్ని వదలకుండా విమర్శించిన మోదీకి ఆశించిన ఫలితం దక్కలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక బలమైన ప్రతిపక్షం కలిగిన ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చారని ఇప్పుడు దానిని సవరించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. బిజెపి సవరించిన కార్మిక చట్టాలను అమలు చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని నారాయణ హెచ్చరించారు. రాజకీయ పార్టీలు తటస్థ వైఖరిని అవలంభిస్తున్నాయని ఇది సరైంది కాదని తటస్థ వైఖరి ఎవరినో ఒకరిని మోసం చేయడానికేనని నారాయణ తెలిపారు. స్పష్టమైన వైఖరిని అవలంభించిన రాజకీయ పార్టీలకు ప్రజలు పట్టం కట్టారని దోబూచులాడిన వారిని ఓడించారన్నారు. బిజెపికి మద్దతు అంటూనే స్వతంత్రతను ప్రకటించిన వైసిపిని ఓడించారని గెలిచిన చంద్రబాబుది బిజెపి విషయంలో సరైన వైఖరి కాదన్నారు. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొందని బిజెపికి వ్యతిరేకంగా నిలబడే కమ్యూనిస్టులను ఓడించాలని కాంగ్రెస్ చూడటం సరైంది కాదన్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై నారాయణ స్పందిస్తూ ప్రజాప్రతినిధులను చేర్చుకున్నంత మాత్రాన విపక్షం లేకుండాపోదని ప్రజలే విపక్షమవుతారన్న వాస్తవాన్ని చరిత్ర చెబుతుందన్నారు. కెసిఆర్, చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి వారు విపక్ష సభ్యులను చేర్చుకుంటే ప్రతిపక్షం ఉండదని భావించారని కాని ప్రజలే విపక్షమై పనిచేసి విపక్షాలను గెలిపించారని ఆయన తెలిపారు. కెసిఆర్ పాలనలో ప్రతిపక్ష సభ్యులే లేకపోయినా ప్రజలు గెలిపించలేదా అని నారాయణ ప్రశ్నించారు. ఏ పార్టీ నుంచి గెలిచారో వారు పార్టీ మారే ముందు పదవికి రాజీనామా చేయాలని చేసిన తర్వాతే రాజకీయ మార్పు జరగాలని నారాయణ డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ పనులే కాంగ్రెస్ చేస్తుందని ఇది బిజెపికి పరోక్షంగా ఊతమిచ్చినట్లేనని నారాయణ తెలిపారు. బిజెపి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు గెలవడం పై కాంగ్రెస్ ఆలోచన చేయాలని బిజెపి బలపడడానికి ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వరాదని తెలిపారు. రాష్ట్ర సమితి సమావేశాల్లో పార్టీ కార్యక్రమాలను చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటామన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన 84మంది అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాదు సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 84 మంది పోలీసు అధికారులు శనివారం పదవీ విరమణ పొందారు. వీరందరిని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు అందరు కూడా వారికి ఇచ్చిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఈ రోజు పోలీసు శాఖకు మంచి పేరు రావడానికి కారణం మన అందరి శ్రమ వలనే అని తెలిపారు. పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారిని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని తెపినారు. పోలీస్ శాఖ తరపున పదవీ విరమణ చేసిన కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి అడ్మిన్ జె.పరిమళ హానా పోలీసు అధికారుల సంఘం అధ్యక్ష్యుడు యన్.శంకర్ రెడ్డి మరియు సంఘం సభ్యులు పాల్గోన్నారు.



## సమర్థవంతంగా గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు : జాటోతు హుస్సేన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిరిజనుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం హైదరాబాదులో జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ ఆధ్వర్యంలో శాఖ అధికారులు తమ విభాగాలు చేపడుతున్న వివిధ గిరిజన సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై కమిషన్‌కు వివరించారు. కమిషన్ సభ్యులు గిరిజన సంక్షేమ శాఖలోని విద్య, మౌలిక వసతుల కల్పన, ట్రైకార్, జిసిసి, సంసృతి తదితర విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న వివిధ పథకాల పురోగతి గురించి సంబంధిత అధికారులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ పురోగతి కార్యక్రమాలను వారు అభినందించారు. ఇంకా ఇనుమడించిన ఉత్సాహంతో ముందుకెళ్లాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో గురుకులం కార్యదర్శి సీతాలక్ష్మి, గిరిజన శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జిఎం శంకర్, జిసిసి జిఎం సీతారామ్, గిరిజన పరిశోధన సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి.సముజ్వల ఉన్నతాధికారులు పలు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మరో నాలుగురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృమైన ఆవర్తనం ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరం వద్ద వాయువ్య బంగాళాఖతంలో అల్పపీడనం ఏర్పడిందన్నారు. ఇది సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిందన్నారు. ఆదివారం నుంచి బుధవారం వరకు బలమైన, స్థిరమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పారు.

## స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలపై ప్రత్యేక లైవ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో భర్తీ చేసే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఉద్యోగాల కు నిర్వహించే పోటీ పరీక్షలకు హాజర య్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టిసాట్ సిఇఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరం జాబ్ క్యాలండర్‌లో భాగం గా భర్తీ చేసే సుమారు 17,727 సిజిఎల్ పోస్టులకు సంబందించి తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేందుకు టిసాట్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట వరకు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవం కలిగిన బోధనా సిబ్బంది లైవ్‌లో పరీక్షకు సంబంధించిన సలహాలు సూచనలు అందిస్తారన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఆదివారం జరిగే ప్రత్యేక లైవ్‌లో పాల్గొని తమ సందేహాలను తీర్చుకునేందు కు 040 23556037, 040 23540726 టోల్ ఫ్రీ 1800 425 4039 ఫోన్ నెంబర్లకు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఎస్‌ఎస్‌సి సిజిఎల్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 24వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా అక్టోబర్‌లో టైర్1(ప్రిలిమ్స్), డిసెంబర్ లో టైర్2 (మెయిన్స్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎస్‌సి ప్రకటించిందన్నారు. జూన్ 30వ తేదీన లైవ్ అనంతరం జూలై ఒకటవ తేదీ ఉదయం 10 నుండి 11 గంటల వరకు గంట పాటు 122 రోజులు రికార్డెడ్ కంటెంట్ ప్రసారం చేస్తున్నట్లు సిఇఓ తెలిపారు. జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెన్ అండ్ జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులపై అవగాహన ప్రసారాలుంటాయని సిఇఓ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

## సింగరేణిని బలిచేస్తున్న బిఆర్‌ఎస్, బిజెపి

### ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు జనక్ ప్రసాద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ రాజకీయ లబ్ది కోసం బిజెపితో కలిసి సింగరేణిని నిట్టనిలువునా ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు జనక్ ప్రసాద్ విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం, విద్యుత్తు సంస్థల విధ్వంసానికి బిఆర్ఎస్ పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2015లో బిజెపి, టిఆర్ఎస్ కలిసి చట్టాన్ని సవరించి దేశానికి వెలుగు ప్రసాదిస్తున్న సింగరేణిని చంపేసి, తనకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టే కుట్రకు తెరలేపరన్నారు. తద్వారా సింగరేణి సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేసి, సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు భవిష్యత్తు లేకుండా చేసే ఎత్తుగడలను బిజెపి, బిఆర్ఎస్ కలిసికట్టుగా అమలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 40 గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుండగా, వీటిలో 22 బొగ్గు గనులు 2032 –33 సంవత్సరం నాటికి మూతపడనున్నాయని, అదే తీరుగా ప్రతి ఐదేళ్లకు లెక్కలేసుకుంటూ పోతే బొగ్గు నిల్వలున్న ప్రాంతం గణనీయంగా తగ్గిపోతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని, ఫలితంగా సింగరేణి మనుగడ కష్టసాధ్యమన్నారు. ఇప్పుడు 70 మిలియన్లు ఉన్న బొగ్గుఉత్పత్తి 2060 నాటికి 17.28 మిలియన్ టన్నులకు పడిపోతుందనే అంచనాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో సింగరేణికి నామినేషన్ పద్దతిలో బొగ్గు గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తమ హక్కును సాధించుకుంటామని చెప్పారు.

## తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలి

### పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలి

### సదస్సులో ప్రముఖ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రామికులు లేకుండా నగరాల అభివృద్ధి లేదని, శ్రామికుల నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వారు కూడా ఆనందంగా జీవించేలా చర్యలు చేపట్టాలని ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'తెలంగాణలో నగరీకరణ, ప్రభుత్వ విధానాలు, ప్రత్యామ్నాయాలు' అంశంపై జరిగిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, నగరాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఆదాయపన్నులో 10 శాతం కేటాయించాలని, పట్టణ కార్మికులకు ఉపాధి గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునే విధానాలు చేపట్టాలని భూ వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా నగరాల అభివృద్ధి వ్యూహం ఉండకూడదని చెప్పారు. పట్టణ విధానాల నిపుణులు డాక్టర్ డి నర్సింహారెడ్డి మాట్లాడుతూ నగరాల అభివృద్ధి సహజంగా జరగడంలేదని, ప్రభుత్వాలు బలవంతంగా గ్రామాలను విలీనం చేస్తున్నాయని, ప్రకృతి వనరులను కొల్లగొట్టే విధంగా నగరాల అభివృద్ధి పదం నడుస్తుందన్నారు. సంస్కరణల పేరుతో ప్రజలపై పన్నుల భారాలు ప్రభుత్వాలు మోపుతున్నాయని, పట్టణ విధానాలు ఎక్కడ నిర్ణయిస్తున్నారో తెలియడం లేదని పారదర్శకమైన విధానాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సదస్సుకు సిపిఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, 'పట్నం' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.నరసింహారావు తదితరులు ప్రసంగించారు.

## పవర్ కమిషన్‌కు జగదీశ్‌రెడ్డి మరో లేఖ

### తెలంగాణకు దక్కాల్సిన విద్యుత్ దక్కలేదని వివరణ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌కు మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి శనివారం లేఖ రాశారు. ఈ లేఖ వివరాలను ఆయన శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు దక్కాల్సిన విద్యుత్ దక్కలేదని తెలిపామన్నారు. సీలేరు విద్యుత్ ప్లాంట్ కోసం 7 మండలాలను ఏపిలో కలుపుతున్నారన్నారని, ప్రైవేటు కంపెనీల నుంచి కూడా విద్యుత్ కొనకుండా తెలంగాణపై కుట్రలు చేశారని విమర్శించారు. దీనిపై తనకు తెలిసిన సమాచారాన్ని జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్‌కు పంపామని అన్నారు. గత ప్రభుత్వంపై అర్థం లేని రాజకీయ ఆరోపణలు కొందరు చేశారని వాటికి సమాధానం చెప్పాలని జగదీశ్ రెడ్డి తెలిపారు. కమిషన్ చేసిన వ్యాఖ్యలపై కూడా తన అభిప్రాయాన్ని తెలిపానని అన్నారు. కెసిఆర్ అప్పటి ప్రభుత్వంపై బురద జల్లుదామని, అభివృద్ధిని చూసి ఓర్వలేని వారు చేసే కుట్ర అది అని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎక్కువ ధరకు కాకుండా రూ.3.90కి యూనిట్ కరెంటు కొంటే నష్టం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కమిషన్ దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లానని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో విద్యుత్ విషయంలో పక్క రాష్ట్రం ఎన్నో కుట్రలు చేసిందని చెప్పారు. ఏ మాత్రం ఆలస్యం జరిగినా పిజిసిఎల్ లైన్‌ను కూడా పక్క రాష్ట్రం బుక్ చేసుకునేదని వివరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి యూనిట్ కరెంటును రూ.3.90కి కొన్న సమయంలో సింహాద్రి నుంచి రూ.4.33కు కొన్నామని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలో దక్షిణాదిన ఎవరూ కూడా రూ.3.90 కంటే తక్కువగా ఎవరూ కొనలేదని అన్నారు. నవరత్నాల్లో ఒకటైన బిహెచ్ఈఎల్‌కు పనులు అప్పగించామన్నారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీపై చర్చ అర్థరహితమని అన్నారు. 48 నెలల్లోనే కొత్తగూడెం ప్లాంటు నిర్మాణం పూర్తి చేయడం దేశంలోనే రికార్డు అని, అదే ఆర్‌టిపిపి ఎప్పుడో చేపట్టినా మొన్న పూర్తి చేశారని వివరించారు. ''కేంద్రం బొగ్గు ఎక్కడి నుంచైనా కేటాయించవచ్చు. పది శాతం విదేశీ బొగ్గు వాడాలని కేంద్రం ఇప్పటికే షరతు పెట్టిం ది. కృష్ణా తీరంలో వెనకబడిన నల్గొండ జిల్లాలో పెట్టాలని తాను అప్పుటి సిఎం కెసిఆర్‌ను కోరాను. ఎపి కూడా బిహెచ్ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిన ఇచ్చారు. తెలంగాణ కంటే రూ.1150 కోట్లు ఎక్కువగా ఎపి ఇచ్చింది. తెలంగాణ కంటే తక్కువ ధరకు ఎవరైనా ఇచ్చారా''అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

## రోనాల్డ్ రోస్‌కు ఎన్‌పిడిసిఎల్ అపూర్వ స్వాగతం

### గృహజ్యోతి అమలు వివరాలు వెల్లడించిన సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హన్మకొండ పర్యటన నేపథ్యంలో ఇంధన శాఖ కార్యదర్శి , ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్ హన్మకొండ లోని విద్యుత్ అతిధి గృహానికి తొలి సారిగా శనివారం విచ్చేశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆయన వరంగల్‌కు వచ్చిన సందర్భంగా టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఈ సందర్భంగా పూల మొక్క అందించి అపూర్వ స్వాగతం పలికారు.

ఇంధన శాఖ కార్యదర్శిగా పదవి భాద్యతలు స్వీకరించి మొదటి సారిగా విచ్చేసిన సందర్భంగా ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మొదట నక్కలగుట్టలోని సబ్ స్టేషన్‌కు తీసుకు వెళ్లి సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా విధానాన్ని పూర్తిగా వివరించారు.

220/ 132/33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల ద్వారా అమలు అవుతున్న తీరును వివరించారు. ములుగురోడ్డు నుండి విద్యుత్ సరఫరా అవుతున్న 33 /11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు నక్కలగుట్ట ఫీడర్ నుండి సరఫరాతో పాటు ఆయా సబ్ స్టేషన్‌లలో అమలు చేస్తున్న సమయం , పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటి, ఫీడర్ల లోడ్ వివరాలు, స్కాడా గురించిన విషయాలను ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్‌కి కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీ సేవ కార్యాలయాన్ని రోనాల్డ్ రోస్ సందర్శించి, అక్కడ గృహ జ్యోతి పథకం గురుంచి వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అక్కడ వారితో ఆయన మాట్లాడారు. గృహ జ్యోతి లబ్ది దారులు ప్రజా పాలనలో నమోదు చేసుకొని లబ్ది పొందని వారితో మాట్లాడారు.
అందరికి గృహ జ్యోతి వర్తిస్తుందని ఈ సందర్భంగా వారికి తెలిపారు. అక్కడికక్కడే గృహ జ్యోతి లబ్దిదారులకు వారి వివరాలను సరిచేసి గృహజ్యోతి లబ్ది అయ్యేటట్లు చూశారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్లు డైరెక్టర్(హెచ్‌ఆర్డి) బి.అశోక్ కుమార్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టి.సదర్ లాల్, డైరెక్టర్(ఆపరేషన్) వి.మోహన్ రావు, డైరెక్టర్(ఫైనాన్స్) వి. తిరుపతిరెడ్డి , హన్మకొండ ఎస్ఈ కే. వెంకట రమణ, డిఈ సాంబరెడ్డి, హన్మకొండ ఎడిఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు .

## మాజీ ఎంపి రమేష్ రాథోడ్ ఆకస్మిక మృతి

### సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల సంతాపం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** బిజెపి నాయకులు, ఆదిలాబాద్ మాజీ ఎంపి, ఖానాపూర్ మాజీ ఎంఎల్‌ఎ రమేష్ రాథోడ్ (59) అకస్మికంగా మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శనివారం అర్థరాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మరణించారు.
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సిఎం చంద్రబాబు హాయంలో రమేష్ రాథోడ్ టిడిపిలో పని చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆయన తన రాజకీయ భవిష్యత్ కోసం బిజెపిలో చేరి అదే పార్టీలో కొనసాగుతున్నారు. రాథోడ్ రమేష్‌కు భార్య సుమన్ రాథోడ్, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు రితేష్ తండ్రి బాటలో రాజకీయాల్లో ఉండగా చిన్న కొడుకు రాహుల్ ఐఎఎస్, కూతురు సోని ఐపిఎస్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు.

**రమేష్ రాథోడ్ మృతి పట్ల సిఎం, కేంద్ర మంత్రుల దిగ్భ్రాంతి :** మాజీ ఎంపి రమేశ్ రాథోడ్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సిఎంప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఆయన తన ప్రత్యేక ముద్ర వేశారని, తనతో ఉన్న అనుబంధాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎపి డిప్యూటీ సిఎం

### ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్న పవన్ కల్యాణ్

**ప్రజాపక్షం /జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంకు విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి దర్శనానికి వచ్చిన సందర్భంగా దేవస్థానం సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో పూర్ణకుంభంతో పురోహితులు స్వాగతించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఆర్డీఓ మధుసూధన్ లు మర్యాదపూర్వకంగా కలిసి పవన్ కళ్యాణ్ కు పూల మొక్కను అందించారు. మొక్కులు చెల్లించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, తదుపరి దేవస్థానం ఈ. ఓ. చంద్ర శేఖర్ శేషవస్త్రం ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేసి సన్మానించారు. తదనంతరం ఆయన హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## యువతకు ప్రాధాన్యత ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

### మాజీమంత్రి పుష్పలీల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి పుష్పలీల అన్నారు. గాంధీ భవన్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సక్రమంగా పరీక్షలు నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెగాటం ఆడుతుందని విమర్శించారు. వైద్య విద్యార్థులకు న్యాయం జరగాలంటే నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పుష్పలీల డిమాండ్ చేశారు. భారత దేశ విద్య విధానాన్ని బిజెపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. అయోధ్యలో బిజెపిని ఓడించి, మోదీకి రాముడు బుద్ధి చెప్పాడన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక అన్ని యూనివర్సిటీల గ్రాంట్స్ తగ్గించిందన్నారు. మిషన్ భగీరథలో పథకంలో పారదర్శకత లేదన్నారు. అన్ని లోపలే ఉన్నాయన్నారు. ప్రశాంత వాతావరణాన్ని ఓవైసీ చెడ గొడుతున్నాడని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉందన్నారు. అమిత్ షా మోదీ ఇద్దరు తోడు దొంగలని విమర్శించారు. మోదీ తెచ్చిన విదేశీ పెట్టుబడులు దేశ ప్రజలకు ఎంత ఖర్చు చేశారో చెప్పాలని పుష్పలీల డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TGMSIDC డివిజన్, మహబూబ్‌నగర్,
T.G. మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ DEV. కార్పొరేషన్
ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో, మహబూబ్‌నగర్. ఫోన్: 9390984878, మెయిల్ ఐడి: eetgmsidcmbnr@gmail.com
షార్ట్ టెండర్ నోటీస్ నెం. 1/EE/TGMSIDC/Divn/MBNR/e-Proc.tendrs/2024-25/130, తేది: 25.06.2024
టెండర్లను www.tender.telangana.gov.in/ప్లాట్‌ఫారం ద్వారా ఆహ్వానించడమైనది. 1) వనపర్తి జిల్లాలోని GGH & MCHకి కొన్ని మరమ్మతులు & పునరుద్ధరణలు (8 నెం.లు). 2) GGH వనపర్తి వద్ద 5 KL సామర్థ్యానికి మద్దతుగా RCC ప్లాట్ ఫారమును అందించడం, 3) GGH మహబూబ్‌నగర్ ప్రాంగణంలో మార్చురీ భవనానికి కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ వేయుట, 4) మహబూబ్‌నగర్‌లోని GGH వద్ద సర్జికల్ OTలో మరమ్మతులు, 5) నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు వంటగది వస్తువుల సేకరణ & సరఫరా, 6) మహబూబ్‌నగర్ జిల్లా, MVS కళాశాల ప్రాంగణంలో కొత్త మినీ స్టేడియం నిర్మాణం. ఉప పని: మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్‌లో MVS కళాశాలలో ఆట మైదానాలు (ఖో-ఖో & కబడ్డీ కోర్టు) ఫౌండేషన్, ప్రారంభోత్సవ ఛార్జీలు మరియు ఫోటోతో కూడిన SS అక్షరాలు పేరు బోర్డు. గమనిక: టెండర్ మరియు అర్హత ప్రమాణాల యొక్క నియమ మరియు నిబంధనల పూర్తి వివరాలను వెబ్‌సైట్ http://www.tender.telangana.gov.inలో పొందవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
DIPR R.O. No. : 1264-PP/CL/ADVT/1/2024-25 Date: 29-06-2024

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం
మన్యంకొండ, మహబూబ్‌నగర్ జిల్లా.
Coconuts Tender ID: 523648 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన) తేది: 29.06.2024.
కొబ్బరికాయల అమ్మకం లైసెన్స్ హక్కు కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూసుకొనగలరు. వివరములకు: 9989784032, 9985558918.
సం/- వ్యవస్థాపక ధర్మకర్త
సం/- అసిస్టెంట్ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ అధికారి
DIPR R.O. No. : 1305-PP/CL/ADVT/1/2024-25 Date: 29-06-2024

మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
Roc.No.E1/192/2024 (ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తూ నోటీసు) తేది: 28.06.2024.
మణుగూరు మున్సిపాలిటీలో దిగువ పనులు చేపట్టుటకు ఆసక్తిపరులనుండి సీల్డు కవర్లలో రేటు కొటేషన్లు ఆహ్వానిస్తున్నాము. 1) TUFIDC కింద 15వ ఎఫ్.సి., డిఎంఎఫ్, ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్‌డిఎఫ్ మరియు ఏ ఇతర గ్రాంట్ల కింద బ్రిడ్జీలు, రోడ్లు, డ్రెయిన్‌లు, ఇతర అభివృద్ధి పనులకు డిపిఆర్ సిద్ధం చేయుట. 2) BPPV, PPVలు, డివైడర్లు, జంక్షన్‌లు, వైకుంఠధామాలు, IVNMలు, వగైరాలకు సుందరీకరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన ఐటంలకు కొటేషన్లు. 3) వాటర్ సప్లయి మెటీరియల్, హ్యాండ్ బోర్‌వెల్ మెటీరియల్ ఐటమ్స్ కోసం, పైపులైన్లు, బోర్‌వెల్స్‌కు రిపేరకోసం కొటేషన్లు. 4) వివిధ ఎలక్ట్రికల్ మరియు మెకానికల్ ఐటమ్స్‌కు, డబ్ల్యుటిపి మరియు ఇన్‌టేక్‌వెల్స్‌లో రిపేరు పనులకు కొటేషన్లు.
అభివృద్ధి పనులకు షరతులు (Sl.No.1): 1) అటువంటి స్వభావం కలిగిన పనుల్లో అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు మాత్రమే పరిగణించబడతారు. 2) కన్సల్టెంట్ ఏ డిపార్ట్‌మెంట్‌లో, ఏ రాష్ట్రంలోనైనా ఎంప్యానెల్ అయి ఉండాలి. 3) నిర్దేశిత కాలవ్యవధిలో డిపిఆర్ తయారు చేయాలి. డిపార్ట్‌మెంట్ ఆమోదం పొందాలి. 4) డిపిఆర్‌లను మార్గదర్శకాలు, నియమ నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలి, సమాచారమంతా డిపార్ట్‌మెంట్ తయారుచేసిన చెక్ లిస్ట్ ప్రకారం ఉండాలి. 5) కన్సల్టెంట్ కోట్ చేసిన రేటు మొత్తం అంచనా వ్యయంలో శాతం(%)గా ఉండాలి. 6) షెడ్యూలు ప్రకారం, సీల్డ్ టెండర్లను ఆమోదించే లేదా తిరస్కరించేందుకు కమిషనర్, మణుగూరు మున్సిపాలిటీ వారు సర్వాధికారాలు కలిగి ఉన్నారు. మరే ఇతర వివరాలు కావలసి ఉన్నా, మణుగూరు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగాన్ని పనివేళల్లో సంప్రదించగలరు.
ఆసక్తి వ్యక్తీకరణ డాక్యుమెంట్లను ఈ నోటీసు ప్రచురించబడిన తేదీనుండి మూడు రోజుల లోపల దిగువ చిరునామాకు సమర్పించాలి. మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9849909514 / 9515159959.
సం/- కమిషనర్, మణుగూరు మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 1273-PP/CL/ADVT/1/2024-25 Date: 29-06-2024




## గ్రహశకలాలకూ ఓ రోజు..



మాతృ దినోత్సవం... పితృ దినోత్సవం.. ధాత్రి దినోత్సవం.. ఇలా ఎన్నో దినోత్సవాలను అంతర్జాతీయంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ జాబితా లోనే, అంతర్జాతీయ గ్రహశకలాల (ఆస్ట్రరాయిడ్స్) దినోత్సవాన్ని జూన్ 30న నిర్వహిస్తారు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రయోగించిన హబుల్ టెలిస్కోప్ విశ్వ రహస్యాలను నిత్యం అందిస్తునే ఉంది. అదే సమయంలో భూమి దిశగా వస్తున్న వివిధ గ్రహశకలాలు గురించిన సమాచారాన్ని కూడా ఇస్తున్నది. వాటిలో కొన్ని చిన్నవికాగా, మరికొన్ని పర్వత పరిణామంలో ఉంటున్నాయని నాసా అనేక సందర్భాల్లో ధ్రువీకరించింది. అయితే, ఆస్టరాయిడ్స్ భూమిని ఢీకొని, భారీ విధ్వంసాలు జరిగిన సందర్భాలు దాదాపు అసలు లేవు. కొన్నిసార్లు భూమిని ఢీకొన్నప్పటికీ, పెద్ద ప్రమాదమేమీ జరగలేదు. 1908, జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో దాదాపు 2,072 చ.కి.మీ. విస్తీర్ణంలో అటవీప్రాంతం నాశనమైంది. దానికి గుర్తుగా జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవంగా జరుపుతున్నారు. ఐక్య రాజ్యసమితి తన తీర్మానంలో ప్రతి సంవత్సరం జూన్ 30న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. గ్రహశకలం దినాన్ని స్టీఫెన్ హాకింగ్, చిత్రనిర్మాత గ్రిగోరిజ్ రిక్టర్స్, బి 612 ఫౌండేషన్ ప్రెసిడెంట్ డానికా రెమి, అపోలో 9 వ్యోమగామి రస్టీ ష్వీకార్ట్, క్వీన్ గిటారిస్ట్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త బ్రియాన్ మే కలిసి మొదలు పెట్టారు. రిచర్డ్ డాకిన్స్, బిల్ నై, పీటర్ గాబ్రియేల్, జిమ్ లోవెల్, అపోలో 11 వ్యోమగామి మైఖేల్ కాలిన్స్, అలెక్సీ లియోనోవ్, బిల్ అండర్స్, కిప్ థోర్న్, లార్డ్ మార్టిన్ రీస్, క్రిస్ హాడ్ఫీల్డ్, రస్టీ ష్వీకార్ట్, బ్రియాన్ కాక్స్ సహా 200మంది వ్యోమగాములు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, కళాకారులు గ్రహశకల దినోత్సవ ప్రకటనకు సంతకాలు చేశారు. 2014, డిసెంబరు 3న ఈ అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం అధికారికంగా ప్రారంభమైంది. 2014, ఫిబ్రవరిలో రాక్ బ్యాండ్ క్వీన్ కోసం ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, గిటారిస్ట్ బ్రియాన్ మే 51 డిగ్రీ నార్త్ చిత్రానికి దర్శకుడు గ్రిగోరిజ్ రిక్టర్స్‌తో కలిసి పనిచేయడం ప్రారంభించాడు. లండన్‌పై కల్పిత ఉల్క ప్రభావ సంఘటన ఫలితంగా ఏర్పడిన మానవ పరిస్థితుల నేపథ్యంతో రూపొందించిన ఈ చిత్రానికి బ్రియాన్ మే సంగీతం సమకూర్చాడు. ఈ చిత్రాన్ని 2014 స్టార్మస్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన తరువాత రెమి, ష్వీకార్ట్, రిక్టర్స్, మే కలిసి 2014, అక్టోబరులో ఈ దినోత్సవాన్ని స్థాపించి.. లార్డ్ మార్టిన్ రీస్, రస్టీ ష్వీకార్ట్, ఎడ్, థామస్ జోన్స్, రియాన్ వాట్, బిల్ నై విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం లండన్‌లోని సైన్స్ మ్యూజియం, కాలిఫోర్నియా అకాడమీ ఆఫ్ సైన్సెస్, న్యూయార్క్, సావో పాలో నుండి ప్రత్యక్షప్రసారం చేయబడింది. 2017గ్రహశకలం దినోత్సవం రోజున, మైనర్ గ్రహం 248750 (ఆవిష్కర్త ఎం. డాసన్) ను అంతర్జాతీయ ఖగోళ యూనియన్ అధికారికంగా గ్రహశకలం అని పిలిచింది.

## ఈ పాపం ఎవరిది?



ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ 1 కూలింది. ఒకరు మృతి చెందితే, పలువురు గాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది మార్చి 10న ఈ టెర్మినల్ అదనపు నిర్మాణ పనులను ప్రారంభించారు. సరైన నాణ్యతతో నిర్మాణం పూర్తికాక ముందే, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హడావుడిగా ప్రారంభోత్సవం చేయడం వల్లే ఈ అనర్థం జరిగిందన్న విమర్శలున్నాయి. ప్రధాని ప్రారంభించింది ఇతర నిర్మాణాలే తప్ప ఈ టెర్మినల్ కాదని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు మీడియా ముందు చెప్పారు. ఈ టెర్మినల్‌ను కాంగ్రెస్ హయాంలో నిర్మించారని ఎదురుదాడి కూడా చేశారు. ఢిల్లీ విమానాశ్రయం సరే... అయోధ్యలోని రామాలయం పూర్తికాక ముందే, విగ్రహ ప్రతిష్టను నిర్వహించింది నిజం కాదా? మనది లౌకిక రాజ్యమైనప్పటికీ, ప్రధాని మోదీ స్వయంగా ఆ కార్యక్రమాలను పర్యవేక్షించలేదా? సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఎదురుగాలి వీస్తున్నదని తెలిసి, హడావుడిగా మతం కార్డును వాడుకోవడానికి చేసిన ప్రయత్నంలో భాగంగానే బాలరాముడి విగ్రహ ప్రతిష్టను ప్రతిపక్షాలు పేర్కోవడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. వారి ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఎందుకంటే, ఇటీవల కురిసిన వర్షాలకు రామమందిరం పైకప్పులో లీకేజీ బయపడింది. ఆలయంలోకి నీరు చేరాయి. ఈ పాపం ఎవరిది? నిర్మాణం పూర్తికాక ముందే విగ్రహ ప్రతిష్ట కోసం హడావుడి చేయడమే అనర్థానికి కారణమన్నది నిజం. అంతకు ముందు.. గుజరాత్‌లోని మోర్బీ వంతెన ప్రధాని ప్రారంభించిన వారం రోజుల్లోనే కూలిపోయింది. ఏకంగా 138 మంది ప్రాణాలను బలి తీసుకుంది. నాణ్యతను పరిశీలించకుండా, పరీక్షించకుండా మోర్బీ వంతెనకు అధికారులు అనుమతివ్వడం, ప్రధాని ప్రారంభించడం.. రెండూ అనుచితాలే. బిజెపి అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఎంతో అట్టహాసంగా బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వేను సిద్ధం చేశారు. ప్రధాని మోదీ అంతకంటే ఉత్సాహంగా, గత ఏడాది జులై 16 దానిని ప్రారంభించారు. కానీ, ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే ఈ ఎక్స్‌ప్రెస్‌వే డొల్లతనం బయటపడింది. చాలాచోట్ల వర్షం కారణంగా రోడ్డు దెబ్బతిన్నది. 296 కిలోమీటర్ల ఈ నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇంత నాసిరకంగా జరిగిందా? కొద్దిపాటి వర్షానికే రోడ్డు దెబ్బ తింటే, వరదలు వస్తే పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరు చెప్తారు? ఇక, ప్రతిపక్షాల ఐక్యత గురించి భారీ ప్రకటనలు చేసి, 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించి, ఆ తర్వాత 'యు టర్న్' తీసుకొని తిరిగి బిజెపి పంచన చేరిన నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడియు, ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించింది. బీహార్‌లో దశాబ్దాల రాజకీయ చరిత్ర, పలుకుబడి వున్న నితీశ్ ప్రభుత్వం నిర్మించిన వంతెన కూలిపోవడాన్ని ప్రస్తావించడంలో తప్పులేదు. కిషన్ గంజ్ జిల్లా, కంకై నదికిగల ఉపనది మరిపై కట్టిన 70 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుగల బ్రిడ్జి కూలిపోయింది. బీహార్‌లో గత ఎనిమిదేళ్ల కాలంలో వంతెనలు కూలిపోవడం ఇది నాలుగోసారి. ఇంతకు ముందు అరారియా, సివాన్, మోతీహరి బ్రిడ్జిలు కూలాయి. ఇవన్నీ కాకతాళీయమా లేక బిజెపి, దాని మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నప్పుడు చోటు చేసుకుంటున్న నిర్మాణాల నాణ్యతా లోపమా? ఈ ప్రశ్నకు సమాధానం ప్రస్తుతానికి లేకపోయినా, ప్రజాధనం వృథా అవుతున్నదన్నది నిజం. ఆ పాపం ముమ్మాటికీ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమిలోని పార్టీలదే.

## ప్రమాదంలో సునీతా విలియమ్స్!



భారత మూలాలున్న అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రమాదంలో చిక్కుకున్న అనుమానాలు తలెత్తుతున్నాయి. 54 సంవత్సరాల క్రితం నాసా ప్రయోగించిన అపోలో 13 స్పేస్ మిషన్‌ను గుర్తుకుతెస్తున్న సునీత ఇంటర్నెషనల్ స్పేస్ సెంటర్ నుంచి తిరిగిరావడం పదేపదే వాయిదా పడడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి, బారీ విల్మోర్‌తో కలిసి సునీత స్పేస్ సెంటర్‌కు వెళ్లింది. అయితే, ఆమె ప్రయాణం పలుమార్లు వాయిదా పడిన తర్వాత, చివరికి నాసా వారి ప్రయాణానికి అనుమతించింది. బయలుదేరే సమయంలో వ్యోమ నౌకకు చిన్నచిన్న రిపేర్లు అవసరంరాగా, వారం రోజులు రోదసిలో ఉండి, సునీత, విల్మోర్ తిరిగి రావాల్సి ఉంది. కానీ, వివిధ కారణాలతో వారి తిరుగు ప్రయాణం వాయిదా పడుతూ వస్తున్నది. వారు ఎప్పుడు వస్తారనే విషయంపై నాసా ఎలాంటి వివరాలు ఇవ్వడం లేదు. అయితే, జులై 6న వారి రాకకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్న సమాచారం ఉందని రాయిటర్స్ పేర్కొంది. అంటే, వారం రోజుల యాత్ర నెల రోజులు సాగనుంది. ఇలావుంటే, సునీత, విల్మోర్ వద్ద ఆక్సిజన్, ఇతర వస్తువులు మరికొన్ని రోజులకు మాత్రమే సరిపోతాయి. ఒకవేళ జులై 6న కూడా వారి రాక వాయిదా పడితే, పరిస్థితిని విషమంగానే పేర్కోవాలి. సునీత ఏ ఆధారం లేకుండా శూన్యంలో ఒక గ్రహ శకలం మాదిరి తిరుగుతూ ఉండాల్సి వస్తుంది. అంతటి భయంకరమైన పరిస్థితి రాకూడదనే కోరుకుందాం. 1970లో నాసా ప్రయోగించిన అపోలో 13 ప్రయోగం కూడా ఇలాంటి ఉత్కంఠనే సృష్టించింది. ముగ్గురు వ్యోమగాములు జిన్ లొవెల్, జాక్ స్విగెట్, ఫ్రెడ్ హైస్ దాదాపు మృత్యుముఖానికి వెళ్లి, అతి కష్టంమీద తిరిగి వచ్చారు. వారి ఆక్సిజన్ సూట్ దెబ్బతినడం, వ్యోమనౌకలో సమస్యలు తలెత్తడంతో, వారు భూమిని చేరుకోవడం అసాధ్యంగా కనిపించింది. కానీ, చివరికి కథ సుఖాంతమైంది. సునీత సమస్య నాటి అపోలో ప్రయోగాన్ని గుర్తుచేస్తున్నది. వారి మాదిరిగానే సునీత, విల్మోర్‌ను కూడా సురక్షితంగా రప్పించేందుకు నాసా శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు ఫలిస్తాయని ఆశిద్దాం.

## భారత వర్శిటీకి విదేశీ కులపతి



దేశంలోనే మొట్టమొదటి కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఎఐ) విశ్వవిద్యాలయం(యుఎఐయు) ముంబయిలో ప్రారంభమైంది. సాంకేతికరంగంలో పలు అవార్డులు గెల్చుకున్న అంతర్జాతీయ వ్యూహకర్త ప్రొఫెసర్ సైమన్ మాక్‌ను ఈ వర్శిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమించారు. దేశంలోని ఒక విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వ్యవహరించే తొలి విదేశీయుడిగా మాక్ పేరు చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ప్రపంచంలోనే అత్యంత ఉన్నత ప్రమాణాలుగల వర్శిటీల జాబితాలో నంబర్ వన్ స్థానంలో ఉన్న మాసచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) నుంచి బిటెక్ చేసిన మాక్, ఆ తర్వాత ఎంబిఎ, పిహెచ్‌డి కూడా పూర్తి చేశాడు. విద్యారంగంలో తనకు ఉన్న అపారమైన అనుభవంతో అతను ఎఐ వర్శిటీలో ఎంబిఎ కోర్సు ప్రోగ్రామ్‌ను సిద్ధం చేశాడు. విద్యా ప్రమాణాలను, వృత్తి నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా పేర్కొంటున్న మాక్ నేతృత్వంలో ఎఐ వర్శిటీ ఎంతమేరకు లక్ష్యాలను సాధిస్తుందో చూడాలి.

## 'మహాయుతి' ఆపద మొక్కులు

అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మహారాష్ట్రలో పాలక కూటమి 'మహాయుతి' లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన చావుదెబ్బ నుండి కోలుకుని అధికారం నిలుపుకునే మార్గాలు అన్వేషిస్తున్నది. రాష్ట్రం నుండి 48 లోక్‌సభ సీట్లలో మహాయుతికి 17 మాత్రమే దక్కగా ప్రతిపక్ష మహావికాస్ అఘాది కూటమి 31 సీట్లుగెలుచుకోవటం తెలిసిందే. మంచి ఊపుమీదున్న ఎంవిఎ పక్షాలు – కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి(శరద్‌పవార్) – శాసనసభలోని సీట్లను సమానంగా 96–96–96 చొప్పున పంచుకుని ఐకమత్యంతో పోటీచేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాయి. ఇతర చిన్న పార్టీలకు ఆయా పక్షాలు తమ కోటానుండి కొన్ని సీట్లు కేటాయిస్తాయి. వాస్తవానికి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ కూటమిలో ఎక్కువ సీట్లు (13+1) గెలిచినప్పటికీ ఆ దామాషాలో అసెంబ్లీ సీట్లకు పట్టుబట్టకుండా సమాన పంపిణీకి అంగీకరించటం విశేషం. శివసేన, ఎన్‌సిపి శాసనసభాపక్షాలను చీల్చి ఎంవిఎ ప్రభుత్వాన్ని కూల్చిన బిజెపిని వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షంలో ఉంచటమే లక్ష్యంగా మూడుపార్టీలు సత్వర అంగీకారానికి వచ్చాయి. కాగా లోక్‌సభ ఎన్నికల్లో గట్టిదెబ్బతిన్నప్పటికీ అసెంబ్లీలో ఉన్న 105 సీట్లు ఆధారంగా 150 సీట్లకు పోటీచేయాలని బిజెపి భావిస్తోంది. మిగిలిన 138 సీట్లను శివసేన(షిండె), ఎన్‌సిపి(అజిత్ పవార్)పంచుకోవచ్చునంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 9, మిత్రపక్షం శివసేన (షిండె)8 సీట్లు మాత్రమే గెలుపొందాయి. ఎన్‌సిపి(అజిత్)కి ఒక్క సీటు రాలేదు. అజిత్ గ్రూపును చేర్చుకోవటమే ఎన్‌డిఎకు చేటు చేసిందని ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు విమర్శించాయి. అయినా సుప్రియా సూలెపై ఓడిపోయిన అజిత్ పవార్ భార్యను ఆ కూటమి వెంటనే రాజ్యసభ సభ్యురాల్ని చేసింది. అజిత్ గ్రూపును కూటమిలో నిలుపుకోవటమే లక్ష్యంగా బిజెపి అందుకు అంగీకరించింది.

ప్రజాపక్షం
30-06-2024, ఆదివారం

అయితే ఓట్ల శాతంలో ఇండియా, ఎన్‌డిఎ కూటముల మధ్య చెప్పుకోదగ్గ తేడా లేకపోవటం గమనార్హం.

మహాయుతి ప్రభుత్వం(ఎన్‌డిఎ) అదనపు ఓటర్లను ఆకట్టుకునే కనికట్టు విద్యగా రాష్ట్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంది. ఆర్థికమంత్రి అజిత్‌పవార్ రూ.6.12లక్షల కోట్లతో శుక్రవారం సమర్పించిన రాష్ట్ర బడ్జెట్‌లో ముఖ్యంగా స్త్రీ ఓటర్లకు అనేక ఉచిత సహాయ పథకాలు ప్రకటించారు. వాటిలో ఎక్కువ భాగం ఇతర రాష్ట్రాలనుండి కాపీ కొట్టినవే. అవి ఆ రాష్ట్రాల్లో పాలక పార్టీలకు ఓట్లు కురిపించాయన్న నమ్మకంతో వాటిని మహారాష్ట్రకు దిగుమతి చేసుకున్నారు. మధ్యప్రదేశ్ నుండి తెచ్చుకున్న 'లడ్లీ బెహనా' ముఖ్యమైనది. 21–60 సంవత్సరాల మధ్య వయస్కుల్లో అర్హులైన స్త్రీలకు నెలకు రూ.1500 ఉచితంగా అందజేయటమే ఈ పథకం. మరాఠాలో దానిపేరు 'మజీ లడ్కీ బాహిన్ యోజన'. 52లక్షల కుటుంబాలకు ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా సరఫరా చేసే 'సిఎం–అన్నపూర్ణ యోజన', మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ.15లక్షల రుణం వరకు వడ్డీని ప్రభుత్వం చెల్లించే 'పుణ్యాష్ లోక్ అహిల్యాదేవి స్టార్టప్ పథకం', అన్ని వృత్తి విద్యాకోర్సుల్లో ఒబిసి, ఇడబ్ల్యుసి తరగతులకు చెందిన బాలికలకు విద్య, పరీక్ష ఫీజు పూర్తిగా రీ ఇంబర్స్‌మెంట్ మరో పథకం. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెట్రోలు, డీజిల్‌పై పన్నులు కొద్దిగా తగ్గించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ గ్యారంటీలనే ఓటర్లు పట్టించుకోలేదు. వీటిని లక్ష్యపెడతారా అంటున్నాయి ప్రతిపక్షాలు. దేనికైనా రాజకీయ విశ్వాసం ప్రధానం. అది కోల్పోయిన నాడు ఎన్ని ఉచితాలు ప్రకటించినా ఫలితముండదు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు ఆ గుణపాఠాన్ని బలంగా చెప్పాయి.

# ఈ ద్వేషభక్తి గేయం: దేశానికి చేస్తున్న గాయం!


డాక్టర్ దేవరాజు మహారాజు

ఈ దేశంలోని ప్రతి పౌరుడూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.

1931లో విప్లవ వీరుడు భగత్ సింగ్ పక్షాన తీవ్రంగా వాదించిన న్యాయవాది–ఆసిఫ్ అలీ. భగత్ సింగ్‌ను శిక్షించడానికి నిరాకరించి, తన జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్– సయ్యద్ ఆగా హైదర్. ఇక పోతే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించిన జడ్జి – రాయ్ సాహిబ్ పండిట్ శ్రీక్రిషన్. నరనరాన ఆరెస్సెస్ భావజాలం నింపుకున్న వ్యక్తి. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, లేదా గుర్తు చేసుకున్న తర్వాత ఎవరు దేశభక్తులు–ఎవరు దేశద్రోహులు అనే విషయం విజ్ఞత గల ఈ దేశ పౌరులు పూర్తిగా అర్థం చేసుకుంటారు. ముస్లిం అయినంత మాత్రాన ద్వేషించాలని, హిందువులంతా బంధువులేనని అనుకోక తప్పదా? భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది ఎవరు? పాల్గొనని వారెవరు? తెలుసుకోనక్కరలేదా? ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు ప్రచారం చేస్తున్న విద్వేష భక్తి గేయాలు పాడుకోవల్సిందేనా? నిజానిజాలు తెలుసుకునే పని లేదా? మండిపోతున్న మణిపూర్ లాగా దేశమంతా కావల్సిందేనా? గౌరవనీయులైన మూర్ఖుల సంఖ్య పెరుగుతున్నప్పుడు, సామాన్య పౌరులు తమ వివేకాన్ని నిద్ర లేపాలి. ప్రతి చిన్న విషయాన్నీ హేతుబద్ధంగా విశ్లేషించుకుంటూ ముందుకు సాగాలి. మనది ప్రజాస్వామ్య దేశం! మనుషులంతా ఒక్కటి!! ఈ రెండు విషయాలకు కట్టుబడి మాత్రమే – నిజాయితీగా నిబద్ధతతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

తాము సనాతన ధర్మాన్ని గౌరవించేవారిమని, దాన్ని వ్యతిరేకించే వారి వ్యాఖ్యలు తమ మనోభావాల్ని గాయపరుస్తున్నాయని, ఆ వ్యాఖ్యలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని మాజీ న్యాయమూర్తులు, మాజీ ఉన్నతాధికారులు సుప్రిం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అలాంటి లేఖ రాసిన వారికి అసలు సనాతనమంటే ఏమిటన్నది అవగాహన ఉందా లేదా అని అనుమానం వస్తుంది. సనాతనమంటే – అసమానత, సనాతన మంటే –అస్పృశ్యత, సనాతనమంటే – కుల వివక్ష, సనాతనమంటే – బలులు, యజ్ఞ యాగాలు, బాల్య వివాహాలు, సతీసహగమనం, దళితుల సజీవదహనం, సనాతనమంటే – సమాజపు సగభాగపు అణచివేత, ఆధిపత్య హింస, శ్రామికుల పీడన. సనాతనమంటే– నిచ్చెనమెట్ల వ్యవస్థ. సనాతనమంటే – వర్తమానాన్ని గతం అజమాయిషీ చేయడం, సనాతనమంటే – భవిష్యత్తుకు అవరోధం. ఏ కొందరి మనోభావాలో దెబ్బతింటాయంటే, వారు తప్పక వారి ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంటుంది. పైన చెప్పిన వన్నీ నిజాలే కదా? నిజాలు కాదు, అబద్ధాలు అని– ఎవరైనా నిరూపించదలిస్తే నిరూపించిన తర్వాత మాట్లాడాలి.

సమకాలీనంలో కూడా సనాతనం చేసే అనర్థాలెలా ఉంటాయో చూడండి. ఎప్పుడో మొదలైన కుంభమేళాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి కాదా? 1760–హరిద్వార్ కుంభమేళాలో శైవులైన గోసాయిల్లకు వైష్ణవులైన బైరాగులకు మధ్య కలహాలు చెలరేగి ఇరువైపులా వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. మరాఠా పీష్వాల నాటి ఒక రాగిఫలకం–మరికొన్ని భయంకరమైన విషయా లు వెల్లడించింది. 1789 లో నాసిక్ కుంభమేళాలో సుమారు 12వేల మంది మరణించారు. కారణం శైవులు – వైష్ణవులు హోరాహోరీగా పోట్లాడుకుని, కోపాలు, రోషాలు చల్లారక చంపుకోవడం దాకా వెళ్లింది. మేమంటే మేం–ముందు స్నానం చేయాలని గొడవపడి, అది పెద్దదై శత్రువుల్లాగా ఒకరినొకరు చంపుకున్నారు. ఇరుపక్షాల వారు కలిసి మొత్తం 12వేల మంది పుణ్యస్నానాల పేరుతో ప్రాణాలు త్యాగం చేశారు. మతం పిచ్చి తలకెక్కితే అంతే! అలాగే మరికొంతకాలానికి 1796 – హరిద్వార్ కుంభమేళాలో మరోసారి హింస చెలరేగింది. ఉవులకు, ఉదాసీలకు మధ్య సామాను రవాణాకు సంబంధించి, వారివారి హక్కులకు సంబంధించి సహనం కోల్పోయిన భక్తుల యుద్ధ వీరులై పోయారు. భక్తులు మానవత్వం మీద చెరగని మచ్చలుగా మిగిలారు తప్పితే, మతకలహాలతో ఎవరైనా ఎప్పుడైనా ఏమైనా పొందగలిగారా?

లోకకళ్యాణం గురించి, ప్రశాంత జీవన మార్గం గురించి, సత్ప్రవర్తన గురించి జనానికి బోధలు చేసే సన్యాసులు, సాధువులు, బైరాగులు యుద్ధాలకు దిగడం ఏమైన బావుందా? అంటే వారు– సర్వసంగ పరిత్యాగులుగా వేషం మార్చారే గాని, తమలోని అహన్ని జయించలేకపోయారని మనకు అర్థమౌతుంది. అలాంటి వారి నుంచి సామాన్యులు నేర్చుకునేది ఏముంటుంది? వారిని అని లాభం లేదు. సామాన్యులే వాస్తవాలు గ్రహించాలి. అలాంటి సన్యాసులు దొంగ యోగులు సమాజానికి కాదు కదా, వారికి వారే ఉపయోగం లేనివారు. అలాంటి వారిని సామాన్యులు నమ్మకూడదు. వారి బూటకపు ఆధ్యాత్మికతకు ప్రభావితులు కాకూడదు. అలాంటి వారిని దూరం పెట్టాలి. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయుల గూర్చి తెలుసుకుంటూ ఉండాలి. వారి మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దైవమే లేనపుడు దైవం పేరు చెప్పి, సంస్కృతి సంప్రదాయాల పేరు చెప్పి, మోసం చేసే వారిని నమ్మడం అవసరమా? ఆలోచించాలి కదా? మన దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే పెళ్ళాన్ని చంపినోడు సద్గురువు అయ్యాడు. చిన్న విషయం కూడా నేర్చుకుందామన్న తపన లేనోళ్ళంతా ఈ దేశంలో గురువులు కావాలని తహతహలాడుతుంటారు.

''ఆలి నేల లేని అసమర్థుడెట్లౌను/ ప్రజల నేల గల్గు ప్రాజ్ఞవరుడు? ప్రాకలేని బుడత పరుగెత్త నేర్చునా/వాస్తవమ్ము నార్లవారి మాట'' – అని అన్నారు తెలుగు కవి, రచయిత, ప్రసిద్ధ సంపాదకులు నార్లవెంకటేశ్వరరావు– చాలా కాలం కిందట! ఇప్పుడీ విషయమే రివర్స్‌లో చూస్తున్నాం. ఉదాహరణకు 2014లో రూపాయికి డాలర్ మారకం విలువ 60.99, అదే 2023లో 83.15 అయ్యింది. పరిస్థితి ఇలా స్పష్టంగా కనిపిస్తూ ఉంటే ప్రధాని అతని సహచరులంతా దేశం ఆర్థిక ప్రగతి సాధించిందని దబాయిస్తారెందుకూ? వారికెవ్వరికీ కళ్ళూ, చెవులూ పనిచేయడం లేదా? అందుకే కాబోలు మణిపూర్‌లో ప్రధాని మోదీ ఫొటోతో పోస్టర్లు వెలిశాయి. దానికింద ఒక వాక్యం ఉంది. ''ఈయనకు కళ్ళు కనబడవు. చెవులు వినబడవు. ఇక్కడ మా మణిపూర్ మండిపోతున్నా ఆయనకు పట్టదు. విదేశాలకు పారిపోతుంటాడు''– అని!

మోదీ అనేది ఇంటిపేరు కాదు, ఆయన విద్యార్హతలు. మాస్టర్ ఆఫ్ డెవలసింగ్ ఇండియా–అని ఆయన అనుయాయులు ప్రచారం చేసుకుంటున్నది నిజం. బిబిసి డాక్యుమెంటరీయే కాదు, ప్రపంచ వ్యాప్తంగా 14 అంతర్జాతీయ పత్రికలు ఈయన అసమర్థత గూర్చి పూర్తి వివరాలు వెల్లడించాయి. ''కుట్ర చేయడం ఎంత తెలివిగా చేయాలంటే ఎదుటివాడికి ఏ మాత్రం తెలియకూడదు. పైగా తనకు తానుగా వచ్చి కుట్రలో ఇరుక్కోవాలి. బలై, భస్మమైకోవాలి'' –అని అన్నాడు విన్సెంట్ చర్చిల్. చర్చిల్ ఎప్పుడో చెప్పిన విషయాన్ని ఈ దేశ ప్రధాని ప్రజల మీద ప్రయోగిస్తున్నాడు. నిజం చెప్పుకోవాలంటే గుజరాత్ గాయం, మణిపూర్ గాయం. దేశమంతా గాయాలమయమైపోతోంది. నిజమే!ఈ విషయాలు మాత్రం చరిత్రలో నిలిచిపోతా యి!

''దేశమును ప్రేమించుమన్న/మంచి అన్నది పెంచుమన్న''– అన్న గురజాడ అప్పారావు (1862–1915) మనకు తెలుసు. ''మతములన్నియు మాసిపోవును/జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును''– అని అన్నది కూడా ఆ మహానుభావుడే. ''చట్టాపట్టాల్ పట్టుకుని/దేశస్తులంతా నడవవలెనోయ్/అన్నదమ్ముల వలెను జాతులు/మతములన్నియు మెలగవలెనోయ్''– అని ఆశించారాయన! అందుకు వ్యతిరేకమైన భావజాలంతో ఇప్పుడు ఒక ద్వేషభక్తి గీతం వినిపిస్తోంది. జ్యోతిబసు పేరుతో ఎవరో నాకు ఆ పేరడీ గేయం పంపించారు. అది నా పాఠకుల కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను. ''మతమునే ప్రేమించుమన్న/హింసయన్నది పెంచుమన్న/ వట్టిమాటలు చెప్పుకోవోయ్! చేయు మేలుని కట్టిపెట్టోయ్// దేశాభిమానమె నాకె కద్దని/ వట్టి గొప్పలు చెప్పుకోవోయ్/దేశమంటే జనం కాదోయ్/ దేశమంటే మతం మయమోయ్// హిందుమతమె రాజ్యమేలగ/ దారిలో నువు పాటు పడవోయ్/తతిమ జాతులు మతములన్నీ/అణిగి మణిగీ మెలగవలెనోయ్//స్వంత లాభమె అంతయనుకుని/ప్రజల నందరి ముంచవలెనోయ్/ జాతి ఆస్థులు కట్టగట్టి/దత్త పుత్రుల కట్ట బెట్టోయ్ //విజ్ఞాన మంతయు రాతియుగపు/గ్రంథమయమని బొంకవలెనోయ్/రోదసీ నౌకకి సైతం /దిష్టి టెంకాయ కొట్టవలెనోయ్//అంబేద్కరు గాంధీ ఇజాలకు/పైపై దప్పు కొట్టవలెనోయ్/మత సామరస్యం చావుకోసం/లోనగోతులు తీయవలెనోయ్''– ఈ ద్వేషభక్తి గేయం దేశానికి ఎంతగా గాయం చేస్తుందో ...సామాన్య పౌరులు అర్థంచేసుకోవాలి! 'భారత్, జోడో–నఫ్రత్ ఛోడో! భారత దేశ సమగ్రతను కాపాడదాం?విద్వేష భావాన్ని విడనాడుదాం!!'– ఇదే నేటి మన కర్తవ్యం

(సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవశాస్త్రవేత్త)

# కొత్త అధ్యక్షుల ఎంపికపై మల్లగుల్లాలు

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు ముగిసి, కేంద్రంలో కొత్త (పాత) ప్రభుత్వం ఏర్పాటైంది. ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్రంలో పిసిసి అధ్యక్ష పదవి, బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి అనే అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం పిసిసి అధ్యక్షునిగా కూడా కొనసాగుతున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పదవీకాలం కొద్ది రోజుల్లో ముగియనుంది. 2021 జులై 7వ తేదీన ఆయన టిపిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో కాంగ్రెస్ పార్టీ పదేళ్ళ తరువాత అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డినే ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, పదవీబాధ్యతలు స్వీకరించిన కొద్ది నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆయననే పిసిసి అధ్యక్షుడిగా కొనసాగించారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో పాటు, పిసిసి పదవీకాలం కూడా ముగియనుండడంతో అధిష్ఠానం కొత్త అధ్యక్షుడి వేటలో పడింది. మరోవైపు ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మరోసారి కేంద్రమంత్రి కావడంతో అధ్యక్ష పదవి వదులుకునేందుకు సిద్ధమయ్యారు. గత ఏడాది జూలై 5న ఒకింత అయిష్టంగానే ఆయన బిజెపి రాష్ట్ర అధ్యక్ష పగ్గాలను, బండి సంజయ్ నుండి స్వీకరించారు. ఇప్పుడు వారిరువురు కేంద్రమంత్రులయ్యారు. కొత్త అధ్యక్షులుగా వారిద్దరు ఉండే అవకాశం లేదు. ఆ పార్టీ కూడా కొత్త అధ్యక్షుడిని వెదుకుతోంది. బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా పదవీకాలాన్ని ఎన్నికలు పూర్తయ్యేంత వరకు పొడిగించడం, ఇప్పుడు ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడం, రాజ్యసభ సభానాయకుడిగా నియమించడంతో జాతీయ అధ్యక్షుడి మార్పు కూడా అనివార్యమైంది. ఒకదశలో కిషన్‌రెడ్డిని జాతీయ అధ్యక్షుడు చేస్తారనే వార్తలు రాగా, ఆయన అనాసక్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు అతి త్వరలోనే నూతన రాష్ట్ర రథసారథులు రానున్నారు. రెండు చోట్ల కూడా సామాజిక సమీకరణల నేపథ్యంలో వెనుబడిన వర్గాలకు చెందిన వ్యక్తినే అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీలో గత వారం రోజులుగా ఢిల్లీలో అధిష్ఠానం వద్ద నూతన పిసిసి అధ్యక్షుని ఎంపిక, మంత్రివర్గ విస్తరణపై జోరుగా చర్చలు సాగాయి. సిఎం రేవంత్‌రెడ్డి, డిసిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌లతో విడివిడిగా, కలివిడిగా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బిసి వర్గానికి చెందిన ప్రస్తుత టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్, మధు యాష్కీ గౌడ్‌ల పేర్లు ముందంజలో ఉన్నట్లు చెప్పబడుతున్నది. మాదిగ సామాజికవర్గానికి లోక్‌సభ ఎన్నికల్లో అన్యాయం జరిగిందనే వాదన నేపథ్యంలో ఒక దశలో ఆ వర్గానికి చెందిన ఎస్.ఎ.సంపత్ కుమార్‌కు పిసిసి అధ్యక్ష పదవి ఇస్తే ఎలాగుంటుందనే చర్చ కూడా జరిగింది. అయితే, ఆ వర్గానికి అధికార పదవి కచ్చితంగా ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. మరోవైపు మంత్రివర్గంలో ఎస్‌టిలలో ప్రధాన సామాజిక వర్గమైన లంబాడాలకు చోటు దక్కలేదు. గిరిజనుల నుండి మంత్రిగా సీతక్కకు మాత్రమే అవకాశం లభించింది. దీంతో లంబాడా వర్గానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావించినప్పటికీ, ఆ వర్గం ఎంఎల్‌ఏలు ఎక్కువగా కొత్తగా ఎన్నికైన వారే ఉన్నారు. దీంతో పిసిసి అధ్యక్ష పదవి, కేంద్ర మాజీ మంత్రి బలరామ్ నాయక్‌కు ఇస్తే ఎలాగుంటుందనే చర్చ కూడా అధిష్ఠానం వద్ద జరిగింది. మొత్తానికి వారం రోజుల్లో కొత్త పిసిసి అధ్యక్షుడు నియమితులయ్యే అవకాశాలు ఉన్నాయి. మధుయాష్కీకి పిసిసి అధ్యక్ష పదవి రాకుంటే ఏఐసిసికి తీసుకుంటారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

ఇక బిజెపిలో రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ తీవ్రంగానే ఉంది. కేంద్రమంత్రి వర్గంలో స్థానాన్ని ఆశించిన ఎంపిలు ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ధర్మపురి అరవింద్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. బిజెపికి కష్టకాలంలో ఉపఎన్నిక ద్వారా ఎంఎల్‌ఏగా ఎన్నికై, ఇప్పుడు ఎంపిగా ఎన్నికైన రఘునందన్‌రావు పేరు కూడా తెరపైకి వస్తుంది. ఈటల రాజేందర్‌కు కేంద్రంలో ఛాన్స్ ఉంటుందని బలంగా ఆశించినప్పటికీ




ఆయనకు చోటు దక్కనందున, ఆయనకు రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందని ఆయన వర్గీయులు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సమానంగా స్థానాలు వచ్చినప్పటికీ, ఓటు వాటాలో రెండవ స్థానంలో నిలిచింది. బిఆర్‌ఎస్ ఓటు బ్యాంకు కమలం పార్టీ వైపు మళ్ళినందునే బిజెపికి సీట్లు, ఓట్లు పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఒక్క ఎంపి సీటు రాకపోవడంతో పాటు, నెమ్మదిగా ఒక్కొక్క ఎంఎల్‌ఏ కారు దిగుతుంటే ఆ పార్టీ నాయకులు, క్యాడర్ సందిగ్ధంలో పడ్డారు. వారు ప్రధానంగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుండడంతో దానిని అరికట్టేందుకు ఈటల రాజేందర్‌కు బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, అన్ని జిల్లాల్లో బిఆర్‌ఎస్ శ్రేణులతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వారిని బిజెపి వైపు ఆకర్షించాలంటే రాజేందర్ అయితే బాగుంటుందనే అభిప్రాయం నెలకొంది. మరోవైపు డి.కె.అరుణ ఇప్పటికే బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉండడంతో పాటు, పార్టీ పునర్వ్యవస్థీకరణలో ఆమెకు మంచి హోదా దక్కే అవకాశం ఉందని ఆమె వర్గీయులు ఆశిస్తున్నారు. అయితే, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి కీలక పదవులు ఇవ్వవద్దని పాత బిజెపి నాయకులు అంటున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఆకర్షణపై గెలిచామే తప్ప, అభ్యర్థుల బలంతో కాదని, దాని ఆసరాగా చేసుకొని క్యాడర్‌ను పెంచుకోవాలని చెబుతున్నారు. ఇప్పటికే బిఎల్‌పి పదవి ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వ్యక్తికి ఇచ్చారని, అధ్యక్ష పదవి కూడా అలాగే ఇస్తే తప్పుడు సంకేతాలు పోతాయని వాదిస్తున్నట్లు తెలిసింది. ఈ వాదనల నేపథ్యంలో గత లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కె.లక్ష్మణ్‌ను మరోసారి అధ్యక్షుడిగా నియమిస్తారా? అనే చర్చ కూడా నడుస్తుంది. అయితే ఆయన జాతీయ స్థాయిలో బిజెపి అనుబంధ ఒబిసి మోర్చ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఏమైనా వారం, పది రోజుల్లో రెండు పార్టీలకు కొత్త రాష్ట్ర అధ్యక్షులు రావటం ఖాయంగా కనిపిస్తున్నది.

### చేరికల జోరు

మరోవైపు కాంగ్రెస్‌లోకి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల చేరికలు జోరందుకున్నాయి. వారం రోజుల్లో ముగ్గురు ఎంఎల్‌ఏలు కారు దిగి, హస్తం పార్టీ చెంతకు చేరారు. దీనిపై బిఆర్‌ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో అక్కసు వెళ్ళగక్కుతున్నప్పటికీ, ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్న చందంగా ఫిరాయింపులు సాగుతున్నాయి. ఫిరాయింపుల నేపథ్యంలో గులాబీ పార్టీలో వచ్చిన ప్రధాన మార్పేమిటంటే ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఇప్పుడు ఎంఎల్‌ఏలను ఫామ్ హౌజ్‌కు పిలిపించుకొని మాట్లాడుతుండడం. గతంలో పుట్టిన రోజులోనో, మరో ప్రత్యేక సందర్భాలలోనే ఈ అవకాశం ఎంఎల్‌ఏలకు దక్కేది. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. తాము సుప్రీం కోర్టుకు పోతామని, మంచి లాయర్‌ను పెడతామని చెబుతున్నా కూడా బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు ఆ పార్టీలో కొనసాగుతామని కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. వాస్తవానికి ఓటమి తరువాత స్వయంగా కెసిఆర్ హుందాగా అంగీకరించి ప్రతిపక్ష పాత్రను పోషించనట్లయితే ఈ పరిస్థితికి వచ్చేది కాదు. కనీసం శాసనసభకు రాకుండా, ప్రతిపక్ష నేత హోదాలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలలో ఒక్కరోజు కూడా పాల్గొనకపోవడంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఒడిషాలో నవీన్ పట్నాయక్ ఆ పని చేశారు. అందుకే ఆయనకు అక్కడ అన్ని పక్షాల గౌరవం దక్కింది. ఏదేమైనా పార్టీ ఫిరాయింపులు అనేది ప్రజాస్వామ్యంలో మంచిది కాదనే ఉవాచలు తప్ప వాటిని అరికట్టే విధంగా చట్టంలో మార్పులు చేసేందుకు ఏ పాలక పార్టీ ముందుకురాదు. దీనిపై ఏ పార్టీ అయినా పార్టీ మార్పులపై జాగ్రత్తగా వ్యవహరించకపోతే, భవిష్యత్తులో అవి పార్టీని కూడా అది కబలించే ప్రమాదం లేకపోలేదని రాజకీయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

# తహసీల్దార్ లాగిన్‌లో ఒక్క దరఖాస్తూ పెండింగ్‌లో ఉండొద్దు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలోని తహసీల్దార్ లాగిన్‌లో ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ ఉండకూడదని జిల్లా కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ రోజుకు 200 పైగా దరఖాస్తులపై చర్యలు తీసుకుని ఆర్డీవో నుంచి జేసి ద్వారా కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి, ఇతర ధరఖాస్తుల పరిష్కారం, వివిధ రెవెన్యూ సంబంధిత అంశాలపై సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లు, ఇతర రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ప్రతి రోజు పెండింగ్ ధరఖాస్తులను గురించిన వివరాలను తెలుసుకోవడం జరుగుతందని, తహసీల్దార్ లాగిన్ నుంచి పై అధికారులకు పంపించే ముందు దానికి సంబంధించి జతపరచాల్సిన ధృవీకరణలు, రిమార్కులను మరోసారి సరిచూసుకోవాలన్నారు. ధరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లయితే మరింత సమయాన్ని కేటాయించడంతో పాటు సెలవు రోజులలో కూడా వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. ధరఖాస్తును తిరస్కరించడానికి ముందు దానిని రిటర్న్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, డిఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్‌లు, తహసీల్దార్‌లు, సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులు

ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికిన సిపి అభిషేక్ మొహంతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ కమిషనరేట్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తూ పదవీకాలం ముగిసిన నలుగురు ఏఎస్సైలు బాపురెడ్డి (స్పెషల్ బ్రాంచ్), కాశెట్టి కిషన్, పి.విజేందర్ (ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం), ఎన్.లింబా, బి.బాల్‌రెడ్డి, ఎం.ఏ ముతాలిబ్ (జూనియర్ అసిస్టెంట్)లు సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి శనివారం పదవీ విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉన్న పోలీసు ఉద్యోగం సంపూర్ణంగా చేసి పదవీ విరమణ పొందడమే గొప్ప విజయం అన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ డిసిపి ఏ.లక్ష్మి నారాయణ, రిజర్వు ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌రెడ్డి (వెల్ఫేర్), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
వార్తకు ఫోటో ఉంది

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యా సంవత్సరం ప్రారంభ దశలోనే విద్యాహక్కు చట్టాన్ని సమగ్రంగా అమలు చేసి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను ఇవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డిని కలిసి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో విఫరీతమైన ఫీజులను విద్యార్థుల నుంచి వసూల్ చేస్తున్నారని, దీనిమూలానా పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం 2009 అమలు చేసినట్లయితే ఈ వర్గాలకు చెందిన పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందుతుందని తెలిపారు. అదే విధంగా సంక్షేమ హాస్టళ్లలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అద్దె భవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు , జిల్లా కన్వీనర్ నారపాక అంజి , డోల్ దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాల్గ యాదయ్య ,యడవల్లి శ్రీనివాస్, అందుగుల ఆనంద్ , నారపాక లక్ష్మణ్ , బచ్చలికూరి అంజయ్య తదితరులున్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్



**ప్రజాపక్షం/చొప్పదండి:** తెలంగాణలో విధ్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో విధ్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు రూ.5 కోట్లపైగా బకాయిలున్నాయని, స్వరాష్ట్రం వస్తే నిధులు, నియామకాలు వస్తాయని విధ్యార్థులు కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విధ్యార్థులకు మొండి చేయి చూపడం అన్యాయన్నారు. కళాశాల యాజమాన్యాలు విధ్యార్థులను ఫీజుల కట్టాలని వేదిస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విధ్యార్థులను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు.

## 47 అంశాలపై కౌన్సిల్‌కు ఆమోదం తెలిపిన పాలకవర్గం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి 47 అంశాలను పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు అధ్యక్షతన నిర్వహించి పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సంధర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి వార్డుకు రూ.5 లక్షల చొప్పున నిధులను కేటాయించగా కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, అలాగే రుద్రభూమికి రూ.50 లక్షలు కేటాయించగా కౌన్సిల్ ఆమోదించిందన్నారు. రానున్న వర్షాకాలం నేపధ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వార్డులలో ఫాగింగ్ మిషన్ సంబంధించిన సామాన్లు కొనుగోలుకు నిధులు కేటాయించగా కౌన్సిల్లో పాలకవర్గం ఆమోదం తెలిపింది. 47 అంశాలతో కూడిన కౌన్సిల్ అంశాలను పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ, కౌన్సిలర్లు, సీనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక టీమ్‌లతో ధరణి క్లిష్టమైన సమస్యల పరిష్కారం




**ప్రజాపక్షం /నల్లగొండ :** ధరణి పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కస్తామని, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సిసిఎల్‌ఏ ఇంచార్జ్ నవీన్ మిట్టల్ కు తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ధరణి సమస్యలు, పరిష్కారాలపై రెవిన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సిసిఎల్‌ఏ ఇంచార్జ్ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పగా ప్రిన్సిపల్ సెక్రటరీ తెలుపగా, నల్లగొండ జిల్లాలో మండలాల వారీగా గ్రామాల వారీగా ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, త్వరలోనే జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం నల్లగొండ జిల్లాలో ఉన్న ఆర్‌డిఓలు, తహశీల్దార్‌లతో కలెక్టర్ సి నారాయణరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వచ్చే వారాన్ని ధరణి వారంగా భావించి ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధరణి సమస్యల పరిష్కారంలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంప్రదించాలని, వీలైనంత తొందరగా పెండింగ్ లేకుండా చూసుకోవాలని, అదే తరుణంలో తప్పులు చేయకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే శనివారం వరకు ఎటువంటి పెండింగ్ సమస్యలు లేకుండా అన్ని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వీటిలో కోర్టు కేసులు, నాలా కేసులు , పిఓబి కేసులు , రివర్స్ బ్యాక్ కేసులు అన్నింటిని పరిష్కరించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ అధికారి మోతిలాల్, కలెక్టరేట్లోని రెవెన్యూ విభాగానికి చెందిన వివిధ శాఖల సూపరిండెంట్లు పాల్గొన్నారు.

## ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రభుత్వ ఉద్యోగులు వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారిగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పలు శాఖల కార్యాలయాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలన్నారు. కార్యాలయాల్లో రికార్డ్ గదులతో పాటు హాజరు రిజిస్టర్స్‌లను పరిశీలించారు. అన్ని కార్యాలయాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఓ సుదర్శన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చే సోమవారం నుంచి జిల్లా స్థాయి ప్రజావాణి




**ప్రజాపక్షం/నల్లగొండ :** తదుపరి వచ్చే సోమవారం నుండి జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదులు సమర్పించాలనుకొనే పిర్యాదుదారులు సంబంధిత మండలాలలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలోనే ఫిర్యాదులు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కారం కావాలన్న ఉద్దేశ్యంతో గత సోమవారం మొదటి సారిగా మండల స్థాయి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్టం చేసేందుకు ఈ వారం సైతం మండల స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే తదుపరి జూలై 8వ తేది సోమవారం నుండి జిల్లా ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తామని ,ఆ ప్రజావాణిలో విద్య, వైద్యం , అత్యవసర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు సమర్పించాల్సి ఉంటుందని, అలాగే మండల స్థాయిలో పిర్యాదులు సమర్పించి 15 రోజులైనా పరిష్కారం కానివి మాత్రమే జిల్లా స్థాయికి రావాలన్నారు. భూములు,ధరణి కి సంబంధించిన ఫిర్యాదులు మండల స్థాయిలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

## విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాఠశాలలోని మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన తుమ్మల వెంకటేశ్వరరావు, పెండెం నాగార్జున, గుర్రం శ్రీనివాస్ రెడ్డిల పదవీ విరమణ కార్యక్రమానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి హాజరైనారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏ రంగంలో రాణించాలన్న తల్లిదండ్రుల పెంపకంతో పాటు ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులే మనిషి అభివృద్ధికి పునాదులు అని ఆయన అన్నారు. ఈరోజు వ్యాపార వాణిజ్య రంగాలతో పాటు దేశ రాజకీయాలలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారేనని ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఈ విషయాన్ని గుర్తుంచుకొని పట్టుదలతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎన్ని మౌలిక వసతులు కల్పించినప్పటికీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యా వ్యవస్థతో తట్టుకొనే స్థితిలో లేవని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుల ఖాళీ స్థానాలలో సత్వరమే పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై ఉన్నదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను తక్షణమే భర్తీ చేసేందుకు పెద్దల సభలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తను పుట్టింది తుర్కపల్లి మండలం లోనైనా బొమ్మలరామారం మండలం తో తనకు అవినాభావ సంబంధం ఉందని రెండు మండలాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేసినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ సంగిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు నరసింహ, జలాల్‌పురం పాఠశాల అభివృద్ధి కమిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు మల్లారెడ్డి మంగారెడ్డితో పాటు మాజీ ఎంపీపీ రజిత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గట్టయ్య, కస్తుల సాయిలు, నరసింహ, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పట్టించుకోవడం లేదని విద్యార్థుల ఆందోళన




**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మండలం పరిధిలోని ఎల్లారెడ్డి గూడెం వద్ద గల మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యాలయంలో విద్యార్థుల సమస్యలను పట్టుంచుకునే నాథుడే లేడని యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష తేదీలు ప్రకటించడంతో పిజి 2 సంవత్సరం 04వ సెమిస్టర్ పరీక్షా సమయంలో డిఎస్‌సి గ్రూప్ 2 నెట్ వంటి పరీక్షలు ఉండడంతో సెమిస్టర్ పరీక్షలను వా యిదా వేయాలంటూ గతంలో అనేకమార్లు రిజిస్టర్ ని కలిసిన స్పందించకపోవడంతో శనివారం యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టినట్లు వివరించారు. యూనివర్సిటీ యాజమాన్యం స్థానిక నల్గొండ జిల్లా మంత్రి ఇన్చార్జి వీసీ నవీన్ మిట్టల్ జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపించాలని వారు కోరారు.లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి మద్యానికి మంత్రి ఉంటాడు తప్ప విద్యకి మంత్రి ఉండడని ప్రభుత్వం విద్యను చిన్నచూపు చూస్తూ యూనివర్సిటీలకు వసతులు ఉండవు, ఉండడానికి విద్యార్థులకు సరిపడా రూములు ఉండవు, చదువుకోవడానికి వచ్చామా ఉద్యమాలు చేయడానికి వచ్చామని విద్యార్థులు మధ్య చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులపై అధికారులతో రాజగోపాల్‌రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం /మునుగోడు :** మునుగోడు, దేవరకొండ నియోజకవర్గం సాగునీరు అందించే శివన్నగూడెం, కిష్టరాయనిపల్లి సాగునీటి ప్రాజెక్ట్‌లపై చండూరు ఆర్‌డిఓ, దేవరకొండ ఆర్‌డిఓలతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శనివారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ రెండు ప్రాజెక్టుల కింద ముంపు గురవుతు న్న గ్రామాలలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూ పరిహారం త్వరితగతిన పూర్తి చేయాలని భూ సేకరణ స్ట్రక్చర్ వ్యాల్యూను రిసర్వే చేయించాలని అన్నారు. శివన్నగూడెం ప్రాజెక్టు కింద ముంపు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం వెంకెపల్లి, వెంకెపల్లి తండా, కిష్టరాయినిపల్లి ప్రాజెక్టు కింద ముంపుకు గురవుతున్న లక్ష్మణపురం, ఈదులగండి గ్రామాలలో హౌస్ స్ట్రక్చర్ రీవాల్యుయేషన్ రివాల్యుయేష న్‌లో ఆర్ అండ్ బి అధికారుల తో సమన్వయం చేసుకుం టూ రీవాల్యుయేషన్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల కింద ముంపు ప్రాంతాలలో కోల్పోయిన ఇండ్లు, భూ ములు ఉంటే వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని భూ సేకరణ చేయకుండా మిగిలిపోయిన భూములను సర్వే చేసి ఆ భూ ములు కలిగిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని తెలిపారు.

## కవి, రచయిత భూతంకు డాక్టరేట్




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రముఖ కవి, రచయిత భూతం ముత్యాలుకు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూర్ కు చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయన రాసిన కవితలు, రచనలు, నవలలు, సాహిత్య సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ను అందజేశారు. తమిళనాడులోని హోసూర్ లో శనివారం జరిగిన డాక్టరేట్‌ల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా కవి రచయిత భూతం ముత్యాలు కు గౌరవ డాక్టరేట్ సర్టిఫికెట్, మెడల్, మెమొంటోను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఫౌండర్ వి బాబు విజయన్, ఐఎన్‌టియుసి తమిళనాడు వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంఎల్‌ఏ డాక్టర్ కెఏ మనోకరన్, రిటైర్డ్ అసిస్టెంట్ న్యాయమూర్తి డాక్టర్ జె హరిదాస్, డాక్టర్ ఎస్ జ్ఞాన శేఖర్, డాక్టర్ కుమార్, డాక్టర్ శివప్ప, కెపి నితీష్ శ్రవణ్, డాక్టర్ గుణవంత మంజు, డాక్టర్ ఎస్ రవిచంద్రన్, డాక్టర్ చేరాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**రచయిత ముత్యాలు నేపథ్యం..**

కొండాపురం యుపిఎస్ చండూరు మండలం లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్ గా పనిచేస్తున్న కవి రచయితగా భూతం ముత్యాలు సృష్టించిన కథ నవల కవిత వ్యాసం ప్రక్రియ ఏదైనా నా సాహిత్యానికి గుర్తింపుగా హోసూర్ యూనివర్సిటీ ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ హోసూర్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ తో సత్కరించారు. నల్లగొండ జిల్లాలో మారుమూల వెనుకబడిన ప్రాంతమైన నాంపల్లి మండలంలోని తిరుమలగిరిలో 1971లో భూతం చిన్న మల్లయ్య, భూతం చిన్న మల్లమ్మ దంపతులకు జన్మించిన భూతం ముత్యాలు చిన్నతనం నుండి బాధలు భరించి హాస్టల్లో ఉంటూ చదువుకొని అంచెలంచెలుగా చదువులో ఎదుగుతూ దేవరకొండలో ఇంటర్ అటు తర్వాత హైదరాబాద్ చింతల్ బస్తీలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లో బిఏ డిగ్రీ పట్టా సాధించారు. బాల్యం నుండి కథలు సాహిత్యం పై మక్కువ ఉన్న డిగ్రీ వచ్చేసరికి కవిత్వంపై ఎనలేని పట్టు సాధించారు. అడపా దడప కవిత్వం రాస్తూనే కథ నవల సాహిత్యాన్ని విరివిగా చదివి ఆ దిశగా కథలు, నవలలు రాస్తూ తను రాసిన మొదటి నవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. మొదటి నవల సూర దశాబ్దం తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా చేర్చబడింది. ప్రస్తుతం అదే నవల బెంగళూరు యూనివర్సిటీ పాఠ్యాంశంగా చేర్చబడింది. అలా ఆయన రాసిన కథ నవల విశేష ప్రాచుర్యం పొందడమే కాక విశ్వవిద్యాలయ పిహెచ్‌డి పరిశోధకుల మన్ననలు పొందింది. పరిశోధనకు సైతం నోచుకొని మూడు దశాబ్దాల సాహిత్య కృషికి గుర్తించిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ యూనివర్సిటీ హోసూరు, తమిళనాడు ముత్యాలుకు గౌరవ డాక్టరేట్ హోసూరులో ప్రధానం చేశారు. తను రాసిన సాహిత్యం కు గుర్తింపు పొందిన అవార్డులు రివార్డులు పొందుతూ గౌరవ డాక్టరేట్ పొందడం పట్ల నల్లగొండ జిల్లాకు గర్వకారణమని మునుముందు మరిన్ని పురస్కారాలు పొందాలని వారి కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆయన శ్రేయోభిలాషులు, సాహిత్య అభిమానులు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ కార్మికుల సంక్షేమానికి కృషి




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** విద్యుత్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దేవరకొండ డివిజన్ ఐఎన్‌టియూసి 327 సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ జెండాను ఆయన ఆవిష్కరణ చేశారు. అనంతరం జనప్రియ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ఎంఎల్‌ఏ బాలునాయక్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పేరుతో రూ. 12 వేల కోట్లు ప్రజా ధనాన్ని వృధా చేసిందని విమర్శించారు. ఆగస్టు 15 కల్ల ప్రభుత్వం రైతుల యొక్క రెండు లక్షల రుణమాఫీని రూ. 32వేల కోట్లతో చేయబోతుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ సంఘం సభ్యులంతా ఏకతాటిపై ఉండి కార్మికులు సంక్షేమం కోసం కృషి చేసుకోవాలని అన్నారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ సినియన్‌వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌గౌడ్, టీఎస్ఎస్‌పిడిసిఎల్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, సెక్రటరీ భూపాల్‌రెడ్డి, సర్కిల్ ప్రెసిడెంట్ అమర్, అడిషనల్ సెక్రటరీ నారయ్య, దేవరకొండ డివిజన్ సెక్రటరీ ఎండి. నిరంజన్ అలీ, రాంబాబు, పిఏసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఊట్కూరి వేమన్‌రెడ్డి, ముక్కమళ్ళ వెంకటయ్యగౌడ్, కిన్నెర హరికృష్ణ, యూనుస్, ఎంపిటిసి జగన్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, లాలునాయక్, విద్యుత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను అన్ని విధాలా పరిష్కరిస్తా

ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చేనేత కార్మికుల సమస్యలను అన్ని విధాల పరిష్కారం అయ్యేలా చొరవ చూపిస్తానని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోడి శ్రీనివాసులు నేతృత్వంలో చండూరు చేనేత కార్మిక సంఘం ,చేనేత పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో పలువురు చండూరు పట్టణ చేనేత కార్మికులు శనివారం మునుగోడులోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఏను కలిసి చేనేత సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ అక్కడికి వచ్చిన కార్మికులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రిఫ్ట్ ఫండ్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెక్కులు వెంటనే విడుదల అయ్యేలా ఆర్థిక మంత్రి,ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాటు చేస్తానన్నారు. చేనేత మిత్ర ద్వార 3వేలు వచ్చేలా చూస్తానని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను ఒక్కొక్కటిగా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. చేనేత కార్మికుల పరిష్కారంతోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని గుర్తుచేశారు. వైఎస్ఆర్ హయంలో 312కోట్ల చేనేత రుణాలను మాఫీ చేయించిన విషయం అందరికి తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకన్న, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తిరందాసెఉ శ్రీనివాసులు, చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, కర్నాటి శ్రీనివాసులు, రాపోలు వెంకటేశం, రావిరాల శ్రీను, ఏలే శ్రీను, చెరుపల్లి కృష్ణ , ఏలే సుధాకర్, పున్న బిక్షమయ్య, సత్తయ్య, రాపోలు లక్ష్మ య్య, చంద్రశేఖర్, తిరందాసు దామోదర్, లిరందాసు ఆంజనేయులు, అంజయ్య, వెంకటేశం ,రాజు, తిరందాసు నందు , గంజి బిక్షం పాల్గొన్నారు.

## కెఎస్‌రెడ్డి సేవలు ఆర్‌టిసికి స్ఫూర్తిదాయకం




**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆర్‌టిసి సంస్థలో గత 37 సంవత్సరాలుగా నిబద్ధతో పనిచేస్తూ పదవి విరమణ పొందిన కెఎస్ రెడ్డి సేవలు సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికి స్ఫూర్తిదాయకమని డిఫో మేనేజర్ జి.రాంమోహన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ఆర్‌టిసి డిఫో కంట్రోలర్ , ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి కర్ర సైదిరెడ్డి పదవి విరమణ సందర్భంగా నల్లగొండ ఆర్‌టిసి డిఫోలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి సంస్థలో కండక్టర్‌గా, కంట్రోలర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మరోపక్క తోటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌లో పని చేస్తూ ఆర్‌టిసి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం చేసే ప్రతి ఉద్యోగికి పదవి విరమణ ఉంటుందన్నారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రిజినల్ కార్యదర్శి జి.వెంకటయ్య, డిపో కార్యదర్శి కెఎల్ స్వామి, ఎన్ఎస్ రాజు, యాదగిరి, ఆర్.పద్మ, లూర్థమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ వీఆర్‌ఏల పరిస్థితి ఆందోళనకరం

చెల్లా చెదురైన పూర్వ వీఆర్‌ఏలు
పదోన్నతి ఇచ్చారు..సమస్యలు మరిచారు..!

**ప్రజాపక్షం/నెక్కొండ :** రాష్ట్ర వ్యాప్తంగా పూర్వ వీఆర్‌ఏల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పూర్వ వీఆర్‌ఏల రాష్ట్ర జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రస్తుత జూనియర్ అసిస్టెంట్ కన్నెగంటి రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వీఆర్‌ఏలకు రాష్ట్ర ప్రభుత్వం పది వేల గౌరవ వేతనం అందించేదని, వారి కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అనారోగ్యం ఖర్చులు ఇవన్ని కలిపి ఏ మూలకు సరిపోవడం లేదని వారు అనేక సంవత్సరాలుగా ఆందోళన చేశారు. 2022 సంవత్సరంలో సుమారు 80 రోజుల పాటు తమకు పేస్కూలుతో పాటు పదోన్నతి కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడిలు, నిరాహార దీక్షలు చేసి చివరగా 2022 అసెంబ్లీ సమావేశాలలో ఛలో హైదరా బాద్ కార్యక్రమం చేశారు. ఛలోహైదరాబాద్ కార్యక్రమంలో వేల మంది హైదరాబాద్ నగరానికి తరలి వెళ్ళగా తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పైన పెద్దయెత్తున ఆందోళన నిర్వహించారు. ఈ పోరాటం ఆనాటి మిలియన్ మార్చ్‌ను గుర్తు చేసింది. ఆ పోరాటం జరిగి తొమ్మిది నెలల అనంతరం ఎన్నికలు సమీపించడంతో ముఖ్య మంత్రి కెసిఆర్ జులై 24న వీఆర్‌ఏలకు పే స్కేలు, పదోన్నతి, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటన చేస్తూ జివో నెంబర్ 81 ద్వారా డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్‌గా ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్లుగా పదవ తరగతి చదివిన వారిని ఆఫీసు సభార్డి నేట్లుగా చేస్తూ రాష్ట్రంలోని 20వేల మంది వీఆర్‌ఏలలో 16వేల మందిని క్రమబద్ధీకరించారు. ప్రస్తుతం పూర్వ వీఆర్‌ఏలకు స్కేల్ ఇచ్చిన సంతోషం లేకుండా పోయింది. 168 మంది వీఆర్‌ఏలకు ర్యాండమైజేషన్‌లో డిస్ట్రిక్ట్, డిపార్ట్‌మెంట్ ఆలాట్ కాక వీఆర్‌ఏగానే కొనసాగుతున్నారు. దాదాపు 500 మంది జూనియర్ అసిస్టెంట్స్, రికార్డ్ అసిస్టెంట్స్‌కు జిల్లా, జోన్ పరిధి దాటి మల్టీ జోన్‌లో 200 నుండి 300 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్స్ ఇవ్వడం వలన చిన్న చిన్న పిల్లల్ని వదిలి ఉద్యోగం చేయలేక మహిళా ఉద్యోగులు మానసికంగా కుంగిపోతున్నాయి. ర్యాండమైజేషన్‌లో తల్లి డిపార్ట్‌మెంట్ అయిన రెవెన్యూ కాకుండా మున్సిపల్, హెల్త్ ఎడ్యుకేషన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, డిపార్ట్‌మెంట్‌లలో పడడం వలన అక్కడ కొత్త పనులు చేయలేక చాలా ఇబ్బంది పడుతున్నాన్నారు. ఇలా పలు సమస్యలతో ఇప్పటికే చాలా మంది ఆత్మ హత్య చేసుకున్నారు. హనుమకొండ జిల్లా దామెర మండలానికి చెందిన పూర్వ వీఆర్‌ఏ జూనియర్ అసిస్టెంట్ సతీష్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, జనగామ జిల్లాకు చెందిన దేవరాయ సంధ్య, వరంగల్ జిల్లా వీఆర్‌ఏ తౌటి రాజు(44) తదితరులు పలు సమస్యలతో మరణించారన్నారు. ఇలా చాలా మంది వీఆర్‌ఏలు పలు సమస్యలతో ప్రాణాలు వదులుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పూర్వ వీఆర్‌ఏల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి ముగిసినప్పటికి తమ బాధలు ఏ అధికారికి చెప్పుకోవాలో తెలియక వారు కుమిలిపోతున్నారు. గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీఆర్‌ఏలకు న్యాయం చేస్తానని పలుమార్లు హామీ ఇవ్వడం జరిగింది. అందుకే నేడు వరంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి హోదాలో రానున్న రేవంత్‌రెడ్డి వీఆర్‌ఏల సమస్యలపై ఒక క్లారిటీ ఇస్తానని,



ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని కోటి ఆశలతో పూర్వ వీఆర్‌ఏలు ఎదురు చూస్తున్నారు.

# అర్హులకు అందని 'డబుల్ బెడ్'

సమగ్రంగా దర్యాప్తు చేసి
అర్హులకు న్యాయం చేయాలి
పట్టాలతో కలెక్టర్ కార్యాలయం
ముందు ధర్నా



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్‌లో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపిక సక్రమంగా జరగలేదని, జాబితాలోని అనర్హుల పేర్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య మట్లాడుతూ స్థానికంగా రేషన్ కార్డులు, గుర్తింపు కార్డులు లేకున్నా లబ్ధిదారుల ఎంపికలో అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే సొంతంగా స్థలాలు, భూములు, బిల్డింగులు ఉన్న వారికి గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో అవకాశం కల్పించడంతో పేదలకు అన్యాయం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలని, అనర్హులను తొలగించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే కలెక్టర్ మరియు జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన ఒంటరి మహిళలు, వికలాంగులు, ఇండ్లు లేని నిరుపేదలకు న్యాయం చేయాలని' అన్నారు. గతంలో సర్టిఫికెట్ పొందిన వారికి డబల్ బెడ్ రూమ్ ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని, గజ్వేల్ లో గత 30 సంవత్సరాలకు పైగా అద్దెకు ఉంటూ ఆటో డ్రైవర్లు, బీడీ కార్మికులు, రోజు వారి కూలీలుగా పనిచేస్తున్న పేదలకు డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఇప్పటికే సొంత ఇండ్లు ఉన్న వారి విషయంలో కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చిన కూడా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇండ్లు లేని నిరుపేదలను ఎంపిక చేయాలని, అనర్హుల పేర్లు తొలగించాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో జరిగే పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కమిటీ నాయకులు నర్సింలు, పద్మ, కవిత, లక్ష్మి, వెంకటేష్, మహేందర్, సంపత్, రాము, నరహరి, సుక్కయ్య, మంజుల పాల్గొన్నారు.

## ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధిః** ధరణి, ప్రజావాణి పెండింగ్ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ధరణి, ప్రజావాణి ధరఖాస్తులపై అధికారులతో సమీక్షించారు. అంతకు ముందు చీఫ్ కమీషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి నవిన్ మిట్టల్ హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వయించి మాట్లాడారు. ధరణి ధరఖాస్తుల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారిగా వచ్చిన ధరణి, ప్రజావాణి ధరఖాస్తులపై దిశి నిర్దేశం చేశారు. సకా లంలో పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వారం రోజుల్లోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిలోనూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ ధరఖాస్తుల ప్రక్రియలో సంబంధిత అధారిత డాక్యుమెంట్లను స్పష్టంగా అప్‌లోడ్ చేయాలని, పెండింగ్ ధరఖాస్తుల డేటా కరెక్షన్, కోర్టు కేసులు, ముటేషన్ తదితర మాడ్యుల్స్‌ను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నందున ధరణి, ప్రజావాణిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్‌డిఓలు కొమురయ్య, వెంకన్న, అన్ని మండలాల తహాశీల్దార్లు, ఈడిఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

**అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు**

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ప్రభుత్వ అధికారులుగా సేవలందించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆంజనేయ రాజు, స్టాటిస్టికల్ అధికారి జితేందర్‌రెడ్డి పదవి విరమణ పొందగా వారిని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ సన్మానించారు. కలెక్టర్ మాట్లాతూ ప్రభుత్వ అధికారులుగా ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్నలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, ఉద్యానవన అధికారి కేఆర్ లత, ఆర్‌డిఓ కొమురయ్య పాల్గొన్నారు.

## రూ.30 కోట్లతో భద్రకాళి ఆలయాభివృద్ధి

దేవాదాయ, సమాచార, పౌర సంబంధాల
శాఖ కమీషనర్ హనుమంతరావు
భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వరంగల్‌ప్రతినిధి :** రూ. 30 కోట్లతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని దేవాదాయ, ధర్మాదాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావు వెల్లడించారు. శనివారం ఉదయం వరంగల్‌లోని భద్రకాలి ఆలయంలో కమీషన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు కమీషనర్‌కు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో వేదమంత్రోత్సారణాల మధ్య ఆశీర్వచనలు ఇచ్చారు. కమీషనర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కమీషనర్‌కు ప్రసాదం అందజేశారు. అనంతరం దేవాలయం అభివృద్ధిపై కమీషనర్ అర్చకులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని అర్చకులు, ఆలయ అధికారులు కమీషనర్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈసందర్భంగా కమీషనర్ హనుమంతరావు మాట్లాడుతూ రూ. 30 కోట్ల నిధులతో భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎల్లవేళల సహయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఆలయం పక్కన ఉన్న భూమిని పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మ ణ్ కుమార్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాములు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కిరణ్మయి, దేవాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి,
స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** ములుగు జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులలో వేగం పెంచాలని అవసరమైతే అదనపు వర్కర్స్‌తో పనులు చేయించాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులు డిసెంబర్ మాసంలోపు పూర్తి చేసి అధికారులకు అందించాలని, నూతన కలెక్టరేట్ వచ్చే రహదారి కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా మెడికల్ కళాశాలలో ఎన్ని కోర్సులు అందుబాటులో ఉంటాయి. ఎంత మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. వారికి అందించే సదుపాయాలు ఎలా ఉంటాయనే తదితర అంశాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ లాల్, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ఆర్‌అండ్‌బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మీసేవా కేంద్రాల నిర్వాహకుల జీవితాలు ప్రశ్నార్ధకం

ప్రభుత్వం స్పందించాలంటూ
మీసేవ నిర్వాహకుల డిమాండ్




**ప్రజాపక్షం/పాపన్నపేట:** త్వరలోనే ఊరికి ఒక మీ సేవా కేంద్రాలను ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని మీ సేవ కేంద్రం నిర్వాకులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలుగా మూడు వేల రూపాయల కమిషనతో మీసేవ కేంద్రాలను నడిపించామన్నారు.ఇచ్చే కమిషన్ తో సేవా కేంద్రం అద్దె సరిపోకున్న ప్రభుత్వం పర్మినెంట్ గా ఉంచి కమిషన్ పెంచుతుందని గంపెడు ఆశతో ఎదురుచూస్తున్న నిర్వాహకులకు ఎదురు దెబ్బతగిలిందన్నారు. జులై1 నుండి ప్రభుత్వం సెంటర్లు నిర్వహించేందుకు ఆపరేటర్లను తీసుకునేందుకు కొన్ని జిల్లాలలోలిస్టు తయారుచేసిందన్నారు.దీంతో ఇప్పటివరకూ ఆయా మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో నిర్వహించే మీ సేవా కేంద్రాలు మూతపడే అవకాశం ఉందన్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం ప్రకటించనుంది. కమిషన్లు పెంచి మీసేవ కేంద్రాలను ఆదుకోవాలని ఎన్నోసార్లు పిటిషన్లు ఇచ్చిన ఏ ప్రభుత్వం స్పందించలేదు. కనీసం సెంటర్ల నిర్వహణ పగడ్బందీగా నిర్వహించే విధంగా జీవో జారీ చేస్తారని, కమిషన్లు పెంచిమీసేవ నిర్వాహకులను ఆదుకుంటారని భావించిన యజమానుల మనగాడ ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు గ్రామంలో మాత్రం మీసేవ సెంటర్లు వస్తున్నాయని మహిళాసంఘాల సభ్యులు, యువకులు ఉత్తేజంతో సెంటర్ పెట్టుకోవడానికి పైరవీలు చేస్తున్నారన్నారు.ఇప్పటివరకూ వివిధ కుల, ఆదాయ ధృవపత్రాలు, వివిధ రకాల బిల్లు చెల్లింపులు మీసేవా ద్వారా ప్రజలు పొందేవారు. అంతేకాకుండా ఓటర్ కార్డ్స్, రేషన్ కార్డ్స్, రేషన్ పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ప్రభుత్వానికి సంబంధించిన అన్ని సేవలూ మీ సేవ కేంద్రాలకు ఇవ్వాలని ఎన్నోసార్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇప్పటివరకూ ఆయా సేవలకు కేంద్రంగా వున్న మీసేవా సెంటర్లు మూతపడక తప్పదు అన్నారు. ఏదిఏమైనా కొత్త మీసేవ సెంటర్లు ఇవ్వడంతో ఉన్న సెంటర్లు తొలగిపోయి గత 13 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న మీసేవ నిర్వాహకుల బ్రతుకులు ఆగం అవుతాయని ప్రభుత్వం స్పందించి కొత్త సెంటర్లు ఇచ్చే నిర్ణయం వెనక్కి తీసుకొని తగిన న్యాయం చేయాలని ఆయా మీసేవ సెంటర్ల యజమానులు విన్నవించుకుంటున్నారు.

## అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

జడ్పీ వైస్ చైర్ పర్సన్
కళ్లెపు శోభ రఘుపతిరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని జెడ్పి వైస్ చైర్ పర్సన్ కల్లపు శోభ రఘుపతిరావు అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జెడ్పి కార్యాలయం లో సమావేశ మందిరంలో జెడ్పి సీఈవో విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పి వైస్ చైర్ పర్సన్ పాల్గొని మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే జిల్లా అభివృద్ధిలో ముందుంటదన్నారు. ప్రభు త్వం అందించే పథకాలను ప్రజలకు అందే విధంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాలలో వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి రోగాల బారిన పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వానకాలం పంట సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్న మద్యం షాపుల పై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జడ్పిటిసిలు పులి తిరుపతిరెడ్డి, జోరుగ సదయ్య, గౌర్రె సాగర్, గుడాల అరుణ, లింగమల్ల శారద, సాయిని విజయ ముత్యం, రేగొండ, మొగుళ్లపల్లి కో ఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు డిఏఓ విజయభాస్కర్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, వైద్య శాఖ అధికారి సిహెచ్ మధుసూదన్, ఆర్డబ్ల్యూఎస్ ఈ నిర్మల, భూపాలపల్లి సిడిపిఓ అవంతి, అన్ని శాఖల అధికారులు జెడ్పి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కూలీ పెంచాలి..భూమి పంచాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** కూలీ పెంచాలి, భూమి పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్ అన్నారు. శనివారం పింజ ఎల్లయ్య, కూరపాటి లక్ష్మి అధ్యక్షతన మండల కేంద్రంలోని గెస్ట్‌హౌస్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రెండవ మహాసభ జరిగింది. ఈ మహాసభను ఉద్దేశించి రమేష్ మాట్లాడుతూ కూలి పెంచాలి, భూమి పంచాలన్నారు. మండలంలోని చిన్నరాంచర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్‌లో 174 సర్వే నెంబర్‌లో గత కొంత కాలంగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని అక్కడ ఉంటున్నారు. వారికి ఇండ్ల, ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని, వారికి అండగా నిలబడిప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మహాసభలో మండల అధ్యక్షులుగా ఇంజ ఎల్లయ్య, కార్యదర్శిగా తాళం రాములు, ఉపాధ్యక్షులుగా కొడుకుల సిద్దయ్య, కూరపాటి లక్ష్మి, సహాయ కార్యదర్శిగా బొట్టు కలమ్మ, భూమయ్య, కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే

ఎమ్మెల్సీ కూర రగోతంరెడ్డి

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమినని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి అన్నారు. శనివారం నరసాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీనివాస్ పదవి విరమణ పొందిన సందర్భంగా పాఠశాల ఆవరణలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై ప్రసంగించారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తే మంచి పేరు సంపాదించుకుంటారన్నారు. అచ్చంపేట పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉద్యోగరీత్యా పాఠశాలకు మంచి సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన సేవలను విద్యార్థులు ఎప్పటికీ మరువలేరని అన్నారు. అంతేగాక పిఆర్‌టియు టీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఉద్యోగస్తులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం పిఆర్‌టియు సంఘ సభ్యులు విద్యార్థులు గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఎంఈఓ బుచ్చా నాయక్, పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, ఎంపీ ఓ వైద్యం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు స్వరూప రాణి, ఉపాధ్యాయులు ధన్ సింగ్, తారా సింగ్, చెన్నా నాయక్, సత్యనారాయణ, రమేష్ నాయక్, లాలూ నాయక్, శ్రీనివాస్, జాదవ్, గ్రామస్తులు శ్రీనివాస్ నిరుడు బిక్షపతి, గోవర్ధన్, సాయిలు, కమ్మరి షణ్ముఖ చారి, పాల్గొన్నారు.






## నిధుల విడుదలకు వినతి

**ప్రజాపక్షం/హన్మకొండటౌన్:** ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. శనివారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు రూ.7వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, గత మూడు సంవత్సరాలుగా నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీని వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని,కళాశాలలు సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదని, ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందిగా మారిందని అన్నారు.ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల కుమార్, కుంటి పవన్, మాలోతు శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

## రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ




**ప్రజాపక్షం/వాజేడు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం ములుగు జిల్లా వాజేడు సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి సహకార సంఘం అధ్యక్షులు ఎగ్గడి అంజయ్య అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంపై రైతులు తమ తమ అభిప్రాయాలను నేరుగా వ్యక్త పరచాలని కోరారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను స్వయంగా తెలిపారు. రైతులు వ్యవసాయం చేసే ప్రతి ఎకరానికి రైతు భరోసా కల్పించాలని, వాకి అభిప్రాయాలను స్వీకరించిన అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.ఏటూరునాగారం ఏవో వేణుగోపాల్, సహకార సంఘం ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాధరాజు, సహకార సంఘం సిఈఓ సత్యనారాయణ, సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ములుగుజిల్లా ప్రతినిధి :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ములుగు ఎస్‌పి శబరీష్ అన్నారు. అన్నారు. ములుగు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ములుగు ఎస్‌పి శబరీష్ చేతుల మీదుగా ప్రజలు సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఉండేందుకు సైబర్ హైజీన్ అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా ఉండాలంటే చేయాల్సిన పనులు, చేయకూడని పనుల గురించి వివరించినట్లు తెలిపారు. ఈ పోస్టర్‌ను ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో, గవర్నమెంట్ ఆఫీసులు, స్కూల్స్, కాలేజీస్, ఇతర ప్రదేశాల్లో అంటించి ప్రజలకు సైబర్ నేరాల మీద అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు.ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా సైబర్ నేరాల బారిన పడవద్దని, ఫోన్‌కు వచ్చే ఎటువంటి అసంబంధిత లింక్‌ను ఓపెన్ చేయవద్దని బ్యాంక్ వివరాలు ఓటిపి పాస్‌వర్డ్స్ ఎవరికి చెప్పొద్దని,మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి డయల్ చేయాలని, లేదా www.cybercrime.gov.inకు లాగిన్ చేసి కంప్లైంట్ నమోదు చేయాల్సిందిగా ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్‌పి సందీప్ రెడ్డి, డిఎస్‌పి ములుగు రవీందర్, ఇన్‌స్పెక్టర్ యాసిన్, ములుగు సిఐ శంకర్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్టాఫ్ జహూర్, ఉమా మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఎ కృషితో తండాల అభివృద్ధి

**ప్రజాపక్షం/తొర్రూరురూరల్ :** పాలకుర్తి ఎంఎల్ఏ యశస్విని రెడ్డి కృషితో తండాల అభివృద్ధికి పాటుపడుతామని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షులు సుంచు సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని పెద్ద దుబ్బ తండాను సందర్శించి తండావాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సుంచు సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని, అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గృహ విద్యుత్, త్వరలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫి చేయడం జరుగుతున్నదన్నారు. తండాలో ఇంకా ఏమైన సమస్యలుంటే ఎంఎల్ఏ దృష్టికి తీసుకవెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బదావత్ లింబా నాయక్, మండల యూత్ నాయకులు బదావత్ అశోక్, నాయకులు రవి, శ్రీను, భాస్కర్, వరుణ్, వెంకన్న, మాజీ సర్పంచ్ హపావత్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మహబాదు జిల్లా తొర్రూరు పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్ పి. శాంతి కుమార్ అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలో నిర్మిస్తున్న సైడు కాలువ పనులను ఆయన పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మేయిన్ రోడ్డులో మద్య నుండి అటు 50 అడుగులు, ఇటు 50 అడుగులు నిర్మాణ కొలతలను పరిశీలించడం జరిగిందని, పట్టణంలోని పాలకేంద్రం నుండి ఇంటిగ్రేడెడ్ మార్కెట్ వరకు కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. దీనికి పట్టణంలోని మేయిన్ రోడ్డు ప్రజలు సహకరించి, పట్టణ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈకార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్, మున్సిపల్ ఎఈ రంజిత్, ఖురేషి, పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుచేసి లక్షలాది మందికి ఉపాధి కల్పి స్తామని గత ప్రభుత్వం రైతుల వద్ద సేక రించిన వందల ఎకరాల భూమి నిరూ పయోగంగా మారిందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే పరిశ్రమలను నెలకొ ల్పి ఉపాధి కల్పించి నిర్వాసితులకు నిరు ద్యోగ యువతకు తోడ్పాటు కల్పిం చాల ని అఖిల భారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దా రపు రమేష్ డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభు త్వం సంగెం, గీసుగొండ మండలాల పరిధిలో సుమారు 1300ఎకరాల రైతులు రెండు పంటలు పండించే భూమిని టెక్స్‌టైల్ పార్క్ కోసమని రైతుల వద్ద నుంచి బలవంతంగా సేకరించి 8సంవత్సరాలు పాలన కొన సాగించి ఎలాంటి పరిశ్రమలు గాని, ఉపాధి కొల్పోయి రైతులు భూమినిపై ఆధారపడిన కూలీలు జీవనాధారం కొల్పోయారన్నారు. భూసేకరణ చట్టం సరిగ్గా అమలు చేయకుండా నిర్వాసితులను అనేక ఇబ్బందులకు గురిచేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా ప్రచార ఆర్భాటం కోసం పర్యటనలు చేపట్టకుండా భూములు కొల్పోయిన నిర్వాసితులకు చట్ట ప్రకా రం రావాల్సి పరిహారం, ఉపాధిని కల్పించి పరిశ్రమలకు ఉపయోగంలేని భూములను రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు

# రాష్ట్రానికి సింగరేణి గుండెకాయ

## టిబిజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి



ప్రజాపక్షం/నస్పూర్: 130 సంవత్సరాల పైగా చరిత్ర కలిగిన సింగరేణి తెలం గాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని, సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికే కేటాయించాలని టిబిజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. గతంలో సింగరేణి గనుల ప్రైవేటీకరణ, వేలం టెండర్లను వ్యతిరేకస్తూ సమ్మె పోరాటాలు చేశామని గుర్తు చేశారు. తెలం గాణకు చెందిన బొగ్గు బ్లాకులను వేలంలో పెట్టకుండా సింగరేణికే అప్పగించా లన్నారు. గతంలో సత్తుపల్లి, కోయగూడెం బ్లా కులను ప్రైవేటుకు అప్పగించిన పనులు చేపట్టనియ్యలేదని, ఇ ప్పుడు శ్రావణపల్లి బ్లాక్ ను స్వయంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దగ్గరుండి ప్రైవేటు వారికి అప్పగించేందుకు సహకరించడం శోచనీయమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకం అం టూనే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వేలం ప్రారంభోత్సవానికి ఎలా హాజర వుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిం గరేణి పై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో గనుల ప్రైవేటీకరణ, వేలాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణికి గనులు అప్ప గించాలని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో టీబీజీ కేఎస్ సింగరేణి కాపాడేందుకు పోరాటాలు చేసి ఒదని, కార్మికులందరూ మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండిఆర్ యాక్ట్17ఎ. సెక్షన్2 ప్రకా రం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కేంద్ర ప్రభుత్వానికి వేలం, ప్రైవేటీకరణ చేయడానికి అధికారం లేదన్నారు. జులైలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, 1వ తేదీన సింగరేణి గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారులకు వినతి పత్రాలు అందిస్తామని,3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేస్తామని, 6న జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. 9వ తేదీన గోదావరిఖని కేంద్రంగా 5000 మందితో టిబిజికెఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని, ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కోల్ బెల్టు ప్రాంత ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు హాజరవుతారని, అన్ని వర్గాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ పెట్టం లక్ష్మ ణ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపాల్, లాల, జి. స్వామి తదితరులు పాల్గొన్నారు.




## కోనరావుపేట ఆదర్శంగా తీర్చి దిద్దుతా

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/కోనరావుపేట : కోనరావుపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జెడ్పి చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డితో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో 127 మంది లబ్దిదారులకు శనివారం పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనరావుపేట మండలాన్ని రాజకీయా లకతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. నిరుపేద ప్రజలకు చేయూతనివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని, నిస్సహా యులకు సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కోనరావుపేట మండలానికి కావాల్సిన బ్రిడ్జిల నిర్మా ణం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తుందని మండలాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసే బాధ్యత తీసు కుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రయ్య గౌడ్, తహశీల్దార్ విజయ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన్ రావు, బండ నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

### ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు లేనిదే ప్రజారోగ్యం లేదని, కొవిడ్ సమయంలో ప్రాణాలను కూడా లెక్కచేయక విధులు నిర్వర్తించిన తీరు మరువలేనిదని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బల్దియా ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్ అన్నారు. శనివారం జగిత్యాల బల్దియా కార్యాయంలోఅత్యవసర కౌన్సిల్ సమా వేశం నిర్వహించిన అనంతరం తోట గంగారాం పదవీవిరమణ సందర్భ ంగా ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. తన పదవీ కాలంలో చేసి న సేవలు చిరకాలం గుర్తుంటాయనీ బల్దియా చైర్ పర్సన్, అధికారులు, తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కమిషనర్ సారూ..సమస్యలు పరిష్కరించండి

ప్రజాపక్ష/మెట్‌పల్లి :పట్టణంలోని 13వ వార్డు మోమీన్ పురా కు చెందిన కాలనీ వాసులు గత 15 సంవత్సరాల నుండి డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మాణాలు లేక ఇబ్బం ది పడుతున్నారని, శనివారం మున్సిపల్ కమిషనర్ టి మోహన్ కు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు మాట్లా డుతూ చిన్నపాటి వర్షం పడితే ఇంటిముందు నీళ్లు నిలుస్తున్నాయి. మలేరియా డెం గ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా సంబంధిత మున్సిపల్ కమిషనర్ మోహ న్ చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో తోఫిక్, శ్రీకాం త్, లలిత, నీలిమ, రాధా, రాజ్యలక్ష్మి, రహీమా, ఇర్ఫానా, రిహన, తదితరులు పాల్గోన్నారు.

## ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :శ్రీరాంపూర్ ఏరియాలోనే ఆర్కె 7గనిలో శుక్రవారం మధ్యాహ్నం షిఫ్ట్ లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు గాయాల పాలయ్యాడు. శనివారం ప్రమాద ఘటన పైన తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం హ్యాండ్ ఫీలింగ్ 2ఎ సౌత్ 30 ఎల్ 17 డి ఫీలింగ్ చేస్తున్న సమయంలో జనరల్ మజ్దూర్ పి. అశోక్ అనే కార్మికునికి ప్రమాదవశాత్తు ఎడమ చేయి మధ్య వేలుకు దెబ్బ తగలడంతో కండ తెగి వేలు ఫ్యాక్చర్ అయినట్లు పేర్కొన్నారు. ప్రమాదమని తెలిసినా హ్యాండ్ ఫీలింగ్ తో ఫిల్లింగ్ చేయడం వలనే ప్రమాదం జరిగిందని, బాధ్యులైన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదం గురించి తెలుసుకొని ఎఐటియుసి నాయకులు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అశోక్ ను పరామర్శించారు. జరిగిన ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అక్బర్ అలీ, ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, ఆర్కె 7 ఫిట్ కార్యదర్శి బీర రవీందర్, సహాయ కార్యదర్శి ప్రతాప్, రమేష్, బానేష్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి

ప్రజాపక్షం/సోన్ : చేపల వేటకు వెళ్లి వల చుట్టుకుని వ్యక్తి మృతి చెందిన సం ఘటన శనివారం సోన్ మండల కేంద్రంలో చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్ గ్రామాని చెందిన రేసున్ కుంటే సూర్య(23) తన గ్రామ మత్స్యకారులు కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యాంలో చేపల వేటకు వెళ్లారని ప్రమాదవశాత్తు అతని కాళ్ల నుండి నడుము వరకు చేపల వల చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడని,మృతుని తండ్రి ఎల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోన్ ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

## సిడిపిఒ మీద చర్యలు తీసుకోవాలి

### ఆదివాసీ నాయకుల డిమాండ్

ప్రజాపక్షం/ఖానాపూర్ : సిడిపిఒ సరిత ఆదివాసీ మహిళా అంగన్వాడీ టీచర్స్ మీద అక్రమ సంబంధం నింద ఆరోపణ ని ఆదివాసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం పెంబి మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు పత్రిక సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ వాసులకు పలుపడుతున్న సిడిపిఒపై పై అధికారులకు ఫిర్యాదు చేసిన ఆదివాసీ అంగన్వాడీ టీచర్ మీద సిడిపిఒ సరిత అక్రమ సంబంధం నింద ను తీవ్రంగా ఖండిస్తున్న మని సి.డి.పి.ఓ పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మాడవి సుంగు పటేల్,అంకుష్ రావ్ పటేల్,మాజీ సర్పంచ్ సూర్యబాను,కుడిమేత మధు,నైతం మారుతీ పటేల్ తదితరులు ఉన్నారు.

## పలు వార్డుల సమస్యలపై చర్చలు



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ జగిత్యాల మున్సిపల్ లో శనివారం అత్యవసర కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి. మున్సి పల్ కౌన్సిల్ మీటింగ్ పలు వార్డుల సమస్యల పై చర్చతో పాటు మున్సిపల్ ఏజండా, అదనపు ఏజండా పాస్ చేశారు. కౌన్సిల్ సభ్యులు అద నపు ఏజ ండాలో జగిత్యాల పట్టణ యావర్ రోడ్ 100 ఫిట్ల రోడ్ విస్తరణ అంశాన్ని కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎంతో ఉన్న చొరవతో నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ ఛాంబర్ లో పత్రిక సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్, వివిధ వార్డుల కౌన్సిలర్స్ నాయకులు ఉన్నారు.

## ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు పూర్వ వైభవం తెస్తాం

### * ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ (నైట్) తెలుగు కళాశాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. గత కొంత కాలంగా బోధనా సిబ్బంది తోపాటు నాన్ టీచింగ్ స్టాఫ్ లేక మూతపడ్డ సదరు సంస్కృతాంధ్ర కళాశాలను శనివారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ తో కలిసి విప్ లక్ష్మ ణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. పట్టణంలోని లక్ష్మి నరసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో చదువుకున్న వందలాది మంది విద్యార్థులు తెలుగు పండిత్ లుగా అధ్యాపకులుగా ఉద్యోగం పొంది జీవితంలో స్థిరపడ్డారని ఇంతటి ఘన చరిత్ర ఉన్న కాలేజీ ప్రస్తుతం మూతపడి ఉండటం శోచనీయమని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల అధ్యాపకులు, సిబ్బంది లేక కళాశాల మూసివేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు.తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఇట్టి కళాశాలను పునఃప్రారంభించేందుకు మంత్రి శ్రీధర్ బాబు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కళాశాలను పునః ప్రారంభించేంత వరకు ఉన్నత విద్యామండలి అధికారులతో మాట్లాడి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భోదనా సిబ్బ ంది,పారిశుధ్య కార్మికులు, ఇతర ఉద్యోగులను కళాశాలలో నియమించాలని తెలపడం జరిగిందన్నారు. ఏడాదికి సుమారు 30 లక్షల (వేతనాలు) నిధులు అవసరమవుతున్న విషయాన్ని ఆర్జేడీ ద్వారా పై అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు కళాశాలతో పాటు ఈ ప్రాంత సాగు,త్రాగు నీటి అవసరాల కోసం ముఖ్యమంత్రి తో చర్చించినట్లు చెప్పారు.అదేవిధంగా ధర్మపురి లో నూతనంగా ఐటీఐ,డిగ్రీ,పాల్ టెక్నీక్ కళాశాలల ఏర్పాటు కు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడి జి.యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, కార్యదర్శి ఎస్.రామకిష్టయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ కృష్ణ చైతన్య, నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మ ణ్,జక్కురవీందర్, జె.సుముఖ్, తదితరులు పాల్గొన్నారు.

## నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి

### జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా గత 20రోజులుగా మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, నెంబర్ ప్లేట్ లేకుండా, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ లపై, నిబంధనలకు విరుద్ధంగా సైరెన్ ఉపయోగించే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మైనర్ డ్రైవింగ్ కేసులు–414,లైసెన్స్‌లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు–831, సేల్ ఫోన్ డ్రైవింగ్ –163, నెంబర్ ప్లేట్ లేకుండా నడిపే వాహనాలను 558 గుర్తించి వాటికి నుంబెర్ ప్లేట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, మద్యం సేవించి వాహానాలు నడిపే వారిపై–334, బహిరంగ ప్రదే శాల్లో మద్యం సేవించే వారిపై 326 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.ఎస్పి మాట్లాడుతూ, వాహనాల తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయడం మా ముఖ్య ఉద్దేశ్యం కాదని కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమని, ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్య స్థానాలు చేరుకోవాలనే ఉద్దేశ్యంతో తనిఖీలు చేపట్టాడాం జరుగుతుందని కావున ప్రజలు రోడ్, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్ ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. రోడ్డు,ట్రాఫిక్ నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వాహానాలు ఇచ్చి వారిని ప్రోత్సహించవద్దని తల్లిదండ్రులకు, వాహనాల యజమా నులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం అని నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వారిపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వాహనాదారులు ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని లైసెన్స్ లేనియెడల ప్రమాదాలు జరిగిన సందర్భంల్లో వర్తించే ప్రమాద భీమాలు వర్తించయని అన్నారు. ప్రతి వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవడం వలన దొంగ వాహానాలను గుర్తించవచని అన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం




### ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి జోనల్ మేనేజర్ కృష్ణవేణి

ప్రజాపక్షం / కాగజ్‌నగర్ రూరల్ : ప్రతీ ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని ఎన్ఎస్‌టిఎఫ్ డిసి జోనల్ మేనేజర్ కృష్ణవేణి సూచించారు.కాగజ్‌నగర్ మండలం మారుమూల గ్రామమైన రేగులగూడలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జి.జాన్ రాజా ఆధ్వర్యంలో ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి జోనల్ మేనేజర్ కృష్ణవేణి హాజరై మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కష్టపడి సంపాధించిన వాటికి విలువను, గుర్తింపును తీసుకువస్తుందన్నారు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గిరిజనులకు బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవల గురించి క్లుప్తంగా వివరించారు. ఖాతాదారులందరూ బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఫ్‌డిఎల్‌సి కౌన్సిలర్ ప్రేమ్‌రావు మాట్లాడుతూ డిజిటల్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటిఎం పిన్ నెంబరు ఎవరికి చెప్పకూదని తెలిపారు. పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం, సైబర్ నేరాలు, జాగ్రత్తలు, జనసురక్ష పథకాలైన పిఎంజెజెబివై,పిఎంఎస్‌బివై పథకాలపై ఖాతాఆదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.ఎస్‌హెచ్‌జి మహిళా సభ్యు లు ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి జోనల్ మేనేజర్ కృష్ణవేణిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం.బాలా జీ, ఎస్‌హెచ్‌జి సభ్యు లు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు,సిఎస్‌పి నిర్వాహకుడు హనుమంతు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సేవలతోనే శాశ్వత గుర్తింపు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధిః ఉద్యోగ నిర్వహణలో అందించిన సేవలు శాశ్వత గుర్తింపు ఇస్తాయని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. ఇద్దరు జిల్లా అధికారులు, నైట్ వాచ్ మన్ ఉద్యోగ విరమణ సందర్భంగా, వారిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శనివారం జిల్లా అధికారుల సంక్షేమ సంఘం దోరాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాం సుందర్, కలెక్టరేట్ నైట్ వాచ్ మన్ నారాయణను అదనపు కలెక్టర్ సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఆ సమయంలో ఉద్యోగులు అందించే సేవలు మంచి గుర్తింపు ఇస్తాయన్నారు. విరమణ పొందుతున్న వారు జిల్లా అభివృద్ధిలో ఎంతో కృషి చేశారని కొనియాడారు కార్యక్రమంలో దోరాస్ జిల్లా జనరల్ సెక్రటరీ వినోద్ కుమార్, ఆయా జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకంలో విస్తృత అవకాశాలు

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : చేపల పెంపకం ద్వారా మంచి లాభాలను పొందవచ్చునని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించిన మత్సకారుల అవగాహన కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు ఉపయోగించుకుని చేపల పెంపకం చేపట్టడం ద్వారా గొప్ప లాభాలను పొందవచ్చునని తెలిపారు. చేపల సాగుకు 2ఎకరాల స్థలం, బోర్ సదుపాయం ఉండాలన్నారు. ప్రస్తుతం వస్తున్న నూతన టెక్నాలజీ ద్వారా ఇంటి మిద్దెలపై, వ్యవసాయ క్షేత్రాల్లోనూ ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటు చేసి కూడా సాగు చేయవచ్చునన్నారు. చేపల పెంపకానికి 5లక్షల పెట్టుబడి, 4గుంటల స్థలం, సంవత్సరానికి 3 పంటలు, 2 లక్షల ఆదాయం, ఒక రైతుకి లబ్ధి చేకూరుతుందని అన్నారు. దీనినే 5, 4, 3, 2, 1 గా సూత్రీకరించి తెలుపుతారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళాలు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఎన్నో రాయితీలు, సబ్సిడీలు కల్పిస్తుందని తెలిపారు. ఇంటి మిద్దెలపై చేపల సాగు చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చునన్నారు. చేపల పెంపకంలో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. మార్కెటింగ్ కూడా సులభంగా చేసుకోవచ్చునన్నారు. అలాగే చేపల పెంపకానికి ఉపయోగించిన నీరు మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని, యూరియా తక్కువ మోతాదులో అందిస్తే సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అడిషనల్ డిఆర్‌డిఒ రామకృష్ణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, ఇంఛార్జి జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు త్రివేణి, కన్సల్టెంట్ ఉదయ్ కిషోర్, మత్స్యకార్మికులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

## బొగ్గు నిక్షేపాలను సింగరేణికే కేటాయించాలి




### విప్లవ కార్మిక సంఘాలు

ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ : తెలంగాణ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థకే కేటాయించాలని విప్లవ కార్మిక సంఘాలతో కలిసి హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ హైమద్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఐక్య విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ప్రసంగించారు. బొగ్గు బ్లాక్ లకు వ్యతిరేకంగా సంస్థను, కార్మికులను కాపాడుకోవడానికి ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని అన్నారు. బిజెపి ప్రభుత్వం గుజరాత్‌లో ఉన్నటువంటి మినరల్స్ ను ఎవరికి ఇవ్వకుండా మొత్తంగా అక్కడి ప్రభుత్వం గుజరాత్ మినరల్స్ కార్పొరేషన్ కు అప్పజెప్పినట్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని బొగ్గునిక్షేపాలను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా సోమాజిగూడ లో జూలై 3వ తేదీన మేధావులతో ఏర్పాటు చేస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, కామ్రేడ్ ప్రదీప్, సాతినేని వెంకటేష్, విమలక్క, బోస్, హైకోర్టు సీనియర్ న్యాయ వాది చిక్కుడు ప్రభాకర్ లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ హైమద్, టిజిఎల్‌బికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, టిఎస్‌యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరటి రాజన్న, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి రాములు, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు మణిరామ్ సింగ్, జిఎల్‌బికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల రాములు, రాష్ట్ర నాయకులు జీవన్ జోయల్, ఎస్ఎస్‌సిడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు డి బ్రహ్మానందం, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, టిజిఎల్‌బికెఎస్ రాష్ట్ర నాయకులు పోతుల కిష్టయ్య పాల్గొన్నారు.


**WARANGAL URBAN CO-OPERATIVE BANK LTD.,**
**WARANGAL**
**BALANCE SHEET AS ON 31ST MARCH 2024**
Form 'A' — Rs. In 000's

| | Schedule | As on 31.03.2024 | As on 31.03.2023 |
|---|---|---|---|
| **I. Capital & Liabilities** | | | |
| Capital | 1 | 46,593 | 47,431 |
| Reserves & Surplus | 2 | 1,85,507 | 1,57,334 |
| Deposits | 3 | 19,15,540 | 17,33,105 |
| Borrowings | 4 | - | - |
| Other Liabilities & Provisions | 5 | 36,721 | 45,686 |
| | Total | 21,84,362 | 19,83,556 |
| **II. Assets** | | | |
| Cash bank & Balance with RBI | 6 | 68,032 | 55,176 |
| Balance with Banks & Money at Call & Short notice | 7 | 2,75,472 | 2,62,432 |
| Investments | 8 | 4,11,720 | 4,23,202 |
| Advances | 9 | 13,61,672 | 11,75,444 |
| Fixed Assets | 10 | 15,676 | 18,201 |
| Other Assets | 11 | 51,790 | 49,101 |
| | Total | 21,84,362 | 19,83,556 |
| **Contigent Liabilities** | 12 | | |
| Bank Guarantees | | 3,433 | 6,363 |
| Bills for Collection DEAF A/c with RBI | | 831 | 831 |
| **Significant Accounting Policies** | 18 | | |
| **Notes to Accounts** | 19 | | |

The Schedules referred to above from an integral part of the accounts.

**PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31st MARCH 2024**
Form 'B' — Rs. In 000's

| | Schedule | As on 31.03.2024 | As on 31.03.2023 |
|---|---|---|---|
| **I Income** | | | |
| Interest earned | 13 | 2,08,592 | 1,91,645 |
| Other Income | 14 | 8,527 | 12,556 |
| | Total | 2,17,119 | 2,04,201 |
| **II Expenditure** | | | |
| Interest Expended | 15 | 1,25,293 | 1,11,316 |
| Operating Expenses | 16 | 55,514 | 56,251 |
| Provisions & contingencies & Write offs | 17 | 12,660 | 9,787 |
| | Total | 1,93,467 | 1,77,354 |
| **III. Profit/Loss** | | | |
| Net Profit/Loss (-) for theyear | | 23,652 | 26,847 |
| Profit/Loss (-) brought forward | | 26,847 | 23,942 |
| | Total | 50,499 | 50,789 |
| **IV. Appropriations** | | | |
| Transfer to statutory reserves | | 12,081 | 10,774 |
| Transfer to other reserves | | 14,766 | 13,168 |
| Transfer to Government/proposed dividend | | - | - |
| Balance carried over to balance sheet | | 23,652 | 26,847 |
| | Total | 50,499 | 50,789 |

Significant Accounting Policies and Notes to accounts,
The Schedules referred to above from an integral part of the accounts.

Sd/-
V Ravi & Co.,
(Statutory Auditor)

Sd/-
M. Satyanarayana Rao
(Chief Executive Officer)

## భ్రూణ హత్యలను నిరోధించండి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లాలో గర్భిణి, భ్రూణహత్యా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ అన్నారు.శనివారం గర్భిణీస్త్రీ అబార్షన్ మృతిపై జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తీసుకవచ్చినప్పటికి భ్రూణహత్యలను నిరోధించలేకపోతుందన్నారు.దానికి క్షేత్రస్థాయిలో అధికారులు అశ్రద్ధతో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణమన్నారు. లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై,చట్టవ్యతిరేకంగా అబార్షన్ చేసే డాక్టర్లపై వారికి మధ్యవర్తుల్లా వ్యవహరించే ఆర్ఎంపి,పిఎంపిలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గర్భిణీకి అబార్షన్ చేయించిన భర్తను,డాక్టర్‌ను సహకరించినసిబ్బందిపైచర్యలుతీసుకోవాలన్నారు.మహిళా సమాఖ్య నాయకురాళ్లు కుర్రి కోటమ్మ, గొర్రె అంజమ్మ,కుర్రి జ్యోతి, జెనిగ వెంకటమ్మ, వీరమ్మ, అరుణ, మస్తాన్‌బీ, షేక్ జాన్‌బీ, గుంటిగొర్ల సైదమ్మ, లింగమ్మ,శైలజ,రేణుక,అరుణా,వీరమ్మ,గంగమ్మ,లక్ష్మీ పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ ఎప్పుడిస్తారు?



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** విధ్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఏఐఎస్ఎఫ్ జిల్లాకోశాధికారి లద్దునూరి విష్ణు అన్నారు. శనివారం జమ్మికుంట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు చందు, సిద్ధు, జగదీష్ తదితరులున్నారు.

## 'ధరణి' పరిష్కారంపై దృష్టి

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందు కు చర్యలను తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సి.సి.ఎల్.ఎ) ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టరు రెవెన్యూ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,బైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు పాల్గొన్నారు.

# రోడ్ల అభివృద్ధికి రూ.655 కోట్లు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ. 655 కోట్లు నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు.గతంలో ఉన్న జాతీయ రహదారులకు ఇప్పుడు ఉన్న జాతీయ రహదారులకుముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరిన నేపథ్యంలోఉమ్మడిఖమ్మంజిల్లాలోఆరు రోడ్లకు రూ.655 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గతంలో తాను ఆర్ అండ్‌బిమంత్రిగాఉన్నప్పుడుఈరహదారుల గురించి ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ బైపాస్ రోడ్డు 25 కిలో మీటర్ల మేర రూ. 450 కోట్లు, ఎన్‌హెచ్ 365 ఎ, ఎన్‌హెచ్ 163 జి, మిస్సింగ్ లింక్ కలపడానికి ఆరు కిలో మీటర్ల మేర రూ. 125 కోట్లు, భద్రాచలం పట్టణంలో ఎన్‌హెచ్ 30 అభివృద్ధి కోసం ఏడు కిలో మీటర్ల మేర రూ. 50 కోట్లు, కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి రూ.2.64కోట్లు,కిన్నెరసానిపాత బ్రిడ్జి పక్కన నూతన బ్రిడ్జి కోసం రూ.20.22 కోట్లు, కోదాడ జంక్షన్ నుంచి వరంగల్ క్రాస్ రోడ్డుకు రూ. 7 కోట్లు మొత్తం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.654.86 కోట్ల పనుల కోసం ఆమో ద ముద్ర పడిందన్నారు. రానున్న మూడునెలల్లో డిపిఆర్ తయారు చేసి పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. రెండవ జాతీయ రహదారికి శాంక్షన్ వచ్చిందని రూ. 125 కోట్లతో ఏడుకిలో మీటర్లతో ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు మాదిరిగా ఏర్పడుతుందన్నారు. నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు పంచాలి



**ప్రజాపక్షం/ఆలేరు :** గ్రామాలలో ప్రభు త్వ భూములు ఉం టే పేదలకు పంచాలని భూమిలేని పేదలు గ్రామాలలో ఉంటే ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి పేదలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని, ఇంటి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, మండల నాయకులు శ్రీనివాసరాజు, మాటూరు జానమ్మ, స్వామి, ఆంజనేయులు, ప్రవీణ్,మంజుల,లక్ష్మి , అంజనేయులు, భాగ్యమ్మ, పూలమ్మ, నాగమణి, కిష్టయ్య, ఉమా, నర్సమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్‌లో స్థానికులకే ఉద్యోగాలు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని రంగాపురం గ్రామంలో గల అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పి ంచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ఎయిమ్స్ ఆసుపత్రి భవనాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె జండాగేతో కలిసి సందర్శించి ఆసుపత్రిలో జరుగుతున్న వైద్య సేవలు, జనరల్ మెడిసిన్, చిన్న పిల్లల వైద్య సేవలు, గర్భిణీ స్త్రీల శస్త్ర చికిత్సలపై వారు వివిధ బ్లాకులను సందర్శించి పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ వికాస్ భాటియాతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీలు మాట్లాడుతూ ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు ఎప్పటి వరకు అందుబాటులోనికి వస్తాయని, అదేవిధంగా నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారితో నూతనంగా నిర్మించే యూనివర్సిటీ భవనాలను పీజీ మెడికల్ హాస్టల్ నర్సింగ్ హాస్టల్ భవనాలను గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు స్థానిక నాయకులు ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకురాగా వారు డైరెక్టర్‌తో మాట్లాడుతూ అర్హత గల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎలాంటి అవినీతి జరగకుండా పారదర్శకంగా నియమాకాలు చేపట్టాలని డైరెక్టర్‌ను కోరారు. ఎయిమ్స్ భవనాలు పూర్తి అయినట్లయితే ఈ ప్రాంత ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గోలి ప్రణీత పింగళి రెడ్డి, కాంగ్రెస్ సింగల్‌విండో చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు పొట్టోల్ల శ్యాంగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, ఎంపిటిసిలు గోలి నరేందర్ రెడ్డి, టం టం భార్గవ్, మాజి సర్పంచ్‌లు గడ్డం బాల్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ, ఎయిమ్స్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా సావరాలపై దాడులు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ నుండి అధికారులు సిబ్బం ది కలసి గుడుంబా స్టావారాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 33 కేసులు నమోదు చేయడం జరిగింది. అలాగే 328 లీటర్ల నాటు సారా స్వాధీ నం చేసుకొని, నల్ల బెల్లం 210 కేజీలు, 8870 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో అధికారులు, సిబ్బంది కలిపి 174మంది పోలీసులు పాల్గొన్నారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ప్రజలు ఎదురు చూపు!

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రకటించడంతో అర్హులలో ఆశలు చిగురించాయి. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో నూతన రేషన్ కార్డుల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుందనే ఆశతో ఉన్నారు. గత ప్రభుత్వం కార్డుల ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగింది. ఆధార్ అనుసంధానం, పేర్లలో తప్పుల సవరణలు తదితర కారణాలతో సవరించుకున్న వారి రేషన్ కార్డులు జాబితాలో లేకుండా పోయాయి. దానికి సంబంధించిన వివరాలు స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లోనూ అందుబాటులో లేకపోవడం, వివిధ పథకాలకు అర్హులైన వారు చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అందని ద్రాక్షగా ప్రభుత్వ పథకాలు, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాష్ట్రంలో మార్చి నుంచే అందుతున్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్న వారికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి జీరో బిల్లులు అలాగే వంట గ్యాస్ బుక్ చేసుకుని మొత్తం రుసుము చెల్లించిన తర్వాతే మిగతా సొమ్మును నగదు బదిలీ పథకం కింద వినియోగదారుల ఖాతాలో జమచేస్తున్నారు. ఇంత వరకు భాగానే ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తేవడంతో చాలా మందికి అర్హత ఉన్నా, కేవలం రేషన్ కార్డులు లేని కారణంగా లబ్ది పొందలేకపోతున్నారు. ఇంటింటి సర్వే చేపట్టినట్లు చెప్పిన అధికారులు, ఎంతమందిని లబ్దిదారులుగా గుర్తించారు, ఎంత మందిని తిరస్కరించారు. ఏకారణాలచేత తిరస్కరించారనేది మాత్రం ఇప్పటి వరకు చెప్పడం లేదు. ఒకే కుటుంబానికి చెందిన వారు వివాహం తర్వాత విడిగా ఉంటున్నారు. ఇలాంటి కుటుంబాలలో పేరును తొలగించినా, కొత్త రేషన్ కార్డులు మాత్రం జారీ కాలేదు. ఇలాంటి వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా చనిపోతే వారి పేరును నెల రోజుల్లో తొలగిస్తున్నారు. అదే క్రమంలో పుట్టిన వారి పేర్లు నమోదుకు మాత్రం అవకాశం లేదు.

కొత్త రేషన్ కార్డులు చేపట్టాలి లేదా ఆధార్ కార్డు ద్వారా సబ్సిడీని అందించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దానికి అనుసంధానంగా రేషన్ కార్డులు ఉండడంతో సబ్సిడీ పథకాలకు ఎన్నో కుటుంబాలు దూరమవుతున్నాయి. ప్రభుత్వం రేషన్ కార్డులు ప్రక్రియ మొదలైన పెట్టాలని లేదంటే ఆధార్ కార్డు ద్వారా సబ్సిడీని అందించాలి. తొందరగా రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టాలని అర్హులు ఎదురుచూస్తున్నారు.

## ఐక్యతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ 'హేమంత్ సోరెన్‌కు బెయిల్ రావడాన్ని స్వాగతిస్తున్నాం. ఆయన జైలు నుంచి బయటకు వచ్చేశారు. రాష్ట్రంలోని లౌకిక పార్టీలు మరింత దగ్గరయ్యేందుకు ఆయన దోహదమవుతారు. మతోన్మాద ఫాసిస్టు శక్తులపై పోరుకు ఇండియా ఐక్య సంఘటన ఛత్రం కిందకు అన్ని ప్రజాస్వామిక లౌకిక పార్టీలను తెచ్చే ప్రయత్నాన్ని సాగిస్తున్నాం. పార్లమెంటు లోపల కూడా సయోధ్యకు యత్నిస్తున్నాం' అని చెప్పారు. అదే సమయంలో నీట్‌యూజీ పరీక్ష రద్దునకు రాజా డిమాండ్ చేశారు. దేశంలో ఉద్యోగులు, రైతులు, గిరిజనుల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ఆర్థిక వ్యవస్థ స్థితి కూడా అంతంత మాత్రమేనని అన్నారు. ఇందుకు మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన, వినాశకార విధానాలే కారణమని రాజా దుయ్యబట్టారు. అఖిలభారత కిసాన్ మహాసభ అధ్వర్యంలో జార్ఖండ్‌లో జరగబోయే కార్యక్రమంలో పాల్గొనేందుకుగాను రాజా రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటిస్తారు.

## ఎస్పీనగర్‌లో కార్పొరేటర్ సునీత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** సమస్యలను అధ్యయనం చేసేందుకు గాను మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత శనివారం డివిజన్‌లోని ఎస్పీనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర అందర్నీ ఆకట్టుకుంది. ఆమె వెంట జిహెచ్ఎంసి ఏఈ మధురిమ, వర్క్ ఇనస్పెక్టర్ మహేంద్ర, వాటర్ వర్క్స్ అండ్ సివరేజి సూపర్‌వైజర్ శివ, సంజీవ్, బిజిపి మౌలాలి అధ్యక్షుడు పెద్ది సాయిబాబు, లింగారావు, శివగౌడ్, ఫణీంద్రరావు, రాము, స్థానిక ప్రతినిధులు కిష్టయ్య, ప్రసాద్ రాజు, సులోచన, శ్రీవాణి, రమాదేవి, చంద్రశేఖర్, కుమార్, శ్రీనివాస్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు. పలు ప్రాంతాల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. అదే విధంగా రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని కూడా కార్పొరేటర్‌ను కోరారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
మహబూబ్‌నగర్ | ఆదివారం | 30 జూన్, 2024 | 9

## ప్రతి పాఠశాలకు మంచి నీటి వసతి

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని ప్రతి పాఠశాలకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని ఎంపిపి కొప్పు సుకన్యభాష అన్నారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మంచి నీరు లేక పోవడంతో మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలకు కనెక్షన్ ఇచ్చి విద్యార్థుల దాహాన్ని తీర్చాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారులపై ఉందని అన్నారు. ఈ విషయాన్ని అధికారులు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువుతున్నారు. వారందరికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పని చేయాలని అన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/కేశంపేట:** వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ సరి చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మధ్యాహ్నం మండల పరిధిలోని బొధునంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన క్యామ శివ (24) అనే యువకుడు వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రెండు రోజుల నుండి పని చేయడం లేదని, ఈ విషయాన్ని స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. చౌలపల్లి ఫీడర్ పరిధిలో చెట్లు కొడుతున్నామని, సాయంత్రం వరకు కరంటు రాదని చెప్పడంతో బాధితుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్ రావడంతో ప్రమాదం జరిగిందని రైతులు వివరించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే బాధితుడు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కేశంపేట ట్రాన్స్‌కో ఏఇ ఈశ్వర్‌ను వివరణ కోరగా తాము చౌలపల్లి ఫీడర్‌కు ఎల్‌సి ఇవ్వలేదని వివరణ ఇచ్చారు.

## వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం : అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వినియోగదారుల ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి, సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'డయల్ యువర్ ఎం.డి' కార్యక్రమంలో ఆయనవినియోగదారులతో మాట్లాడారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఒకే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలన్నారు. అలా చేస్తే వాటి కేటగిరీని బట్టి విశ్లేషించి చాలా వరకు సులభంగా పరిష్కారం చూపవచ్చన్నారు. సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు జరిగిన డయల్ యువర్ ఎండి కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 13 మంది వినియోగదారులు ఫోన్ చేశారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, నల్లా కనెక్షన్‌లలో లోప్రెజర్ తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. వాటిని నమోదు చేసుకున్న ఎం.డి అశోక్ రెడ్డి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు వినియోగదారులతో సంబంధిత జనరల్ మేనేజర్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈడి డాక్టర్ ఎం. సత్యనారాయణ, ఆపరేషన్స్ డైరెక్టర్1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్2 స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.40 లక్షలివ్వండి : ఎఐటియుసి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సౌత్ గ్లాస్ పరిశ్రమలో మరణించిన కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం రూ.40లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కృషి చేయాలని ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కె.రామస్వామి మాట్లాడుతూ సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఆటో క్లేవ్ హై ప్రెజర్‌తో పేలిపోవడంతోనే ఐదు మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందడం ఎంతో బాదకరమని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.40లక్షలు ఇవ్వడంతోపాటు తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.10లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంతో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దత్తునాయక్, ఏఐటియుసి జిల్లా నాయకులు శ్రీనునాయక్, జిల్లా కార్యదర్శులు వి.జైపాల్‌రెడ్డి, వడ్ల సత్యనారాయణ, చందు యాదవ్, నేతలు దేవేంద్ర గౌడ్, శివయ్యలు ఉన్నారు.

## నాగార్జున స్కూల్‌లో ఫ్రెషర్స్ డే




**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వనస్థలిపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌పురం కాలనీలో ఉన్న నాగార్జున మాంటిస్సోరి ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం నాగార్జున స్కూల్‌లో ఫ్రెషర్స్ డే సంబురాలునిర్వహించారు. పాఠశాల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడారు. నూతనంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు, గత విద్యార్థులకు పరిచయ వేదికలాగనే ఫ్రెషర్స్‌డే నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ఆ రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 50 మంది విద్యార్థులు 10కి 10 పాయింట్లు సాధించారని వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యా బోధనతో పాటు ఇతర అంశాలకు కూడా తగినంత ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. విశాలమైన అవుట్ డోర్, ఇండోర్ ఆట స్థలాలు, ఆధునికమైన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆడియో విజువల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, సీఏఓ శేషరావు, వైస్ ప్రిన్సిపల్ ఏ. లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## వనస్థలిపురంను ఆదర్శ డివిజన్‌గా చేస్తా



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వనస్థలిపురం డివిజన్‌లో ఇప్పటికే అన్ని కాలనీలో అనేక సమస్యలు పరిష్కారం చేసుకుంటువచ్చామని ఆయన పేర్కొన్నారు. నాగార్జున కాలనీ నుంచి అనురాధ కాలనీ వరకు వరద నీరు పైప్‌లైన్ 6ఫీట్లతో మంజూరు చేసి పనులు పర్తి చేయడం జరిగిందన్నారు. ఆఫ్ ఇంచ్ డయా పైప్‌తో వరద నీరు ముంపులేకుండా చేయడం జరిగిందని, పైప్‌లైన్ ద్వారా నాగార్జున కాలనీ, శ్రీరమణ కాలనీ, ఈస్ట్ హస్తినాపురం, క్రిస్టయల్ కాలనీ, అనురాధ కాలనీలో సీసీ రోడ్డు డ్యామేజ్ కావడంతో మరమత్తులకు 1.35 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని, వాటిని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

## శిల్పారామంలో అలరించిన నృత్యాలు

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం ఒడిసి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు అలరించాయి. బెంగళూరు నండి విచ్చేసిన భరతనాట్య గురువర్యులు ప్రతిభ రామస్వామి శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనలో ఆనంద నర్తన గణపతిమ్, త్రిమూర్తి అంజలి, నటనవాడినల్, దేవీ స్తుతి, మహాదేవ కాంచీపురాధీశ్వర, సప్తస్వర, వర్ణం మొదలైన అంశాలను అవంతిక, ధన్య, పూజ, సంజన, శ్రావ్య ప్రదర్శించారు. కలకాత్త నుడి విచ్చేసిన ఒడిసి నృత్య కళాకారిణి ఆత్రేయా దత్త ఒడిసి నృత్య ప్రదర్శనలో మంగళాచరణ్, మధురాష్టకం,మోక్ష అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

# 10రోజుల్లోగా పరిష్కారం

### ధరణి దరఖాస్తులపై సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధరణిలో మ్యాడ్యూల్స్ సవరించిన నేపథ్యంలో పెండింగ్‌లో వున్న దరఖాస్తులు పరిష్కరించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో నవీన్ మిట్టల్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టర్‌లబదిలీ నేపథ్యంలో జిల్లాల వారిగా ధరణి సమస్యలపై మరోసారి కలెక్టర్లతో నవీన్ మిట్టల్ చర్చించారు. న్యా యపరమైన సమస్యలు మినహా మిగితా అన్ని ఫైళ్లను క్లియర్ చేయాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను రానున్న 10రోజులలో పరిష్కరించాలన్నారు. ఈనెల 15 నుంచి 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. జిల్లా కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో కొంత నెమ్మదించిన ప్రక్రియనువేగవంతం చేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు 10 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని సూచించారు.ఆర్ఎస్ఆర్‌లిమిట్, మిస్సింగ్ సర్వే నెంబర్లు, సక్సెషన్, మ్యూటేషన్ తదితర సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థుల కోసంగురుకుల విద్య సంస్థ ఏర్పాటుకు 20ఎకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు.

## చాదర్‌ఘాట్‌లో మరో రౌడీషీటర్ హత్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీలో ఏడు రోజుల వ్యవధిలో జరిగిన వేరు వేరు సంఘటనలో ముగ్గురు హత్యకు గురయ్యారు. తాజాగా శనివారం తెల్లవారుజామున ఛాదర్‌ఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలో మరో రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఛాదర్‌ఘాట్ పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఘటన జరగడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నాయి. రెయిన్‌బజార్‌కు చెం దిన సయ్యద్ నజఫ్ అలీ పాతబస్తీలోని మీర్ చౌక్,రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్స్‌లో రౌడీ షీటర్. నజఫ్ అలీపై మూడు హత్య కేసులు నమోదయి ఉన్నాయి. 2021 నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడలేదు. నజఫ్ అలీపై గుర్తు తెలియని వ్యక్తులు చదార్‌ఘాట్‌లోని మలక్ పేట మెట్రో స్టేషన్ వద్ద కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఇది ప్రతీకార హత్యగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

## రెండు ఎస్‌టిపిల ట్రయల్ రన్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫతేనగర్, ఖాజాకుంట ఎస్‌టిపిలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎం.డి. అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్‌టిపి ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ3 లో నిర్మిస్తున్న ఫతేనగర్, ఖాజాకుంట ఎస్‌టిపిలను శనివారం సందర్శించారు. ముందుగా ఫతేనగర్ ఎస్‌టిపి వెళ్లిన ఆయన, అక్కడ వెట్ వెల్, ఎస్‌బిఆర్, బ్లోయర్ రూమ్ పరిశీలించారు. అనంతరం వెట్ వెల్ దగ్గర ఇన్ లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఖాజాకుంట ఎస్‌టిపికి వెళ్లారు.సిసి రోడ్లు, లైటింగ్ పనులను పరిశీలించారు. పనులను పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం వెట్ వెల్ దగ్గర ఇన్ లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఖాజాకుంట ఎస్‌టిపిని ఆనుకుని ఉన్న మిగిలిన ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు.

## ఉద్యోగి సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విధి నిర్వహణలో ఉన్న సమయంలో ప్రజలకు అంధించిన మెరుగైన సేవలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు ఎంపిడిఓ ఆంజనేయులు పదవీ విరమణ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అంజయ్య యాదవ్‌తోపాటు ఎమ్మెల్సీ సన్మానించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగికి పదవీ విరమణ అనేది సర్వసాదారణం కానీ వారు చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలిచేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. జడ్పివైస్ చైర్మెన్ ఈట గణేష్, జడ్పిటిసి సభ్యుడు రామకృష్ణ, వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిలు ఉన్నారు.

# కాంగ్రెస్ వల్లే అభివృద్ధి

### షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్

### రూ.1.5కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠ వేయడం జరుగుతుందని శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, మాల్ ఎలికట్ట, పర్వతాపూర్, చింతగూడెం గ్రామాల్లో ఎంఎల్‌ఎ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పర్వతాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.30లక్షలు, ఎలికట్ట గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించనున్న గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనానికి, రూ.5లక్షలతో నిర్మించనున్న పైపులైన్ నిర్మాణ పనులకు, రూ.5లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటి హాల్ నిర్మాణానికి ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు. రూ.5లక్షలతో నిర్మించనున్న బిసి కమ్యూనిటి హాల్ బ్యాలెన్‌కు, రూ.8లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు, ఎంపిటిసి నిధులు రూ.2లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఒక్క పర్వతాపూర్ గ్రామంలోనే రూ.30లక్షలతో నిర్మించే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతగూడ గ్రామ ంలో రూ.40లక్షలతో నిర్మించే కల్వర్టుకు, మూడు గ్రామాల్లో రూ.1.5కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఎంపిడిఓ అంజనేయులు పదవీ విరమణ పొందిన సందర్భంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఫరూక్‌నగర్ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, ఎంపిపి ఇద్రీస్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, లింగారెడ్డి గూడ అశోక్, సింగిల్ విండో చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, సీనియర్ నేత సయ్యద్ సాధిక్, మంగులాల్ నాయక్, మాజీ సర్పంచులు, నేతలు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 38 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలోజిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం వారికి పదవీవిరమణ వీడ్కోలు సభను నిర్వహించి సన్మానించారు. జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ (పరిపాలన) నళిని పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమని, ఉద్యోగ విరమణ తర్వాత కూడా మరో కొత్త జీవితం ఉంటుందని, దానిని సరికొత్తగా మలుచుకోవడం మన చేతిలోనే ఉంటుందని అన్నారు. జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు అదనపు కమిషనర్ నళిని పద్మావతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజరాణి, జాయింట్ కమిషనర్ (పరిపాలన) జయంత్‌రావు, ముఖ్య ప్రజాసంబంధాల అధికారి మహమ్మద్ ముర్తుజా ఆలీ, పర్సనల్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి సన్మానించారు.

## రంగారెడ్డిలో జాతీయ గణాంక దినోత్సవం




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రొ ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవమును పురస్కరించుకొని 2007 నుండి ప్రతి సంవత్సరము జాతీయ గణాంక దినోత్సవము జరుపుకోవడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు.శనివారం18 వ జాతీయ గణాంక దినోత్సవమును సందర్భంగా నిర్వహించినకార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె. శశాంక జ్యోతి ప్రజ్వళన చేశారు. రంగారెడ్డి జిల్లా గణాంక దర్శిణి2022/23" పుస్తకమునుఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ గణాంక దినోత్సవ విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించి,జిల్లా అధికారులకు పుస్తకము ఉపయోగము గురించి వివరించారు.జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.సౌమ్య,అద్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అర్థగణాంక శాఖ తరుపున ముఖ్యఅతిధి డాక్టర్ వై.ఆర్.బి.శర్మ, జాయింట్ డైరెక్టర్ (రిటైర్డ్),జిల్లా మత్స్య శాఖ అధికారి సుకీర్తి,జిల్లాపంచాయతీఅధికారి సురేష్ మోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇప్పటికే ధరణిలో 3,779 దరఖాస్తులు పరిష్కరించాం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పెండింగ్ లో ఉన్న ధరణి ఫైళ్లను త్వరత గతిన పూర్తి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శనివారం సిసిఎల్ఏ కార్యాలయం నుంచి పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారం పై రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్,జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ రెండు వారాలలో ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన 3779 దరఖాస్తులను పరిష్కరించామని, మిగిలిన దరఖాస్తులను తొందరగా పరిష్కారించాలని సంబంధిత ఆర్.డి ఒ లు, తహసీల్దార్లకు సూచించినట్లు చెప్పారు. చేవెళ్ల,మొయినాబాద్,యాచారం, కందుకూరు, మంచాల,మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు.సంబంధిత మండలాల అధికారులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి,ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లో లేకుండా అన్నింటినీ పరిష్కరిస్తామని వివరించారు. అపరిృతంగా ఉన్న ధరణి దరఖాస్తులను, ఆర్.డిఒ,తహసీల్దార్ లాగిన్ లలోని పెండింగ్ దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ క్లియర్ చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)భూపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్ డిఒ అనంత రెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

**ప్రజాపక్షం/షాబాద్:** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని షాబాద్ సిఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. షాబాద్ పోలీస్‌స్టేషన్ అవరణలో వివిధ గ్రామాల ప్రైయివేట్ పాఠశాలల నిర్వహకులు, బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సులలో కెపాసిటికి మించి విద్యార్థులను ఎక్కించుకోవద్దన్నారు. పాఠశాలల ముందు తప్పని సరిగా సూచిక బోర్డులు ఉంచాలన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వర్షాకాలం పరిస్థితుల్లో జిహెచ్‌ఎంసి అధికారులు అప్రమత్తంగా ఉండాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం హయత్ నగర్ సర్కిల్3లో జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో హయత్ నగర్ సర్కిల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో పాటు కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం రావడంతో కొన్ని కాలనీల్లో వర్షాపు నీరు కాలనీ రోడ్లపై ప్రవహిస్తుందని, అధికారులకు తెలియాచేసిన స్పదిస్తాలేరని ఆయన ఆరోపించారు. శానిటేషన్ అధికారులు కాలనీల్లో పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వర్షాల వల్ల డ్రైనేజీలు పొంగిపోర్లుతున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు వాటిని పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. శివారు కాలనీల్లో రోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. వర్షం వస్తే శివారు కాలనీ చేరువులకు తలపిస్తున్నాయన్నారు. అనేక కాలనీలకు మౌళిక వసతులు కల్పించాలని డిప్యూటీ కమిషనర్‌కు కోరారు. హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్‌లో అనేక కాలనీలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, సీసీ రోడ్డు, విద్యుత్ స్తంబాలు, వీధీ దీపాలు కల్పించాలని అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు ఈఈ సురేష్ బాబు, డీఈ దామోదర్ రావు, ఏసిపి పావని, టిపిఎస్ మాన్సూర్, డీఈ లావణ్య, జిహెచ్‌ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ కల్పించడంలో యాజమాన్యం విఫలం

### ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంఎల్‌ఎ, ఎమ్మెల్సీ, ప్రజా సంఘాలు

### మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కార్మికుల జీవితాలు పరిశ్రమల్లో బుగ్గిపాలు అవుతుంటే యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో సౌత్ గ్లాస్ పరిశ్రమను ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్‌తోపాటు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ, సిపిఎం నాయకులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను తోటి కార్మికులకు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ యాజమాన్యం ప్రమాదం జరిగిన వెంటనే పరిపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రమాదంలో గాయపడిన కార్మిలకు కనీస వైద్య సేవలు అంధించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీహార్, ఉత్తర ప్రదేశ్, ఒరిస్సా, కలకత్తా వంటి అనేక రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకువచ్చి వెట్టి చాకిరి చేయించుకొని మౌళిక సౌకర్యాలు కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పరిశ్రమ నిర్వాహణలో లోపాలు కొట్టోచ్చినట్లు కనిపిస్తున్నాయని, ఇందుకు యాజమాన్యం బాధ్యత వహించాల్సిందేనని హెచ్చరించారు. కార్మికుల శ్రేయస్సును పరిశ్రమ యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. గతంలోనే పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూర్తి సమాచారం ఇచ్చాయని, మరణించిన కార్మికులతోపాటు వైద్య సేవలు పొందుతున్న కార్మికులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### శైలేష్ అగర్వాల్‌పై హత్య కేసు నమోదు చేయాలి

ఐదు మంది కార్మికుల ప్రాణాలకు కారణమైన సౌత్ గ్లాస్ పరిశ్రమ యాజమాని శైలేష్ అగర్వాల్‌పై హత్య నేరం కేసు నమోదు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సి నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. పొట్ట చేత పట్టుకొని ఇతర రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం వస్తే వారి ప్రాణాలను తీయడం ఏమిటని ప్రశ్నించారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాల్సిన యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని అన్నారు. అదే విధంగా పరిశ్రమల శాఖ సంబంధిత అధికారిని ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో వందల పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో సుమారు 50వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారని, వారిలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారేనని పేర్కొన్నారు. క్షతగాత్రలకు మెరుగైన వైద్యసేవలు అంధించడంతోపాటు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటుంటే అధికారులకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని, అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని వివరించారు. కార్మికులకు న్యాయం జరగకపోతే న్యాయ పోరాటం చేస్తానని హెచ్చరించారు.అదేవిధంగా ప్రజా సంఘాలు, సిపిఐ, సిపిఎం, సిఐటియు నాయకులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి యాజమాన్యం నిర్లక్ష్యం ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపిపి మౌనిక హరికృష్ణ గౌడ్, చక్కటి ప్రభాకర్, ఎంపిటిసి సభ్యురాలు మాధవి రవీందర్, నేతలు యాదయ్య, సంతోష్, అంజయ్య, రమేష్, మాసయ్యగౌడ్, గుట్టరాజు, మధు, సుదీర్ ఉన్నారు.



## నకిలీ విత్తనాలతో మోసపోవద్దు

### జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దశీర్

**ప్రజాపక్షం/జడ్చర్లః** రైతులు నకిలీ విత్తనాలు కొని అన్ని రకాలుగా మోసపోతున్నారని దయచేసి రైతులు ఎవ్వరూ నకిలీ విత్తనాలు కొనరాదని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దశీర్ అన్నారు. శనివారం జడ్చర్ల మండలంలోని అల్లవానపల్లి గ్రామంలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి ముద్దశీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రకాలుగా మోసాలకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఏ సమస్యలు ఉన్న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందాలని ఆయన అన్నారు. అలాగే రైతులు చట్టాల పట్ల పూర్తిగా అవగాహన లేకుండా ఎన్నో ఇబ్బందులకు లోను అవుతున్నారని దయచేసి రైతులు రైతు చట్టాలపై అవగాహన పెంచుకుని ఎక్కడ ఏ అన్యాయం జరిగిన తక్షణం న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. అంతకు ముందు గ్రామ రైతులను ఉద్దేశించి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.జంగయ్య మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలను సరైన ధరలకు విక్రయించుకుని లాభపడాలని, అలాగే సరైన ధరలు రాకపోతే ప్రభుత్వ గిద్దంగులతో తమ ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు అని అన్నారు. జడ్చర్ల సిఐ ఆదిరెడ్డి, సీనియర్ న్యాయవాది మాలిక్ షాకిర్, న్యాయవాదులు ఆర్.శ్రీనివాస్ గౌడ్, రాములు, లక్ష్మి నారాయణ, ప్రశాంత్, గ్రామ రైతులు, జడ్చర్ల కోర్టు సిబ్బంది దేవా లింగం, యన్‌జిఓఎస్ అధ్యక్షులు గోవర్ధిని , విశ్వేశ్వర్, అశోక్ పాల్గొన్నారు.



## ప్రైవేట్ ఆసుపత్రులు తనిఖీ

### మూడు ఆసుపత్రులకు నోటీసులు జారీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కృష్ణ నేతృత్వంలో శనివారం జిల్లాలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో రిజిస్ట్రేషన్ ఉన్నవి లేనిది, హస్పిటల్స్ వారి సేవల ధరల పట్టికను తెలుగులో ఇంగ్లీషులో ఉంచారా లేదా, అగ్నిమాపక పరికరాలకు సంబంధించిన చర్యలు తీసుకున్నారా లేదా పరిశీలించారు. పట్టిక లేని మూడు హస్పిటల్స్‌కి నోటీసులు ఇవ్వడం జరిగింది. జిల్లాలో 416 మంది ఈ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు కింద రిజిస్ట్రేషన్ చేసుకుని క్లినిక్స్, హస్పిటల్స్ , ల్యాబ్స్, డెంటల్, ఫిజియోథెరపీ, స్కానింగ్ సెంటర్‌లను నడుపుచున్నారని ఈ సెంటర్లలో సేవలు పొందే వ్యక్తులకు వాటి ధరల పట్టికలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. గత రెండు నెలలుగా నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటివరకు 40 మందికి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఇందులో ప్రధానంగా 60 శాతం పైగా సిజేరియన్ సెక్షన్ ద్వారా కాన్పులు చేసిన వారికి, ధరల పట్టికలు లేని వారికి , ఎలాంటి శిక్షణ లేనివారు హస్పిటల్స్ పనిచేస్తున్నందుకు ఆర్ఎంపీలు బోర్డు పై డాక్టర్ అని రాసుకున్నందుకు, పడకలు ఉన్నందుకు నోటీసులు ఇవ్వడం జరిగింది. ఐదు మంది ఆర్ఎంపీల క్లినిక్స్ మూసి వేయడం కూడా జరిగింది. ఈ తనిఖీలలో డాక్టర్ భాస్కర్ నాయక్, ప్రోగ్రాం అధికారి, డా.తిరుపతిరావు, డెమో, సుభాష్, చక్రపాణి తదిరులు పాల్గొన్నారు.



## నేరెళ్లపల్లి గ్రామంలో ఆధార్ తప్పల సవరణకు అవకాశం

**ప్రజాపక్షం / బాలానగర్ :** తమ ఆధార్ కార్డులో నమోదు కాబడిన తప్పుప్పులను సవరించుకునేందుకు గ్రామంలో స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారని ఈ, అవకాశాన్ని గ్రామస్తులు పద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కే. సుధాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఈ మేరకు బాలానగర్ మండల పరిధిలోని నేరళ్లపల్లి గ్రామంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామస్తులకు తెలిపారు. ఆధార్ కార్డు లో తప్పొప్పుల సవరణ కోసం జడ్చర్ల బాలానగర్ షాద్‌నగర్ లాంటి ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామస్తుల వద్దకే ఆధార్ కేంద్రం రావడం సంతోషరకమని తెలిపారు. కార్యక్రమంలో పలుపురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు వసూలు

**ప్రజాపక్షం / కొత్తకోట :** ప్రైవేట్ స్కూళ్లలో దండిగా ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ పేర్కొన్నారు. కొత్తకోట పట్టణంలలోని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డు అదుపు లేకుండా తమ ఇష్టాసారంగా విద్యార్థుల తల్లిదండ్రులతో దండిగా ఫీజులు వసూలు చేస్తున్నారని వీటిపై విద్యాశాఖ అధికారులు పట్టి పట్టన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం వెబెక్స్ ద్వారా ఎం.పి.డి.ఓ.లు, మండల స్పెషల్ అధికారులు, ఎం.ఆర్.ఓ.లు,ఎం.పి.ఓ.లు, ఇంజనీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనులు మండలంల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం వారీగా నిర్దేశించిన సమయం లోగా మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత లో రాజీ పడవద్దని ఆమె స్పష్టం చేశారు. పనులు నాణ్యాత పరిశీలించి సంతృప్తికరంగా ఉంటేనే నిధులు చెల్లించాలని అన్నారు. పనులు పూర్తి చేసిన తర్వాత ఇంజనీరిగ్ శాఖల అధికారులు ఎం.బి. రికార్డు చేసి తదనుగుణంగా చెల్లింపులు చేయాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ అర్బన్ లో పెండింగ్ లో ఉన్న పనులు మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ ఈ.ఈ. సమన్వయం చేసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా రూపొందించాలని మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలనకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్‌పిడి జానకి, ఎక్సైజ్ , వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ అధికారులతో జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ పై కలెక్టర్ సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల సరఫరా , వినియోగం పై పోలీస్ శాఖ , ఎక్సైజ్ శాఖ గట్టి నిఘా ఉంచాలని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగించకుండా కళాశాలలు, విద్యా సంస్థల్లో మెడికల్ కాలేజీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ,ఎక్సైజ్ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు గాను ఆయా శాఖల అధికారులు ఒక టీమ్ లాగా ఏర్పాడి పని చేయాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వలన విద్యార్థుల కేరీర్, భవిష్యత్ కోల్పోతారని అవగాహన కలిగించాలని, ఎక్కడైనా మాదక ద్రవ్యాల పరఫరా, వినియోగం ఉంటే పోలీస్ లకు సమాచారం అందించాలని అన్నారు.కళాశాల, పాఠశాలల్లో మాదక ద్రావ్యాలు నియంత్రణ పై కమిటీలు ఏర్పాటు చేసి అవగాహనకు కార్యా చరణ రూపొందించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. 18 సంవత్సరాలు లోపు ఉంటే మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. గంజాయి సాగు చేస్తే వ్యవసాయ, అటవీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. మత్తు కోసం వినియోగించే ఆల్ఫోజోలం లాంటి అమందులను డాక్టర్ ల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే అమ్మాలని, డ్రగ్ ఇన్స్పెక్టర్ మెడికల్ షాపు లను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్.పి.డి. జానకి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ ద్వారా గట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీస్ స్టేషన్ వారీగా మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కలిగిస్తామని తెలిపారు. ప్రజలు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా గుర్తించి పోలీస్ శాఖ ద్వారా నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.బి.డి.ఎస్.పి.జి.వి.రమణా రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. కృష్ణ , ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, ఇంటెలిజెన్స్ ఏ.ఎస్.పి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను మరింత అభివృద్ధి చేద్దాం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** జిల్లా ఏర్పడ్డాక మొదటి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వనపర్తి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపినందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి కొనియాడారు. శనివారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన చివరి సర్వసభ్య సమావేశానికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం , సత్వర అభివృద్ధి కొరకు చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని , వనపర్తి జిల్లాగా 2016లో ఏర్పడిందన్నారు. 2019 లో కొత్తగా ఏర్పడిన జిల్లా పరిషత్ ఎన్నికైన స్థానిక సంస్థల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు వనపర్తి జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఇంకా మిగిలిపోయిన అభివృద్ధి పనులకు తమవంతు సహకారం అందించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి పరుస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం చేసుకొని నైపుణ్యం ఉన్న విద్యార్థులు ఏ ప్రాంతంలోనైనా ఉపాధి పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. వనపర్తి జిల్లాలో సైతం ఒక నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ సమావేశం చాలా హుందాగా నిర్వహించారని అభినందించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను అన్ని జిల్లా అధికారులు, జిల్లా యంత్రాంగం నోట్ చేసుకోవడం జరిగిందని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆర్ లోక్నాథ్ రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లా మొదటి జిల్లా పరిషత్ కార్యావర్గానికి చైర్ పర్సన్‌గా తనకు మొదటి అవకాశం రావడంపై సభ్యులందరికి కృతజ్ఞతలు రావడంపై సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. అదనపు సంచిత్ గంగ్వార్ , వైస్ చైర్ పర్సన్ వామన్ గౌడ్ , జడ్పిసిఈఓ యాదయ్య, కార్యవర్గ సభ్యులు , కో ఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

### ఎంఎల్ఏ డాక్టర్ వంశీకృష్ణ



**ప్రజాపక్షం/వంగూర్ :** అచ్చంపేట నియోజకవర్గం మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అచ్చంపేట ఎంఎల్ఏ డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్వసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎంపిపి భీమమ్మలాల్‌యాదవ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన అచ్చంపేటను సిఎం సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో రోడ్ల మరమ్మత్తులకు 80కోట్లు మంజూరుకాగా , ఉల్పరబ్రిడ్జి 30కోట్లు , సమీకృత కార్యాలయాలకోసం 29కోట్లు, కెఎల్ఐ కాల్వల ప్యాకేజి నెం.29 వంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈసందర్భంగా ఎంపిటిసిలు, జడ్పిటిసి, ఎంపిపి పదవికాలం ముగియడంతో వారిని ఘనంగా సన్మానించారు. పదవులు ఉన్నప్పుడే కాకుండా ప్రజాసమస్యలపై నిత్యం ప్రజల్లో ఉంటే ప్రజల గుండెల్లో చిరస్థాయిగాగుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లావైస్‌చైర్మన్ బాలాజిసింగ్, జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి, వైస్ ఎంపిపి సంధ్యనర్సింహ్మారెడ్డి, సింగిల్‌విండోచైర్మన్ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్‌మై, ఎంపిడిఓ విజయభాస్కర్, ఎంఈవో శంకర్‌నాయక్, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీ కాలం మరో నాలుగు రోజుల్లో ముగియనుండటంతో శనివారం జరిగిన వీపనగండ్ల మండల పరిషత్ సర్వసభ సమావేశం ఎంపీపీ కమలేశ్వరరావు అధ్యక్షతన సాదాసీదాగా ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీపీ కమల్లేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో మండల పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, పాఠశాలల అభివృద్ధి, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, హరితహారం ద్వారా చెట్ల పెంపకం, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడం, మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచి నీటిని అందించడం జరిగిందని అన్నారు. మరో ఓనాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాబోతున్నాయని కొత్తగా ఎన్నికయ్యా ప్రజాప్రతనిధులు గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు. నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవిల సహకారంతో మండల అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో మండల పరిషత్ పాలకవర్గానికి సహకరించిన అధికారులకు ఎంపీపీ కమలేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఎంపీపీ కమలేశ్వర్‌రావు, జడ్పీటీసీ మాధురికిరణ్ గౌడ్ , ఎంపీటీసీలు భాస్కర్ రెడ్డి, పొగాకు రాముడు, ఈశ్వరమ్మ, పార్వతి రాజ్యానాయక్‌లకు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, పత్రికా విలేకరులు, మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ , విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ , వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ , పంచాయతీరాజ్ ఏఈ తేజ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** జిల్లాలో వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వారం గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం అంశంపై శనివారం సిసిఎల్ఏ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి దరఖాస్తులన్ని వేగంగా పరిష్కారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ , ఆర్డీఓ, అదనపు కలెక్టర్ రెవెన్యూ, కలెక్టర్ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వారం గడువులోగా పరిష్కరించాలన్నారు.

## వీడ్కోలు సన్మానం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** నేడు చందాపూర్ గ్రామంలో ఉపాధ్యాయ వృత్తిలో పదవి విరమణ పొందుతున్న ఆత్మీయ ఉపాధ్యాయులు ఆస్కని శాంతన్నకి శుభాకాంక్షలు తెలియజేశారు. చం దాపూర్ గ్రామంలో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి నేడు పదవి విరమణ పొందుతున్న వారి భవిష్యత్తు మంచిగా కొనసాగాలని కోరారు.

## ఆస్పత్రి పరికరాలకు రూ.50లక్షల నిధులు మంజూరు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అభివృద్ధి నిర్మాణాలకు, ఆస్పత్రి పరికరాలకోసంగాను రూ.50లక్షల నిధులను రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు విడుదల చేయడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్షలో మంత్రి జూపల్లికృష్ణారావు ఆస్పత్రి అభివృద్ధికి రూ.50లక్షలు ప్రకటించి శనివారం నిధులను విడుదలచేయడంతో మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బొలెరో వాహనంబోల్తా

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** అతివేగంతో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడి పలువురికి గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల గ్రామశివారులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం 45మంది కూలీలను తరలిస్తూ బొలెరో వాహనం ఓవర్‌స్పీడ్‌తో కంట్రోల్‌కాక వాహనంబోల్తాపడటంతో పదిమందికి తీవ్రగాయాలుకాగా 25మందికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంకారణంగానే ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. బొలెరో వాహనంబోల్తా పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న కూలీలను కొల్లాపూర్ బిజెపి నియోజకవర్గం ఇంచార్జీ ఎల్లేని సుధాకర్‌రావు,పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు పదిరభీమేష్‌రెడ్డి, బిజెపి నాయకులు పరామర్శించారు.

## సీరియల్ కిల్లర్ అరెస్ట్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** చింతలకుంట గ్రామ కేటిదొడ్డి మండలం గద్వాల జిల్లా నివాసుడు బోయ కాసమయ్యా , ఖాసీం కూలి పని చేస్తాడని జిల్లా ఎస్పీ డి. జానకి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండున్న సంవత్సరాల క్రితం నేరస్తుడు గ్రామం వదిలి మహబూబ్‌నగర్‌కు వచ్చి అక్కడక్కడ కూలి పనిచేసి వచ్చిన డబ్బంతా తాగడానికి తినడానికి ఖర్చు పెట్టి బస్టాండ్లలో ఫుట్ పాత్‌ల మీద పడుకునేవాడు. తాగుడుకు , చెడు అలవాట్లకు బానిస అయ్యాడు. ఆడవారికి డబ్బు ఇస్తానని ఆశ చూపి వారిని చెట్ల పొదల్లోకి తీసుకొనిపోయి శారీరకంగా అనుభవించిన తర్వాత నేరస్తుడు వారికి డబ్బులు ఇవ్వకుండా చంపాలను కొని నిర్ణయించుకుంటాడన్నారు. సుమారు ఒక నెల కిందట టిడి గుట్ట మహబూబ్ నగర్ లేబర్ అడ్డ వద్ద ఉన్న లక్ష్మిని నేరస్తుడు తీసుకొని అమిస్తాపూర్ గ్రామం దాటిన తర్వాత కొద్ది దూరంలో ఉన్న పెద్ద బ్రిడ్జి దాటిన తర్వాత రోడ్‌కు ఎడమ వైపున కొత్తగా నిర్మించిన బేస్మెంట్‌లోకి పోయి అక్కడ నేరస్తుడు లక్ష్మితో శారీరకంగా కలిసిన తర్వాత ఆమె నేరస్తున్ని డబ్బులు అడుగగా డబ్బులు ఇవ్వకుండా నేరస్తుడు అనుకున్న ప్రకారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో తన వద్ద ఉన్న తువాల తీసుకొని ఆమె మెడకు చుట్టి బిగించి తన జేబులో ఉన్న బ్లేడ్ తీసుకొని ఆమె గొంతును కోసి ఆ తర్వాత అక్కడే ఉన్న గ్రానేట్ రాయి తీసుకొని ఆమె ముఖంపై మోదీ చంపాడు. ఆ తర్వాత ఆమె కాళ్లకు ఉన్న వెండి పట్టీలు తీసుకొని పోయాడు. నేరస్తుని నుండి కాళ్ల వెడి పట్టీలను స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసును చేదించిన భూత్పూర్ సిఐ రామకృష్ణ, భూత్పూర్ ఎస్ఐ శ్రీనివాసులు, సత్యనారాయణ, తదితరులను జిల్లా ఎస్పీ డి. జానకి అభినందించారు.

## ఎస్‌బిఐ తదుపరి చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు సెట్టి



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తదుపరి చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు సెట్టి నియమితులయ్యారు. చల్లా శ్రీనివాసులు సెట్టిని నియమించడం కోసం ఎఫ్ఎస్ఐబి సిఫార్సు చేయడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ఎస్‌బిఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎస్‌బిఐలో సెట్టికి 36 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. జనవరి 2020లో ఎస్‌బిఐ బోర్డులో మేనేజింగ్ డైరెక్టర్‌గా చేరారు. ప్రస్తుతం బ్యాంక్ అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ వర్టికల్స్‌కు అధిపతిగా ఉన్నారు. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ టాస్క్ ఫోర్స్/కమిటీలకు కూడా ఆయన నేతృత్వం వహిస్తున్నారు. వ్యవసాయంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ యొక్క సర్టిఫైడ్ అసోసియేట్‌లో గ్రాడ్యుయేట్. 1988లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా తన వృత్తిని ప్రారంభించాడు. మూడు దశాబ్దాల పాటు సాగిన కెరీర్‌లో, కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అభివృద్ధి చెందిన మార్కెట్‌లలో బ్యాంకింగ్‌లో అపార అనుభవం కలిగి ఉన్నాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ హోదాల్లో పనిచేశారు. కాగా, ప్రస్తుత చైర్మన్ పదవీ విరమణ చేసిన రోజునే కొత్త చైర్మన్ బాధ్యతలు చేపడతారు. ప్రస్తుత చైర్మన్ పదవీకాలం ఆగస్టు 2024లో ముగుస్తుంది.



## నిర్ణయం, సంకల్పం, అంకితభావంతో జీవితంలో విజయం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఏ రంగంలోనైనా నిర్ణయం, సంకల్పం, అంకిత భావం అనే ఈ మూడు జీవితంలో విజయం సాధించేలా చేస్తాయంటూ పలువురు ప్రముఖ క్రీడాకారులు విద్యార్థులకు దీశా నిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 202324 సంవత్సరానికి సంబంధించి శనివారం పాఠశాల ప్రాంగణంలో ప్రశంసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రపంచ రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహించిన అంతర్జాతీయ బాస్కెట్ బాల్ ఆటగాడు సల్లా ప్రసాద్. ఒమన్ క్రికెటర్ ప్రపంచకప్ టీమ్ ఆటగాడు సందీప్ గౌడ్, సన్ రైజర్ హైదరాబాద్ , ఇండియా ఎ, హైదరాబాద్ రంజీ ప్లేయర్ సందీప్ భావంక విచ్చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ క్రీడలు కష్టపడి లక్ష్యాలను చేరుకునేలా చేస్తాయన్నారు. స్వయం క్రమశిక్షణతో కష్టపడి, క్రీడ పట్ల అంకితభావంతో లక్ష్యాలను సాధించగల్గుతామని విద్యార్థులు సూచించారు. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ డైరెక్టర్ ప్రార్థనా మణికొండ మాట్లాడుతూ, ఈ రోజు ఆక్స్ ఫర్డ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రశంసా కార్యక్రమంలో మీతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు పతకాలు, సర్టిఫికెట్లతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిన్ రామాంజుల, ప్రధానోపాధ్యాయులు ఫహ్మిదా, సిహెచ్ రేఖారావు, ఫాతిమా కాజిమ్, కోఆర్డినేటర్లు నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు.



## కొత్త క్రిమినల్ చట్టాల హ్యాండ్‌బుక్ మొబైల్ అప్లికేషన్ ''సమాహార''

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేపటి నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసులకు పూర్తిగా అవగాహన కల్పించేందుకు సమగ్ర హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేయడానికి ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులకు అవసరమైన ముఖ్యమైన హ్యాండ్‌బుక్ ఇది. హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జితేందర్, ప్రాసిక్యూటర్ల డిడికేటెడ్ టీం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి ఈ హ్యాండ్‌బుక్‌తో పాటు మొబైల్ అప్లికేషన్ ''సమాహార''ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ప్రాసిక్యూషన్స్ డిపార్ట్మెంట్ 'సమాహార' అనే మొబైల్ అప్లికేషన్ను అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ యాప్ కొత్త చట్ట నిబంధనలను సులభంగా అందిస్తుందన్నారు. అలాగే హ్యాండ్ బుక్ యొక్క వినియోగం మరియు కార్యకలాపాలను అర్థం చేసుకోవడానికి వీలుగా ఉందన్నారు.

## సిద్దిలక్ష్మి చిట్‌ఫండ్ బాధితులకు ఊరట

### త్వరలో జప్తు ఆస్తుల వేలంపాటకు సిసిఎస్ పోలీసుల శ్రీకారం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** చీటింగ్ కేసులో సీజ్ చేసిన చిట్‌ఫండ్ ఆస్తుల వేలంపాట ప్రక్రియకు సిసిఎస్ పోలీసులు ముహూర్తం నిర్వహించారు. దీంతో సిద్దిలక్ష్మి చిట్‌ఫండ్ బాధితులకు ఊరట లభించినట్లయింది. వివరాలు ఇలా ఉన్నాయి. అధిక వడ్డీల ఇస్తామని నమ్మించిన సదరు చిట్‌ఫండ్ యజమాని కరుణాకర్ వినియోగదారుల నుంచి డిపాజిట్లు వసూలు చేశాడు. ఆ తరువాత సదరు చిట్‌ఫండ్ సంస్థ బిచారణ ఎత్తివేయడంతో 2012లో బాధితుల ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లోనే నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు నగరంలోని అతని ఆస్తులను కూడా సీజ్ చేశారు. బాధితులకు న్యాయం చేసేందుకు సిసిఎస్ పోలీసులు కోర్టు అనుమతితో సీజ్ చేసిన చిట్‌ఫండ్ ఆస్తులను అమ్మేందుకు వేలం నిర్వహిస్తున్నారు.నాచారంలో గల ఈ ఆస్తులను ఖరీదు చేసేందుకు ఆసక్తి గల వారు సిసిఎస్ ఎసిపి కిరణ్‌కుమార్ 8712660814, హెడ్‌కానిస్టేబుల్ 8712569937 నెంబర్లపై సంప్రదించాలని సిసిఎస్ డిసిపి శ్వేతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ డిపాజిటర్ ప్రొటెక్షన్ చట్టం కంద వేలం వస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాట ద్వారా వచ్చిన డబ్బును బాధితులకు అందజేస్తామన్నారు. సిసిఎస్ పోలీసుల చొరవకు బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

## చెట్టును ఢీ కొట్టిన పాఠశాల బస్సు

### ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని అనూస్ పాఠశాల బస్సు శనివారం సాయంత్రం రాజీనాగరం శివారులోని బాపని గేరి దగ్గర ఉన్న చింత చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు కాగా వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మునిగిళ్ల గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ మద్యం సేవించి బస్సు నడపడంతో అతివేగంగా వచ్చి మలుపు దగ్గర ఉన్న చింత చెట్టును ఢీ కొట్టడంతో బస్సు పెద్ద ఎత్తున ధ్వంసం అయింది. ప్రమాదం గురించి వనపర్తి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ధరణి దరఖాస్తుల పరిష్కార వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిశీలన అంశంపై రాష్ట్ర సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ధరణి సంబంధిత పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో కృషి చేయాలని కమిషనర్ సూచించారు. సక్సెషన్, పెండింగ్, మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.



## స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో కమిషనర్



**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు న్యూ హనుమాన్ నగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.పారిశుద్ధ్య పనుల్లో భాగంగా సత్యనారాయణ కాలనీ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొని కార్మికులు,కాలనీ సభ్యులతో కలసి ఆయన రోడ్లను శుభ్రం చేశారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్మికులకు,కాలనీవాసులకు కమిషనర్ సూచించారు. నాయకులు,మున్సిపల్ సిబ్బంది,కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ఢిల్లీ లో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ఢిల్లీ లో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ, సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎంఎల్‌ఏ వెంట యాదయ్య, జిల్లా నాయకులుమాజీచంద్రశేఖర్,మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

## మెడిసిన్ విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మెడిసిన్ విద్యార్థులకు బిఎల్‌ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని మాజీ సిఎం కేసీఆర్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ కుషాయిగూడకు చెందిన అమర్‌నాథ్ గౌడ్ ఎల్బీ నగర్ కామినేని హాస్పిటల్ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు.తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో మెడిసిన్ చదువే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న బిఎల్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు,ఉప్పల్ ఎంఎల్‌ఏ బండారి లక్ష్మారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ చేతుల మీదుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌లో విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు.బిఎల్‌ఆర్ ట్రస్టు ద్వారా మెడిసిన్ విద్యార్థులకు 5 సంవత్సరాల ఫీజును బండారి లక్ష్మారెడ్డి చెల్లించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని ఆయన అన్నారు. నాయకులు మహేష్‌గౌడ్,నవీన్‌గౌడ్,శివగౌడ్,రాజేశ్వర్‌రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ నూతన కలెక్టర్ గా భాద్యతలు చేపట్టిన జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి శనివరం నాడు జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్‌ను మర్యాదపూర్వకం గా కలిసి జిల్లాలోని వివిధ అంశాలపై చార్చించారు.

## కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడమే బాధ్యతగా పనిచేస్తున్నాం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడమే బాధ్యతగా పనిచేస్తున్నామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శనిగల దన్‌రాజ్ యాదవ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ ఏడవ డివిజన్ నిజాంపేట్ రెడ్డీస్ ఏవెన్యూ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ ప్రణయలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దన్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాలనీలు, మురికి వాడల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే బాధ్యతగా పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎఇ అరున్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురునాథ్, సత్యనారాయణ, ధనుంజయ, మురళి, జగన్ మోహన్ పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్‌కు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** జనసేనా అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాన్‌కు శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఘన స్వాగతం పలికారు. శనివారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని గ్రామపంచాయతి వద్ద హైద్రాబాద్ నుంచి కొండగట్టు వెళ్తున్న పవన్‌కల్యాన్‌కు రాజీవ్ రహదారిలో భారీ గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం ఎంఎల్‌ఏగా గెలిచిన మొట్టమొదటిసారి కొండగట్టు అంజన్న ఆలయానికి బయల్దేరుతుండగా అభిమానులు, జనసేనా, బిజెపి, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారులకు జోహార్లు అర్పిస్తున్నానని అన్నారు. జనసేనా, టిడిపి, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనా, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైల్ అదాలత్




**ప్రజాపక్షం/చర్లపల్లి:** జైలులో ఉన్న ఖైదీల కేసుల పరిష్కారానికి కృషి చేస్తామని రంగారెడ్డి జిల్లా 6వ ఏఎంఎం మేజిస్ట్రేట్ బి ఉషాక్రాంతి అన్నారు. శని వారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో రంగారెడ్డి జిల్లా మేజిస్ట్రేట్ ఉషాక్రాంతి, ఎల్బీనగర్ 4వ ఏఎంఎం మేజిస్ట్రేట్ గోపిక నాగశ్రావ్యల ఆధ్వర్యంలో జైల్ అదాలత్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 38 ఖైదీలకు సంబంధించిన 33 కేసులను పరిష్కరించబడ్డాయని వారు తెలిపారు.ఆవేశంలో చిన్న చిన్న నేరాలు చేసి జైలు జీవితం గుడుపుతున్న వారి కేసులు విచారణ జరిగేటప్పటికి చాలాకాలం పడుతుందనాన్రు.అలాంటి వారికి జైలు నుంచి విముక్తి కలిగించడానికి జైల్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్,ఉప పర్యవేక్షణాధికారులు శశికాంత్,కాళిదాస్, రత్నం, జైలర్లు పరశురాం, సత్తయ్య, సాయిసురేష్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో పేదలకు ఉపాధి అవకాశాలు

శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అనంతగిరి పర్యాటక అభివృద్ధిపై చేపట్టాల్సిన పనులపై అటవీ దేవదాయ, మిషన్ భగీరథ,భూగర్భజలాల, మున్సిపల్ విభాగాల అధికారులతో చేవేళ్ల పార్లమెంటు సభ్యులు కొండవిశేశ్వర్‌రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ,అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లతో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సభాపతి మాట్లాడుతూ జిల్లాలో పార్యవరణ పర్యాటక అభివృద్ధికి స్వచ్ఛ దర్శన్ కింద 110 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇట్టి నిధులతో 213 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపోందించాలని ఆయన తెలిపారు. పర్యాటక అభివృద్ధికి సంబంధించి నిధులు వృధా చేయకుండా అవసరమైన పనులు చేపటట్టాలని సూచించారు. పర్యాటక అభివృద్ధిలో చెట్లను ఎక్కువగా తొలగించకుండా అభివృద్ధి పరచాలని తెలిపారు. ఏ ప్రాజెక్టులకు ఎంతెంత ఖర్చు పెడతారో స్పష్టమైన నివేదికలను అందించాలని సభపతి తెలిపారు. గతంలోనే అభివృద్ధి 225 కోట్లు మంజురైనప్పటికి 25 కోట్లతోనే అభివృద్ధి పనులు చేవారని అయాన తెలిపారు. పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కోట్‌పల్లి ప్రజేక్టులో భోటింగ్ చేయడం వల్ల పర్యాటకుల సందడి పేరిగిందని ,దీనివల్ల స్థానికులకు ఉపాధితోపాటు హైదరాబాద్ నుండి వికారాబాద్ వరకు రహదారులకు ఇరువైపుల ఎన్నో హోటల్లు వెలిశాయని సభపతి గుర్తు చేశారు. ఎంపి మాట్లాడుతూ పర్యాటక ప్రాంత అభివృద్ధిలో భాగంగా స్థానికులకు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలు ఉండాలన్నారు. పర్యాటక ప్రాంత అభివృద్ధితో జిల్లాని పలు ప్రాంతాలు వృద్ధి చెందుతాయని అన్నారు. జిల్లాలోని కోట్‌పల్లి , సర్పన్‌పల్లి ,శివసాగర్ ,లక్నాపూర్ ,దామగుండం ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణ అభివృద్ధిలో భాగంగా చేపట్టే వివిధ పనుల వివరాలను ఎల్అండ్‌టీ ప్రాజేక్ట్ మేనేజర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమిక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారి రేణుక ,ఇఇసుందర్ , అటవీ శాఖ అధికారి జ్ఞాన్వేర్ తదితరులు పాల్గోన్నారు.

## నీట్ లీకేజీకి నిరసనగా రేపు రాజ్‌భవన్ ముట్టడి : ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** నీట్ ప్రవేశ పరీక్ష లీకేజి అంశంపై చర్చించేందుకు రాష్ట్ర గవర్నర్ అనుమతించక పోవటాన్ని నిరసిస్తూ జూలై 1న రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా నేతలు ప్రకటించారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, మేడిపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు మునిదీప్, నాగరాజు, ప్రీతమ్, రాజేష్, సంజయ్ తదితరులు శనివారం జరిగిన మేడిపల్లి మండల సమావేశంలో పాల్గొని ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు వైద్య కోర్సు ప్రవేశాల కోసం హాజరైన నీట్ పరీక్ష లీకేజి అంశం దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సరైన దిద్దుబాటు చర్యలు తీసుకోలేక పోయిందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపడుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై తెలంగాణా గవర్నర్‌ను కల్సి సమస్యను విన్నవించేందుకు అనుమతి కోరినా నిరాకరించారని, దీనికి నిరసనగా రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరవ్వాలన్నారు.

## ఆస్తులు కాపాడుకోవడానికే పార్టీమారిన ఎమ్మెల్యే కాలె

కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో కలవడం తీవ్రంగా ఖం డిస్తున్నామని నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రె సిడెంట్ సామా వెంకట్ రెడ్డి అన్నారు. గతంలో కాంగ్రెస్ పా ర్టీలో గెలిచి నియోజకవర్గ అభివృద్ధి పేరుతో బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన యాదయ్య పది సంవత్సరాలు మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని అన్నారు. ఆయన స్వ లాభం కోసం, కుటుంబ పాలన కోసం పార్టీలు మారుతూ నమ్ముకున్న నాయకులను రకరకాల ఇబ్బందులకు గురి చేస్తూ ఇప్పుడు ఊసరవెల్లిల పూటకో పార్టీ మారుస్తూ నమ్మిన పార్టీ నాయకులను మరోసారి మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరా రు అని అన్నారు. నిజంగా అభివృద్ధి కోసం పార్టీ మారితే బిఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి గెలిచి పార్టీలో కొనసాగాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు కష్టపడి యాదయ్యను గెలిపించిన తర్వాత కాంగ్రెస్ నాయకులను అనేక తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బందుల కు గురి చేశారని అన్నారు. 10 సంవత్సరాలు బిఆర్‌ఎస్ పార్టీలో కొనసాగి మండలానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇప్పించలేని నాయకుడు కాలే యాద య్య, అలాగే కాంగ్రెస్ పార్టీలో పనిచేసినటువంటి నాయకులకు ఒక్కరికి కూడా దళిత బంధు ఇవ్వలేదని మండిపడ్డారు. కష్టకాలంలో కూడా కేసులకు భయపడకుండా కాంగ్రెస్ జెండా మోసిన కాంగ్రెస్ నాయకులను టార్గెట్గా చేసిన ఎమ్మెల్యే యాదయ్య మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీని విమర్శించి ఏం ముఖం పెట్టుకొని కాంగ్రెస్ లోకి వచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

## శంకర్ నాయక్‌పై దుండిగల్ పిఎస్‌లో మహిళలు ఫిర్యాదు

**ప్రజాపక్షం/దుండిగల్ :**దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లపూర్ తాండా లోని ఓ స్థలం విషయంలో మహిళలపై దురుసుగా ప్రవర్తించి,అసభ్య పదజాలంతో దూషించాడన్న కారణంతో అదే గ్రామానికి చెందిన మహిళలు దుండిగల్ మున్సిపల్ 27వ వార్డు బిఆర్‌ఎస్ కౌన్సిలర్ కౌన్సిలర్ శంకర్ నాయక్ పై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీస్ లు విచారణ చేపడుతున్నట్లు సమాచారం దుండిగల్ సిఐ సిహెచ్ శంకరయ్యను వివరణ కోరగా బూ వివాదం విషయంలో గాగిల్లపూర్ తాండాకు చెందిన కొర్ర వసంత మరి కొందరు తమను అసభ్యంగా మాట్లాడుతూ, దాడులకు పాల్పడన్నాదంటూ ఈ నెల 14న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు, విచారణ జరుపుతున్నామని,పూర్తి వివరాలు ఆధారంగా త్వరలో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత మహిళలను వివరణ కోరగా సర్వే నంబర్ 157,158 గాగిల్లపూర్ తాండాలో మాకు సబందించిన 5 గుంటల భూమి దరణిలో వ్యవసాయ భూమిగా చూపిస్తుందన్నారు. వ్యవసాయ భూమిలో మున్సిపల్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారన్నారు. మా భూమిని ఆక్రమించుకోవడమే కాక మా పైన స్థానిక కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ దాడులకు పాల్పడుతున్నదంటు మున్సిపల్, పోలీస్ స్టేషన్ల చుట్టూ గత కొంతకాలంగా తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని బాదిత మహిళలు కొర్ర వసంత, కొర్ర దేవి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్యెల్సి శంభిపూర్ రాజు అండతో శంకర్ నాయక్ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాం నుండి మాపై దౌర్జన్యానికి దిగుతున్నదన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం వచ్చినా మాకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మాపై అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడులకు దిగుతున్నారంటూ పోలీస్ లకు ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా పట్టించుకోవడంలేదన్నారు.

## బోడుప్పల్లో నెగ్గిన అవిశ్వాసం




**ప్రజాపక్షం/బోడుప్పల్:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లో మాజీ మంత్రి ,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి ఎదురుదెబ్బ తగిలింది. బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి గౌడ్ లపై కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 22 మంది కార్పోరేటర్లు మద్దతు పలకడంతో నెగ్గింది. బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం కీసర అర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మొత్తం 28 మంది సభ్యులకు గాను 22 మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులు హజరైయ్యారు. మిగిలిన సభ్యులు హజరు కాలేదు. వెంటనే అవిశ్వాసం నెగ్గిందని ప్రకటించారు. దీంతో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్లు తమ పదవులు కోల్పోయారు. త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక తేదిని ప్రకటిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు మాట్లాడుతూ బోడుప్పల్ కార్పొరేషన్ లో అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అభివృద్ధి కోసం పక్క ప్రణాళికలతో ముందుకు సాగుతుందని అన్నారు. తోటకూర అజయ్ యాదవ్ ను తమ మేయర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, డిప్యూటీ మేయర్ పేరు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

**భారీ బందోబస్తు మధ్య:**మేడిపల్లి పోలీసులు బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు.మల్కాజిగిరి ఏసిపీ పర్యవేక్షణలో సాధారణ ప్రజలతో పాటు ఎవరినీ కార్యాలయంలోకి అనుమతించలేదు. అవిశ్వాస తీర్మానం ఓటింగ్ ను పారదర్శకంగా నిర్వహించాలని, ఆర్డీఓ సమావేశాన్ని వీడియో తీయించారు. ఓటింగ్ అనంతరం సంతకాలు తీసుకుని నిర్ధారణ చేసుకున్న తర్వాతే అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు.జిల్లా కలెక్టర్ మేయర్ ఎన్నికను చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశామన్నారు.

**నూతన మేయర్ గా తోటకూర అజయ్ యాదవ్:**మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తనయుడు తోటకూర అజయ్ యాదవ్ ను తమ మేయర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. డిప్యూటీ మేయర్ పేరు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

**కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు:**అవిశ్వాస తీర్మానం నెగ్గగానే మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. నాయకులు, కార్యకర్తలు తోటకూర అజయ్ యాదవ్ నివాసానికి చేరుకుని అభినందనలు తెలిపారు.

## రైతుబంధును సకాలంలో అందించాలి

డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులకు సకాలంలో రైతు బంధును అందించాలని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులకు రైతు బంధుపై ప్రత్యేక సమావేశాన్ని ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహించి సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎన్ని ఎకరాలు భూమి ఉంటే అన్ని ఎకరాలకు రైతుబందు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. ప్రస్తుతం పంటలు సాగు చేసే సమయం ఆసన్నమైందని ఇప్పటికి కూడ ఇంకా రైతుబంధు రైతుల ఖాతాల్లోకి జమకాలేదని అన్నారు. మాజి సిఎం కేసిఆర్ ఉన్నప్పుడు పంటకు ముందే రైతులకు రైతుబంధు అందేదని కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధును సకాలంలో ఇవ్వడం లేదని చెప్పారు. రైతులకు కావాల్సిన పనిముట్లను అందించాలని కోరారు. ఎక్కువ మంది రైతులు రైతుల భూములు ఎన్ని ఎకరాలు ఉన్న అన్ని ఎకరాలకు రైతుబంధు వేయాలని సమావేశంలో రైతుల పక్షాణ ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎల్లుబాయిబాబు, సోసైటి వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై కాంగ్రెస్ నాయకుల దాడి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డిల మధ్య మాటమాట పెరిగి వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొందరు వ్యక్తులు కుర్చీలు విసిరేయగా వైస్ చైర్మన్ పన్నాల వాణిరెడ్డికి ముఖానికి తగిలి గాయాలయ్యాయి. శనివారం తూం కుంట మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం కొరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో మూడవ వార్డు కౌన్సిలర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి సమావేశం హాల్‌లోకి వచ్చి సమావేశం బైకాట్ చేస్తున్నామని, మీటింగ్ పెట్టకూడదని కౌన్సిలర్‌లు అందరూ బయటకు వెళ్లిపోవాలని అన్నారు. దీంతో చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు కల్పించుకుని మీటింగ్ ఎందుకు వాయిదా వేయాలని సమావేశం జరుపుకుందామని ఏమైనా అంశాలు ఉంటే సమావేశం తర్వాత మాట్లాడుదామని వేణుగోపాల్‌రెడ్డితో అన్నారు. మీటింగ్ పెట్టేది అవసరమే లేదనగా దీంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. వేణుగోపాల్‌రెడ్డి వెంట వచ్చిన కొందరు వ్యక్తులు చైర్మన్‌పై అసభ్య పదజాలంతో దూషిస్తు ఆగ్రహంతో ఊగిపోయి కుర్చీలు విసిరేశారు. సమావేశం హాల్‌లో ఉన్న వైస్ చైర్మన్ పన్నాల వాణిరెడ్డికి ముఖ బాగంలో కుర్చి తగిలి రక్తస్రావం అయ్యింది. దీంతో వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మెడిసిటి ఆస్పత్రికి తరలించారు. గొడవ జరుగుతుందని తెలుసుకున్న వైస్ చైర్మన్ భర్త వీరారెడ్డి, పిన్నింటి మహిపాల్‌రెడ్డిలు పైఅంతస్తుకు వస్తుండగా వారిపై కూడ కొందరు వ్యక్తులు దాడికి దిగారని వారు అన్నారు. దీంతో వైస్ చైర్మన్‌పై దాడికి పాల్పడిన వారిపై శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశామని చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. కౌన్సిల్ సమావేశం రోజున ఇలా గొడవ జరుగడంతో సమావేశం రద్దయ్యింది. ఈ గొడవ జరుగుతుండగా మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకటగోపాల్ అందరిని సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా వారు వినకపోవడంతో గొడవ సద్దుమనగలేదు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## వైద్యం, విద్యా సమస్యలు పరిష్కరించాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మల్లాపూర్ డివిజన్‌లోని వైద్యం, విద్య సంబంధిత పిహెచ్‌సి, జడ్‌పి హైస్కూల్‌లలో సమస్యలు పరిష్కరించటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ గౌతంకు వినతిపత్రం ద్వారా కోరారు. సమస్యల నిలయంగా మారిన మల్లాపూర్ డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెరుగు పరచాలని డివిజన్‌లోని సూర్యానగర్ ప్రాంతంలలో ఉన్న ఈ పిహెచ్‌సి సెంటర్‌లో చికిత్సల కోసం వచ్చే రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు సైతం లోపించాయన్నారు. పలు సమీప ప్రాంతాల నుండి వచ్చే రోగులకు ఉపయోగపడే ఈ సెంటర్‌లో మందులు, అవసరమైన వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా మల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కనీస మౌళిక సౌకర్యాలు లోపించాయన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పైళ్ల ప్రవీణ్, నేమూరి మహేష్ గౌడ్ తదితరులు ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్‌ను కల్సిన వారిలో ఉన్నారు.

## 18వ జాతీయ గణాంక దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ గౌతం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** దేశ సాంఘీక, ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధికి విధానాల రూపకల్పనలో గణాంకాలు ప్రాముఖ్యత వహిస్తాయని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. జిల్లా ము ఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో 18వ జాతీయ గణాంక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా గణాంక దర్శిని2023 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరంలో అవగాహన కల్పించేందుకు గణాంకాల దినోత్సవాన్ని జరుపుకోవటమే ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా ప్రత్యేకంగా పుస్తక రచన చేయటంలో కృషి చేసిన గణాంక అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య ప్రణాళికాధికారి ఎం. మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఏటా భారత గణాంకాల పితామహుడు ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జన్మదినోత్సవ సందర్భంగా ప్రతి ఏటా గణాంక దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు. 2024లో సుస్థిర అభివృద్ధి సూచీలను సాధించే క్రమంలో దేశం ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివిధ ఆర్థిక పరమైన విధానపరమైన నిర్ణయాలకు, సంక్షేమ పథకాల అమలుకు ప్రస్తుత గణాంకాల అవసరాలు వాటి సేకరణ, విశ్లేషణ ప్రాముఖ్యత వహిస్తాయన్నారు.

## నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్ గౌడ్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఆర్ ఆర్ జోన్ అసిస్టెంట్ ఎ క్సైజ్ సూపరిండెంట్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో తాండూరు నియోజవర్గ పరిధి పెద్దేముల్ మండలంలోని పలు తాండలలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం పెద్దేముల్ మండల పరిధి పాషాపూర్ తాండ, రామ్‌సింగ్ తాండ, ఓమ్లానాయక్ తాండలలో కొనసాగుతున్న నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ పోలీసుల దాడులు నిర్వహించి న 600లీటర్ల బెల్లం పాకం ధ్వంసం చేసినట్లు తాండూరు ఎక్సైజ్ సిఐ బాలగంగాదర్ తెలిపారు. బెల్లం పాకం ధ్వంసం చేయడంతో పాటు నాటు సార కాస్తున్న ముగ్గరు వ్యక్తులపై ఎక్సైజ్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసిన ట్లు తెలిపారు. షాపూర్ తాండకు చెందిన రాథోడ్ రాములు, కిషన్, ఓమ్లానాయక్ తాండకు చెందిన రాథోడ్ సుభాష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ దాడులలో ఎక్సైజ్ తాండూరు పోలీసులతో పాటు ఎన్‌ఫోర్స్ మెంట్ టీంకు చెందిన వికారాబాద్, మోమిన్‌పేట్ టీమ్స్ అధికారులు పాల్గోన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్ లో దాదాపు 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులకు శనివారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యుజిడి, సిసి రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సోమయ్య నగర్, మాగ్దుం నగర్, లింక్ రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కొలుకుల జైహింద్, వెంకటేశ్వర స్వామి టెంపుల్, చైర్మన్ వేణు యాదవ్, సోమయ్య నగర్ కమిటీ అధ్యక్షులు యాదగిరి, సోమయ్య నగర్, బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు నరసింహ ముదిరాజ్, విఠల్ ముదిరాజ్, సతీష్, మనోజ్, మహేష్, నాగేష్, సత్యం చారి, సత్తిరెడ్డి, సురేష్ గుప్తా, సురేందర్, సోమేష్, మాగ్దుం నగర్, కమిటీ సభ్యులు లక్ష్మణ్, రాజేష్, మహమూద్, సతీష్, మైలారం రాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘానికి దాతల సహకారం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :**శామీర్‌పేట మండల కేంద్రంలోని డ్వాక్రా సంఘానికి ప్రజాప్రతినిధులు విరాళాలు అందజేశారు. శనివారం శామీర్‌పేట గ్రామంలోని మూడు సంఘాల సభ్యురాళ్లు ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఎంపిపి ఎల్లుబాయిబాబు 18 కుర్చీలు, హాజ్‌యాత్ర రాష్ట్ర కమిటి సభ్యుడు, కోఆప్షన్ సభ్యుడు ఎండి ముజుబుద్దిన్ 4 ఫ్యాన్లు, రెండు లైట్‌లు, ఎంపిటిసి డప్పు సాయిబాబు కుట్టుమిషన్‌ను విరాళంగా ఇప్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు ప్రజాప్రతినిధులకు దన్యవాదాలు తెలిపారు.

క్రీడ

# కప్ కొట్టేశాం

## 17ఏళ్ల నిరీక్షణకు తెర





### ఉత్కంఠగా సాగిన ఫైనల్‌లో టీమ్ఇండియా అద్భుత విజయం

**బ్రిడ్జ్‌టౌన్:** టీ20 ప్రపంచకప్ 2024 మనదే. 17 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ కప్‌ను రెండో సారి సగర్వంగా ముద్దాడింది భారత్ జట్టు. దక్షిణాఫ్రికాతో జరిగిన నరాలు తెగే ఉత్కంఠ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించి విశ్వవిజేతగా అవతరించింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా చివరి వరకు పోరాడి ఓటమిని అందుకుంది. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితం అయింది. ఆ జట్టులో క్లాసెన్ (52: 27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. క్వింటన్ డికాక్ (39: 31 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్), స్టబ్స్ (31: 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్య 3, బుమ్రా 2, అర్ష్‌దీప్ సింగ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియాకు ఓపెనర్ విరాట్ కోహ్లీ (76; 59 బంతుల్లో 6x4, 2x6) అదరగొట్టాడు. అక్షర్ పటేల్ (47; 31 బంతుల్లో 1x4, 4x6) దూకుడుగా ఆడాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (9) తక్కువ పరుగులకే ఔటయ్యాడు. మహరాజ్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఒక్క బంతి వ్యవధిలోనే తొలి డౌన్‌లో వచ్చిన రిషభ్ పంత్ (0) పరుగులేమీ చేయకుండానే డికాక్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి జట్టు స్కోరు కేవలం 23 పరుగులు మాత్రమే. అనంతరం స్వల్ప వ్యవధిలోనే సూర్యకుమార్ యాదవ్ (3) రబాడా బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి క్లాసెన్ చేతికే చిక్కిపోయాడు. దీంతో ఐదు ఓవర్లలోనే కీలకమైన 3 వికెట్లు కోల్పోవడం వల్ల భారత క్రికెట్ జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, అప్పుడే క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్(47)తో కలిసి విరాట్ కోహ్లీ(76) చక్కటి ఇన్నింగ్స్ నిర్మించాడు. ఇద్దరూ క్రీజులో నిలదొక్కుకొని వీలుచిక్కినప్పుడల్లా ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదేశారు. దీంతో టీమ్ ఇండియాకు కాస్త స్వాంతన దక్కింది. అయితే, హాఫ్ సెంచరీకి చేరువలో సమన్వయ లోపంతో అక్షర్ పటేల్ రనౌట్‌గా పెవిలియన్ చేరాడు. చివర్లో శివమ్ దూబె (27; 16 బంతుల్లో 3x4,1x6) మెరుపులు మెరిపించాడు. దీంతో టీమ్ ఇండియా మంచి స్కోరు చేసింది. జడేజా (2), హార్దిక్ పాండ్య (5*) పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, నోకియా తలో 2 వికెట్లు పడగొట్టగా.. మార్కో యాన్సెన్, రబాడ చెరో వికెట్ తీశారు.

## భారీ విజయం దిశగా భారత్

### దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టు..

**చెన్నై:** దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత అమ్మాయిల జట్టు భారీ విజయం దిశగా సాగుతోంది. ఓవర్ నైట్ 525/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. 603/6 వద్ద డిక్లేర్డ్ చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. రెండో రోజు ఆట ముగిసేసరికి ఆ జట్టు 236/4 స్కోరు చేసింది. ఓపెనర్లు వోల్వార్ట్ (20), అన్నేకే (39) పరుగులు చేశారు. వన్‌డౌన్ బ్యాటర్ సునే లూస్ (65) అర్ధ శతకం బాదింది. డెల్మీ టక్కర్ (0) డకౌట్ అయింది. ప్రస్తుతం మారిజానే కాప్ (69*; 125 బంతుల్లో 8 ఫోర్లు), నాడిన్ డి క్లర్క్ (27*; 28 బంతుల్లో 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 3, దీప్తి శర్మ ఒక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన టీమ్ఇండియా అద్భుతమైన రికార్డు సృష్టించింది. 90 ఏళ్ల ఉమెన్స్ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా భారత్ అవతరించింది. అంతకుముందు ఆస్ట్రేలియా పేరిట ఈ రికార్డు ఉండేది. ఇదే ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపైనే 575/9 (డిక్లేర్డ్ ఆసీస్ స్కోరు చేసింది. ఓవర్ నైట్ 525/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత బ్యాటర్లు హర్మన్ (69), రిచా ఘోష్ (86) ఐదో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. ఆ తర్వాత వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు.

## క్వార్టర్స్‌లో గాయత్రి – ట్రీసా జోడీ

యుఎస్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రి గోపీచంద్–ట్రీసా జాలీ జోడీ సత్తాచాటుతోంది. మహిళల డబుల్స్ విభాగంలో అదిరే ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో చైనీస్ తైపీకి చెందిన సీ షాన్‌హంగ్ జు జంటను 16–21, 21–11, 21–19తో చిత్తుగా ఓడించింది. తొలి గేమ్‌ను చేజార్చుకున్నప్పటికీ తర్వాత గాయత్రిట్రి సా జంట పట్టుదలతో పోరాడింది. రెండో గేమ్ లో ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం చెలా యించింది. ఇక నిర్ణయాత్మక గేమ్‌లో ఎలాంటి పొరపాటు చే యకుండా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో గాయత్రిట్రిసా జోడీ ఆరో సీడెడ్ జపాన్ ద్వయం రుయి హిరోకామియునా కటోతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు ర జావత్ కూడా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. చై నీస్ తైపీ ఆటగాడు హువాంగ్ కాయ్‌ను 21–18, 21–16తో మట్టికరిపించాడు. వరుస గేమ్‌ల్లో సత్తాచాటి ప్రత్యర్థిని చిత్తుచేశాడు. ప్రియాన్షు రజావత్ క్వార్టర్స్‌లో చైనా ప్లేయర్ లీ లాన్ జితో అమీతుమి తేల్చుకోనున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మాళవిక బాన్సోద్ కూడా విజయఢంకా మోగించింది. తెరెజా స్వబికోవా (చెక్ రిపబ్లిక్)పై 15–21, 21–19, 21–14తో గెలుపొందింది. క్వార్టర్స్‌లో స్కాట్లాండ్ క్రీడాకారిణి క్రిస్టీ గిల్మర్‌తో మాళవిక పోటీపడనుంది.



రీల్

## నరేష్ పక్కా మాస్ గ్లింప్స్‌కు టైం ఫిక్స్

మన టాలీవుడ్ టాలెంటెడ్ హీరో అల్లరి నరేష్ నటించిన చిత్రాలు ఈ ఏడాదిలో ఆల్రెడీ రెండు వచ్చాయి. మరి కింగ్ నాగార్జునతో చేసిన నా సామిరంగ లో తన కీలక పాత్ర మంచి గుర్తింపు తెచ్చుకోగా దీని తర్వాత చేసిన ఎంటర్టైనర్ ఆ ఒక్కటీ అడక్కు పర్వాలేదనిపించింది. అయితే అల్లరి నరేష్ నుంచి కొన్ని సాఫ్ట్ పాత్రలతో పాటుగా మంచి హార్డ్ హిట్టింగ్ రోల్స్ కూడా పడ్డాయి. మరి వీటికి పీక్ రోల్ అన్నట్టుగా తాను చేసిన పక్కా మాస్ చిత్రమే బచ్చల మల్లి. దర్శకుడు సుబ్బు మంగదెవ్వి ఈ చిత్రాన్ని కొని నిజ జీవిత సంఘటనలు ఆధారంగా తెరకెక్కించగా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే సాలిడ్ రెస్పాన్స్ దీనికి వచ్చింది. ఇక ఇప్పుడు ఈ సినిమా పై అల్లరి నరేష్ బర్త్ డే గ్లింప్స్ అప్డేట్ ఇస్తూ వదిలిన పోస్టర్ కూడా చాలా నాచురల్ గా అల్లరి నరేష్ నాటు లుక్ లో అదరగొట్టేసాడని చెప్పాలి. ఇక ఈ టీజర్ గ్లింప్స్ అయితే రేపు జూన్ 30న రిలీజ్ చేస్తున్నట్టుగా దీనితో అనౌన్స్ చేశారు. మరి ఈ టీజర్ ఎలా ఉంటుందో చూడాలి.

## యువతకి దళపతి విజయ్ ఇచ్చిన సందేశమిదే.!



సౌత్ స్టార్ హీరోస్‌లో ఒకరైన దళపతి విజయ్ జోసెఫ్ ఇపుడు హీరోగా తన కెరీర్ 68వ సినిమాని అయితే టాలెంటెడ్ దర్శకుడు వెంకట్ ప్రభుతో చేస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తవుతుండగా ఈ సినిమా నుంచి రీసెంట్‌గా వచ్చిన బర్త్‌డే గ్లింప్స్‌కి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ భారీ చిత్రం మధ్యలో వచ్చిన చిన్న గ్యాప్‌లో అయితే దళపతి విజయ్ ఓ మీటింగ్ లో యువతని స్టూడెంట్స్‌ని ఉద్దేశించి చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. తన వైపు నుంచి సందేశం ఇస్తూ యువత తాత్కాలిక ఆనందాలకు నో చెప్పాలని ముఖ్యంగా డ్రగ్స్ లాంటి వాటికి నో చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తమిళనాట మాదకద్రవ్యాల వాడకం ఎక్కువయ్యింది అని దీనిని తగ్గించాలని తన నుంచి సందేశాన్ని అందించాడు. మరి అపారమైన క్రేజ్ విజయ్ సొంతం తన లాంటి వాడి నుంచి ఇలాంటి సందేశం రావడం ఒక మంచి విషయం అని తటస్థులు కూడా ఈ విషయంలో విజయ్‌ని అభినందిస్తున్నారు. దీనితో ఇలా విజయ్ లేటెస్ట్ కామెంట్స్ వైరల్‌గా మారాయి.

## 'కల్కి'లో కృష్ణుడి రోల్‌లో నటించింది ఇతనే!



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన మైథాలజీ సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898ఎ.డి. దీపికా పదుకునే, దిశా పటాని, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం నేడు వరల్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ అయ్యింది. ఈ చిత్రం ప్రేక్షకులని, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో కొన్ని పాత్రలకు ఆడియెన్స్ ఫిదా అయిపోయారు. అందులో కృష్ణుడు పాత్ర ఒకటి. ఈ పాత్రలో ఎవరు నటించారు అనే దానిపై అందరిలో ఆసక్తి నెలకొంది. అయితే ఈ చిత్రంలో కృష్ణుడి పాత్రలో నటించింది కృష్ణ కుమార్. ఈ నటుడు ఇంతకుముందు చాలా మంచి పాత్రల్లో నటించారు. సూర్య ప్రధాన పాత్రలో నటించిన ఆకాశం నీ హద్దురా చిత్రంలో కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రంలో అతని నటనకు వస్తున్న ప్రశంసల పట్ల అతను సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కల్కి చిత్రం లాంగ్ రన్ లో భారీ వసూళ్లు రాబట్టడం మాత్రమే కాకుండా, ఎన్నో రికార్డులను బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 'డబుల్ ఇస్మార్ట్' ఫస్ట్ సింగిల్ ప్రోమో



మన టాలీవుడ్ యంగ్ హీరోస్‌లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ చిత్రం డబుల్ ఇస్మార్ట్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం కోసం అభిమానులు మంచి కేజ్రీగా ఎదురు చూస్తుండగా మాస్ అండ్ డాషింగ్ దర్శకుడు పూరి జbగన్నాథ్ ఓ రేంజ్ సినిమాని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌పై ఇప్పటికే మంచి బజ్ నెలకొనగా ఇపుడు దీని తాలూకా ఫస్ట్ ప్రోమోని మేకర్స్ రిలీజ్ చేశారు. మరి ఇది మాత్రం మరో చార్ట్ బస్టర్‌లా అనిపిస్తుంది అని చెప్పాలి. గతంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ ఫస్ట్ సింగిల్ ఏ రేంజ్‌లో కిక్ ఇచ్చిందో దానికి డబుల్ కిక్ ఇచ్చే బీట్స్‌ని మణిశర్మ అందించగా రామ్ మాస్ స్లాంగ్‌తో ఈ ప్రోమో అదిరిపోయింది అని చెప్పాలి. ఇక ఈ ఫుల్ సాంగ్ అయితే ఈ జూలై 1న రిలీజ్ చేస్తున్నట్టుగా ఈ ప్రోమోతో రివీల్ చేశారు. మరి ఇదెలా ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తుండగా ఈ ఆగస్ట్ 15న సినిమా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతుంది.

## నీట్ కుంభకోణం... గుజరాత్‌లో సీబీఐ సోదాలు

### నాలుగు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో తనిఖీలు

### స్కూలు ప్రిన్సిపల్, జర్నలిస్టు సహా ముగ్గురి అరెస్టు

**న్యూఢిల్లీ :** వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌యూజీసీ పరీక్షలో వెలుగుచూసిన అక్రమాపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు ముమ్మురంగా సాగుతోంది. గుజరాత్‌లోని ఏడు ప్రాంతాల్లో శనివారం సోదాలు చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ఆనంద్, ఖేడా, అహ్మదాబాద్, గోద్రా జిల్లాల్లోని అనుమానమున్న ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. జార్ఖండ్, హజారీబాగ్‌లోని ఓయాసిస్ స్కూలు ప్రిన్సిపల్ ఎహసానుల్ హక్, వైస్ ప్రిన్సిపల్ ఇంతియాజ్ ఆలంతో పాటు హిందీ పత్రిక జర్నలిస్టు జమాలుద్దీన్ అన్సారీని సీబీఐ అరెస్టు చేసింది. ప్రేపర్ లీక్ చేసేందుకు హక్, ఆలంకు అన్సారీ మద్దతిచ్చినట్లు ఆరోపించింది. నీట్‌యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో సీబీఐ ఇప్పటివరకు మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఇందులో ఒకటి కేంద్ర విద్యాశాఖ సూచనల మేరకు సీబీఐ సొంతంగా నమోదు చేయగా మిగతా ఐదు... వేర్వేరు రాష్ట్రాల్లో ఈ కేసుల దర్యాప్తు బాధ్యతలను చేపట్టిన క్రమంలో నమోదయ్యాయి. బీహార్, గుజరాత్‌లో చెరొక కేసు ఉండగా రాజస్థాన్‌లో మూడు కేసులు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర విద్యాశాఖ ఈనెల 22న పేపర్ లీకేజిపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించింది. దీంతో 23వ తేదీన సీబీఐ తొలి ఎఫ్ఐఆర్ దాఖలు చేసి విచారణ చేపట్టింది. మే 5న జరిగిన నీట్‌యూజీసీ పరీక్షలో అక్రమాలు వెలుగుచూడటం విదితమే.

## వృత్తి విద్యకు ఇడబ్ల్యూఎస్ కోటా వద్దు

### సీపీఐ పుదుచ్చేరి డిమాండ్

**చెన్నై:** వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఇడబ్ల్యూఎస్)లకు ఉన్న10శాతం కోటా అమలు చేయొద్దని ఏఐఎన్ఆర్‌సీబీజేపీ ప్రభుత్వాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ పుదుచ్చేరి కార్యదర్శి ఏఎం సలీం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాను పుదుచ్చేరిలోని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని భావిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య కోర్సులలో 10శాతం రిజర్వేషన్ అమలు చేసే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలదేనని గుర్తుచేశారు. తమ రాష్ట్రంలో దీనిని అమలు చేయమని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించిందని, తమిళనాడు వలే భాష, సంస్కృతి, ఆచరాలు కలిగిన పుదుచ్చేరిలోనూ ఇదే తరహా నిర్ణయం తీసుకోవడం సుమచితమని సలీం పేర్కొన్నారు. కోటాను అమలు చేస్తే సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను సెంటాక్ ఇప్పటికే మొదలు పెటినందున ఈడబ్ల్యూఎస్ కోటాపై నిర్ణయాన్ని ముఖ్యమంత్రి వెంటనే తీసుకోవాలని కోరారు. 2022, నవంబరు 4న సామాజిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నేతలు ఇదే అంశమై కలిసినప్పుడు ఈడబ్ల్యూఎస్ కోటా వ్యవహారాన్ని తప్పక పరిశీలిస్తానని సీఎం హామీనిచ్చారని సలీం గుర్తుచేశారు. వృత్తికోర్సుల్లో అణగారిన వర్గాల పిల్లలకు అన్యాయం జరగకుండా ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## యుజిసినెట్, సీఎస్ఐఆర్‌నెట్ పరీక్షా తేదీలొచ్చాయ్

**న్యూఢిల్లీ:** అక్రమాలు జరిగిన కారణంగా రద్దు అయిన కొన్ని పరీక్షలను తిరిగి నిర్వహించబోయే తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం ప్రకటించింది. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జాతీయ అర్హత పరీక్ష (యూజీసీనెట్) జరుగుతుందని తెలిపింది. అలాగే కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) యూజీసీనెట్ పరీక్ష జులై 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్నట్లు ప్రకటించింది. జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్‌సెట్) జులై10న జరుగుతుందని వెల్లడించింది.

## 'ఎమర్జెన్సీ' అంశం ఇప్పుడెందుకు?: శరద్ పవార్



**ముంబయి:** 'ఎమర్జెన్సీ' అంశంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ స్పందించారు. స్థాయికి తగినట్లు ఆయన సభలో మాట్లాడలేదని విమర్శలు గుప్పించారు. శనివారం కొల్హాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న పవార్ స్పీకర్‌పై ఈ వ్యాఖ్యలు చేశారు. 'లోక్‌సభ స్పీకర్ పదవిలో ఉన్న ఓం బిర్లా అసందర్భంగా ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారు. ఇది ఆయన స్థాయికి ఏమాత్రం తగదు. ఆ చీకటి అధ్యాయం ముగిసి 50 ఏళ్లు కావొస్తోంది. ప్రస్తుతం ఈ అంశాన్ని తెర మీదకు ఎందుకు తీసుకొస్తున్నారు? రాజకీయంగా ఇలాంటి ప్రకటనలు చేయడం స్పీకర్ విధుల్లో భాగమా? ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు' అని శరద్ పవార్ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలోనూ 'ఎమర్జెన్సీ' అంశాన్ని చేర్చారని, ఇది అనవసరమని అంశమన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని ఎన్నుకోవడాన్ని పవార్ స్వాగతించారు. రాహుల్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. బిజెపిపై పవార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని ఆ పార్టీ నినదించడానికి ముందు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే ముందు బిజెపికి ఎన్ని సీట్లు ఉన్నాయని, ఎన్నికల తరువాత ఎన్ని సీట్లు వచ్చాయో గుర్తుచేసుకోవాలని చురకలంటించారు. 'పార్లమెంట్‌లో బిజెపి మెజారిటీ లేదనడంలో ఏ సందేహం లేదు. బీహార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు నీతీశ్‌కుమార్, చంద్రబాబు మద్దతు లేకుంటే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేకపోయేవారు. దీన్ని మోదీ సర్కార్ అంగీకరించకపోయినా.. దేశ ప్రజలకు వాస్తవమేంటో స్పష్టం అవుతోంది' అని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని మోదీ మహారాష్ట్రలోని 18 నియోజకవర్గాల్లో జరిగిన ర్యాలీల్లో పాల్గొన్నారని, అందులో 14 నియోజకవర్గాల్లో మహాయుతి (ఎన్‌డిఎ కూటమి) అభ్యర్థులు ఓటమి పాలయ్యారని పవార్ చెప్పారు. అయితే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యమైనన్ని నియోజకవర్గాల్లో మోదీ ప్రచారం చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) సంసిద్ధతపై పవార్ మాట్లాడుతూ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపి అన్ని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలద్కు మద్దతు తెలిపాయన్నారు. ఎంవిఎ పనితీరుపై ప్రశ్నించగా, రాష్ట్రంలో 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 155 సీట్లలో ఆధిక్యంలో ఉన్నామని, ఇదే కొనసాగితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు.

**రాష్ట్ర బడ్జెట్ ఓ వ్యూహం..**

కాగా.. మహారాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంపై శరద్ పవార్ తీవ్ర విమర్శలు చేశారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నం మాత్రమేనని అన్నారు. 'ఇచ్చిన వాగ్దానాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. మన దగ్గర రూ.70 ఉన్నప్పుడు రూ.100 ఎలా ఖర్చు చేయగలమో ఆలోచించండి? అధికారం చేజిక్కించుకునేందుకు ఇదొక వ్యూహం మాత్రమే. ఈ బడ్జెట్‌ను స్వీకరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరు' అని పేర్కొన్నారు.

## జియో టెలికాం బాటలోనే టారిఫ్‌లు పెంచిన భారతి ఎయిర్‌టెల్, ఒడాఫోన్

**న్యూఢిల్లీ :** జియో టెలికాం బాటలోనే భారతి ఎయిర్‌టెల్, ఒడాఫోన్, ఐడియాలు కూడా మొబైల్ టారిఫ్‌లను పెంచేశాయి. సుమారు 11–20 శాతం, 10–25 శాతం స్థాయిలో ఈ పెరుగుదల ఉంది. వినియోగదారునిపై సగటు రాబడి(ఏఆర్‌పియు)ను పెంచుకునేందుకు ధరలను పెంచినట్లు ఆ సంస్థలు చెబుతున్నాయి. 2022లో 5జి ఎయిర్‌వేస్‌ను భారీ ధరలు చెల్లించినందుకు , వాటిపై రాబడి పెంచుకోవాలని ఎయిర్‌టెల్, జియో, మరింత పోటీ ఇచ్చేందుకు రూ.23వేల కోట్లు సమీకరించుకునేందుకు ఒడాఫోన్ ఐడియా ఈ ధరలను పెంచినట్లు చెబుతున్నారు. ధరల పెంపుతు మూఢ టెలికామ్ ఆపరేటర్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని ద్వితీయ, తృతీయ త్రైమాసికంలో 13–17 శాతం ఎఆర్‌పియును పెంచుకుంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. టారిఫ్‌ల పెంపు తరువాత వినియోగదారులు ఏటా అదనంగా రూ.47వేల కోట్ల వరకు టెలికాం కంపెనీలకు చెల్లించాల్సి వస్తుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## జడ్జిలు రాజ్యాంగ సేవకులు... దేవుళ్లు కాదు: సిజెఐ



**కోల్‌కతా:** న్యాయమూర్తులను దేవుళ్లతో పోల్చడం అత్యంత ప్రమాదకరమని, వాస్తవానికి వారు రాజ్యాంగానికి సేవకులని సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. న్యాయస్థానాలను ఆలయాలతో, న్యాయమూర్తులను దేవుళ్లతో పోల్చడం చాలా ప్రమాదకరమని, మనుషులు తమను తాము దేవతామూర్తుల్లా భావించడం కంటే ప్రమాదకరం మరేమీ ఉండదన్నారు. ఈ పద్ధతిని ప్రజలు మానుకోవడం శ్రేయస్కరమని చెప్పారు. 'కోర్టును న్యాయాలయమని వ్యవహరిస్తే జడ్జిలు... దేవుళ్లు అవుతారు. ఇది సరి కాదు. వాళ్లు ప్రజా సేవకులు, రాజ్యాంగానికి సేవకులు. కరుణ, సానుభూతితో ప్రజలకు న్యాయం చేసే వారు' అని సీజేఐ ఉద్ఘాటించారు. 'కంటెంపరరీ జ్యుడిషియల్ డెవలప్‌మెంట్స్ స్ట్రెంతెనింగ్ జస్టిస్ థ్రూ లా అండ్ టెక్నాలజీ' పేరిట కోల్‌కతాలో జరిగిన జాతీయ జుడిషియల్ అకాడమీ ప్రాదేశిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు సేవ చేయడం న్యాయమూర్తుల విధి అని స్పష్టంచేశారు. 'న్యాయమూర్తులను ఆనర్, లార్డ్‌షిప్/లేడీషిప్‌గా వ్యవహరిస్తారు. కోర్టులను న్యాయాలయాలుగా వర్ణిస్తారు. ఆలయాల్లో ఉండే దేవళ్లతో జడ్జిలను పోల్చుతారు. ఈ ధోరణి ఎంతో ప్రమాదకరం. న్యాయమూర్తుల పాత్ర ప్రజలకు సేవ చేయడం... సానుభూతి, దయ, కరుణతో తీర్పులు ఇవ్వడం... సామాన్యులకు న్యాయం చేయడం... నేరస్తుల విషయంలో మానవతా దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవడం... శిక్షలు విధించడం' అని సీజేఐ తెలిపారు. కేవలం సుప్రీంకోర్టు, హైకోర్టుల్లోనే కాకుండా జిల్లా స్థాయి కోర్టుల్లోనూ న్యాయమూర్తులు రాజ్యాంగ బద్ధ నైతికతను కలిగివుండటం ఎంతో ముఖ్యమని నొక్కి చెప్పారు. న్యాయ వ్యవస్థ పనితీరులో సాంకేతికత కీలకమని, కోర్టు తీర్పులు సామాన్యులకు అర్థమయ్యేలా స్థానిక భాషల్లో అనువదించడం అవసరమని అన్నారు. టెక్నాలజీ మనకు కొన్ని సమాధానాలు ఇస్తుందని చెప్పారు. తీర్పులు సాధారణంగా ఆంగ్లంలోనే ఉంటాయని, సాంకేతికత సాయంతో వాటిని అనువదించి సామాన్యులకు అందుబాటులోకి తీసువస్తున్నామని, 51వేల తీర్పులను వేర్వేరు భాషల్లోకి అనువదించామని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు.

## లడాఖ్‌లో ఐదుగురు జవాన్ల మృతి

### సైనిక విన్యాసాలు చేస్తుండగా ఆకస్మిక వరదలు..

**లేహ్ :** కేంద్ర పాలిత ప్రాంతం లఢఖ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. వాస్తవాధీన రేఖ సమీపంలో గల న్యోమా–చుషుల్ ప్రాంతంలో భారత సైన్యం విన్యాసాలు చేస్తుండగా ష్యోక్ నదిలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ ఘటనలో జూనియర్ కమిషన్డ్ అధికారి సహా ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. లేహ్‌కు 148 కిలోమీటర్ల దూరంలోని బోధి నదిలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విన్యాసాల్లో భాగంగా యద్ధ ట్యాంక్‌లతో నదిని దాటుతుండగా ఈ వరదలు సంభవించాయి. దీంతో నదిలో నీటి ఉద్ధృతి పెరిగి టి–72 ట్యాంక్ మునిగిపోయింది. అందులోని ఐదుగురు జవాన్లు నదిలో కొట్టుకుపోయారు. అప్రమత్తమైన సైన్యం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. జవాన్ల కోసం నదిలో గాలించింది. అయితే, దురదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. ఐదుగురి మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. జవాన్ల మృతిపట్ల భారత ఆర్మీ విచారం వ్యక్తం చేసింది. కాగా, ప్రమాదంపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ట్యాంక్‌తో నదిని దాటుతుండగా జరిగిన దురదృష్టకర ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. దేశం కోసం మన సైనికుల అపార సేవను ఎప్పటికీ మర్చిపోలేం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుంది'' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, పార్టీ నాయకులు ప్రియాంకాగాంధీ కూడా జవాన్ల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ మమ్మల్ని జైల్లో పెట్టారు... దూషించలేదు: లాలు



**పాట్నా:** ఎమర్జెన్సీ అమలైనప్పుడు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అనేక మంది నాయకులను జైళ్లలో పెట్టారు కానీ వారిని ఎన్నడూ దూషించలేదని, దేశద్రోహులుగా ముద్రవేయలేదని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు. 1975లో కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీపై పార్లమెంటులో రగడ జరిగిన క్రమంలో లాలు వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అప్పట్లో జైలుకు వెళ్లిన నేతల్లో ఆయన ఒకరు. అయితే ప్రస్తుతం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతూ స్వాతంత్ర్యంపై ఉద్బోధించే బీజేపీ నేతలెవ్వరూ తమకు అప్పట్లో తెలియదని లాలూ ప్రసాద్ యాదవ్ శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. జర్నలిస్టు నళిన్ వర్మతో కలిసి 'ది సంఘ్ సైలెన్స్ ఇన్ 1975' (1975లో సంఘ్ మౌనం) శీర్షికన ఆయన రాసిన వ్యాసాన్ని సామాజిక మాధ్యమం వేదికగా పంచుకున్నారు. ఎన్డీయే ప్రభుత్వాన్ని ఆ వ్యాసంలో విమర్శించారు. '1975లో ప్రజాస్వామ్యం గడ్డు కాలాన్ని అనుభవించింది సరే.... 2024లో విపక్షాన్ని గౌరవించనది ఎవరో మనం మర్చిపోరాదు' అని బీహార్ మాజీ సీఎం వ్యాఖ్యానించారు. ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని సాగించేందుకు ఏర్పాటైన జయప్రకాశ్ నారాయణ నేతృత్వ స్టీరింగ్ కమిటీకి కన్వీనర్‌గా తాను వ్యవహరించినట్లు లాలు గుర్తుచేశారు. అప్పట్లో భద్రతా చట్టం (మిసా) కింద 15 నెలల జైల్లో గడిపినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతున్న చాలా మంది బీజేపీ మంత్రులు తనకుగానీ తన సహచరులకుగానీ తెలియదని, మోదీ, నడ్డా వంటి వారి పేర్లు కూడా వినలేదని లాలు చెప్పారు. స్వాతంత్ర్యం విలువలపై ఉపన్యాలు ఇస్తున్న మంత్రులు తమకు పరిచయం లేరన్నారు. 'అప్పట్లో ఇందిరా గాంధీ చాలా మందిని జైలుకు పంపారు కానీ ఎప్పుడూ దూషించలేదు. ఆమెగానీ ఆమె మంత్రులుగానీ మమ్మల్ని దేశద్రోహులు అనలేదు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్మారకార్థం విధ్వంసం చేయలేదు. 1975లో ప్రజాస్వామ్యం గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నదికానీ 2024లో ప్రతిపక్షాన్ని ఏ మాత్రం గౌరవించని వారిని మరువరాదు' అని లాలు ప్రసాద్ యాదవ్ ట్వీట్ చేశారు.